ప్రకటనల కోసం సంప్రదించండి
98483 28698

తెలంగాణ స్వరాష్ట్ర సమరయోధ పత్రిక
Estd : 2002
# జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం 08.09.2026 | సంపుటి : 13 సంచిక : 50 | పేజీలు : 12 వెల : రూ. 4/-
RNI NO.TELTEL / 2013 /50370




హైదరాబాద్ | Simultaneously Published from Hyderabad & Karimnagar | ఎడిటర్ : ఎం.ఎం. రహమాన్

### అసెంబ్లీ గేటు వద్దే..

# బీఆర్ఎస్ సభ్యులను అడ్డుకున్న పోలీసులు



## టీషర్టులపై రాతలు అభ్యంతరకరం
## స్పీకర్ ఆదేశాలతో అడ్డుకున్న పోలీసులు

- టీషర్టులు విప్పి.. బనియన్లతో నిరసన తెలిపిన బీఆర్ఎస్ నేతలు
- మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం: కేటీఆర్
- ఇది శాసన సభా.. లేక కౌరవ సభా?: హరీశ్‌రావు

హైదరాబాద్(జనంసాక్షి): అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీ సులు అడ్డుకున్నారు. నినాదాలు రాసి ఉన్న నల్ల టీషర్టులతో బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు యత్నిం చారు. పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీషర్టులు విప్పి హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు బనియన్లతో అక్కడే నిరసన తెలిపారు. దీంతో ఇరు వర్గాల మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. హరీశ్‌రావు తోపాటు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. మరోవైపు అసెంబ్లీ ప్రవేశ ద్వారం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి కన్నీళ్లు పెట్టుకు న్నారు. పోలీసులు తనపట్ల అమానుషంగా ప్రవర్తిం చారని ఆవేదన వ్యక్తం చేశారు. నిరసనల మధ్య మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి స్పృహ తప్పి పడిపోయారు. మిగతా 2లో..

### 22ఏ పేరుతో జరుగుతోన్న భూదందాపై నిలదీస్తాం:కేటీఆర్

2లో..

### అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

- పోలీసులకు హైకోర్టు ఆదేశం
- ఉల్లంఘనపై స్పీకర్ చర్యలు తీసుకుంటారు
- హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ

అసెంబ్లీ ప్రాంగణంలో బీఆర్ఎస్ సభ్యులు, పోలీసుల మధ్య జరిగిన తోపులాటలో సొమ్మసిల్లి పడిపోయిన బీఆర్ఎస్ ఎమ్మెల్యే జగదీశ్ రెడ్డి..



పోలీసులు తనతో అవమానకరంగా ప్రవర్తించారంటూ కంటతడి పెట్టుకున్న బీఆర్ఎస్ ఎమ్మెల్యే సునీతా లక్ష్మారెడ్డి

మాజీ హోంమంత్రి సబితా ఇంద్రారెడ్డి జుట్టు పట్టుకొని, గొంతు పిసికే ప్రయత్నం చేశారు. సబితా ఇంద్రారెడ్డిపై దాడికి బాధ్యుడు రేవంత్‌రెడ్డే. కోవా లక్ష్మి లేకుంటే సునీతా లక్ష్మారెడ్డి ఇనుప కంచెలపై పడేవారు. శాసనసభ దుశ్శాసన పర్వంలా మారింది. డిస్ట్రక్షన్, డిస్ట్రాక్షన్, డైవర్షన్ మాత్రమే రేవంత్‌రెడ్డికి తెలుసు. మాహిళలపై దాడిని కప్పిపుచ్చేందుకు డైవర్షన్ పాలిటిక్స్ చేశారు. మా ఆడబిడ్డలకు క్షమాపణలు చెప్పేదాకా వదలిపెట్టం. హోంమంత్రిగా రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందే"
- బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

# తాతా మధును డిస్మిస్ చేయాలి

## స్పీకర్‌పై ఆయన అనుచిత వ్యాఖ్యలు జుగుప్సాకరం
## నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగింది

- స్పీకర్‌పై ఆయన అనుచిత వ్యాఖ్యలు అత్యంత జుగుప్సాకరం
- నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగింది
- బీఆర్ఎస్ సభ్యులను స్పీకర్ పైకి కేసీఆరే ఉసిగొల్పారు
- ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదు.. పథకం ప్రకారం జరిగిందే
- సభాపతికి జరిగిన అవమానం.. సభ్య సమాజానికి జరిగిన అవమానం
- ప్రతిపక్ష నేతగా కేసీఆర్ క్షమాపణ చెప్పాలి
- తాతా మధుతో రాజీనామా చేయించాలి
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి
- కేసీఆర్ స్పందించాలి:మంత్రి శ్రీధర్‌బాబు



"ఈరోజు నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగింది. బీఆర్ఎస్ సభ్యులను నిన్న కేసీఆర్ పిలిపించుకుని నేడు స్పీకర్ పైకి ఉసిగొల్పారు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదు.. పథకం ప్రకారం జరిగిందే. సభాపతికి జరిగిన అవమానం.. సభ్య సమాజానికి జరిగిన అవమానం. స్పీకర్‌పై జుగుప్సాకరమైన భాష ఉపయోగించడమేంటి? దళితులను మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్. దళితుడిని సీఎం చేస్తానని, వారికి మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి కేసీఆర్ మోసం చేశారు. బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక ఆలోచన
- అసెంబ్లీలో సీఎం రేవంత్ రెడ్డి

హైదరాబాద్(జనంసాక్షి): శాసనసభ స్పీకర్ ప్రసాద్‌కుమార్‌కు అవమానం జరిగిన నేడు.. తెలంగాణకు చీకటి రోజని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. స్పీకర్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ ఆరోపిస్తున్న విషయం తెలిసిందే. ఈనేపథ్యంలో శాసనసభలో రేవంత్‌రెడ్డి మాట్లాడారు. "ఈరోజు నాలుగు కోట్ల ప్రజలకు అవమానం జరిగింది. బీఆర్ఎస్ సభ్యులను నిన్న కేసీఆర్ పిలిపించుకుని నేడు స్పీకర్ పైకి ఉసిగొల్పారు. ఇది అనాలోచితంగా జరిగిన చర్య కాదు.. పథకం ప్రకారం జరిగిందే. సభాపతికి జరిగిన అవమానం.. సభ్య సమాజానికి జరిగిన అవమానం. స్పీకర్‌పై జుగుప్సాకరమైన భాష ఉపయోగించడమేంటి? దళితులను మోసం చేసిన పార్టీ బీఆర్ఎస్. దళితుడిని సీఎం చేస్తానని, వారికి మూడెకరాల భూమి ఇస్తామని చెప్పి కేసీఆర్ మోసం చేశారు. బీఆర్ఎస్‌ది దళిత వ్యతిరేక ఆలోచన.

**కేసీఆర్ క్షమాపణ చెప్పాలి**

సభాపతికి జరిగిన అవమానం.. మా అందరికీ జరిగినట్లు భావిస్తున్నాం. దీన్ని అందరూ ముక్తకంఠంతో ఖండించాలి. స్పీకర్‌కు జరిగిన అవమానం సభకు జరిగినట్లుగానే భావించాలి. బీఆర్ఎస్ నేతల అపవాదును భాజపా నేతలు ఎందుకు మోస్తున్నారు? ఈ అంశంపై చర్చకు భాజపా సభ్యులు సహకరించాలి. దీనిపై చర్చ తర్వాతే ఏ అంశంపైనైనా చర్చిద్దాం. స్వతంత్ర భారతంలో ఇలాంటి అవమానం గతంలో ఎప్పుడూ జరగలేదు. ఇలాంటి భాష వాడిన తాతా మధును డిస్మిస్ చేయాలి. ప్రతిపక్ష నేతగా కేసీఆర్ క్షమాపణ చెప్పాలి. అసభ్యకర భాష వాడిన తాతా మధుతో మిగతా 2లో..



### స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి

హైదరాబాద్(జనంసాక్షి): తెలంగాణ శాసనసభ గడ్డం స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి పెట్టుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలను ఖండిస్తూ మిగతా 2లో..

### నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నా..

అనని మాటలను నాకు ఆపాదించడం సరికాదు

స్పీకర్‌ను అన్నట్లు భావిస్తే నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా : తాతా మధు



హైదరాబాద్ (జనంసాక్షి): శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్ కుమార్ అంటే తనకు గౌరవముందని బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు అన్నారు. అనని మాటలను తనకు ఆపాదించడం సరికాదని చెప్పారు. "స్పీకర్‌ను నేనేమీ అనలేదు. ఆయన్ను అన్నట్లు భావిస్తే నా వ్యాఖ్యలను ఉపసంహరించుకుంటున్నా. మిగతా 2లో..

### తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే

# కుట్ర జరుగుతోంది

## ఎస్ఐఆర్‌ను ఆయుధంగా చేసుకుని బీజేపీ వ్యతిరేక ఓట్లను తొలగిస్తున్నారు

- పేదలు, గిరిజనుల ఓట్లనూ వదలడంలేదు - దీనిపై లౌకిక శక్తులు ఏకం కావాలి
- ఇంత జరుగుతున్నా బీఆర్ఎస్ నేతలు నోరెత్తకపోవడం శోచనీయం
- సీపీఎం నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణసభలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి

హైదరాబాద్,సెప్టెంబర్7(జనంసాక్షి): తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోందని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఆరోపించారు. ఓటర్ల జాబితా సవరణ (సర్) ప్రక్రియపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. వ్యతిరేక ఓటర్లను గుర్తించేందుకు బీజేపీ ప్రత్యేక ఏజెన్సీలను ఏర్పాటు చేసిందని విమర్శించారు. 2009 నుంచి ఓటింగ్ సరళిని పరిశీలించి బీజేపీకి వ్యతిరేకంగా ఉన్నవారి ఓట్లు తొలగిస్తున్నారని ఆరోపించారు. రవీంద్రభారతిలో నేడు రైతు నేత సారంపల్లి మల్లారెడ్డి సంస్మరణ సభ జరిగింది. ఈ కార్యక్రమంలో సీఎం మాట్లాడారు. నరేంద్ర మోదీ విధానాలకు వ్యతిరేకంగా వ్యవస్థ మొత్తం సిద్ధమవుతోందని అన్నారు. అందుకే ఎస్ఐఆర్ పేరుతో కొత్త కుట్రలకు తెరలేపారని ఆరోపించారు. తెలంగాణలో కోటి ఓట్లు తొలగిస్తున్నా బీఆర్ఎస్ స్పందించడం లేదని మండిపడ్డారు. తన నియోజకవర్గం కొడంగల్‌లో వలస వెళ్లిన వేలాది మంది పేదల ఓట్లను తొలగిస్తున్నారని రేవంత్ రెడ్డి ఆరోపించారు. కొడంగల్‌లో 81 వేల ఓట్లను అనామలీస్ జాబితాలో చేర్చారని తెలిపారు. ప్రస్తుత ఓట్లతోనే 2029లో మోదీ ఓటమికి పునాది పడుతుందని అన్నారు. బీజేపీ వ్యతిరేక ఓట్లు అంటే మైనార్టీలవే అనుకోవద్దని సీఎం చెప్పారు. పేదలు, గిరిజనుల ఓట్లను తొలగించే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. జాతీయ స్థాయిలో లౌకిక శక్తులు ఏకమై మోదీకి వ్యతిరేకంగా పోరాడాల్సిన అవసరం ఉందన్నారు. రైతుల కోసం జీవితాన్ని అంకితం చేసిన సారంపల్లి మల్లారెడ్డి మరణం రైతాంగానికి తీరని లోటని సీఎం అన్నారు. రైతు సమస్యలపై అవగాహన ఉన్న నాయకత్వం క్రమంగా తగ్గుతోందని పేర్కొన్నారు. కౌలు రైతులు, గిట్టుబాటు ధరలు సహా అనేక రైతు సమస్యలపై సారంపల్లికి అపారమైన అవగాహన ఉందని కొని యాడారు. కమ్యూనిస్టు ఉద్యమాల పోరాటాల మిగతా 2లో..

### అసెంబ్లీ సెంట్రల్ హాల్‌ను ప్రారంభించిన సీఎం రేవంత్

2లో..



"తెలంగాణలో సర్ ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత దీనికి వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది ఎస్ఐఆర్'
'- ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి,

# 12 వరకు అసెంబ్లీ

- వారం దాకా మండలి నిర్వహణ
- బీఏసీ భేటీలో నిర్ణయం
- 22ఏ అంశంపై చర్చకు సిద్ధం:
- బీఏసీ సమావేశంలో ఈ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటాం : శ్రీధర్‌బాబు



శాసనసభ, మండలి సమావేశాల నిర్వహణపై జరిగిన బిజినెస్ అడ్వైజరీ కమిటీ (బీఏసీ) సమావేశాల్లో పలు కీలక నిర్ణయాలు తీసుకున్నారు. ఈ మేరకు ఉభయ సభలను ఈనెల 12 వరకు నిర్వహించాలని బీఏసీలో ప్రాథమికంగా నిర్ణయించారు. సమావేశాల పొడిగింపుపై అవసరమైతే మరోసారి మిగతా 2లో..

# కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటు


- ఇరిగేషన్ విషయంలో ఆయన చేసిన తప్పులే ప్రస్తుత సమస్యలకు కారణం
- తానే ఇంజనీర్ అంటూ కేసీఆర్ కాళేశ్వరం కట్టించి చివరకు కూల్చేశారు
- నీళ్ల సమస్యకు ఒకటి ఎల్‌నినో అయితే మరొకటి కేసీఆర్...
- అసెంబ్లీ లాబీలో మీడియాతో చిట్‌చాట్‌లో మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డి



హైదరాబాద్(జనంసాక్షి): కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటని మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి విమర్శించారు. అసెంబ్లీ లాబీలో మీడియాతో మంత్రి ఉత్తమ్ చిట్‌చాట్‌గా మాట్లాడారు."నేనే ఇంజనీర్ అంటూ కేసీఆర్ కాళేశ్వరం కట్టించి.. చివరకు కూల్చేశారు. కాళేశ్వరం నిర్మాణానికి లక్ష కోట్లు ఖర్చు చేసినా.. సరిగా నిర్మించకపోవడం వల్లే ప్రస్తుత సమస్యలు వచ్చాయి. మిగతా 9లో..

### కుప్పకూలిన ఐదంతస్తుల భవనం..

# ఏడుగురి మృతి



- ఇంకా శిథిలాల కిందే చిక్కుకున్న పలువురు విద్యార్థులు
- 12 మంది సురక్షితంగా బయటకు..
- యజమానికి లుకౌట్ నోటీసులు

న్యూఢిల్లీ(జనంసాక్షి):దేశ రాజధాని ఢిల్లీలో ఐదంతస్తుల భవనం కూలిన ఘటనలో దర్యాప్తు ముమ్మరంగా కొనసాగుతోంది. ఈ భవన యజమాని హరిరామ్‌పై పోలీసులు లుకౌట్ నోటీసులు జారీ చేశారు. అతడి కోసం గాలింపు చేపట్టారు. ఢిల్లీ విశ్వవిద్యాలయం దక్షిణ ప్రాంగణానికి సమీపంలో సత్యనికేతన్ వద్ద ఆదివారం మధ్యాహ్నం మిగతా 2లో..

### అధికారులు బాధ్యతగా ఉంటే ఇలా జరిగేది కాదు

ఘటనపై ఢిల్లీ హైకోర్టు

న్యూఢిల్లీ(జనంసాక్షి): దేశ రాజధానిలో ఐదంతస్తుల హాస్టల్ భవనం కూలిన ఘటనపై ఢిల్లీ హైకోర్టు ఆందోళన వ్యక్తం చేసింది. భవన నిర్మాణానికి అనుమతి ఇచ్చిన అధికారులు తమ విధులను బాధ్యతగా నిర్వర్తించి ఉంటే ఈ విషాదం జరిగేది మిగతా 2లో..

# తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

అక్టోబర్ 7 వరకు పొడిగిస్తూ ఈసి నిర్ణయం


నవంబర్ 9న తుది ఓటర్ల జాబితా విడుదల



న్యూఢిల్లీ,సెప్టెంబర్7(జనంసాక్షి): తెలంగాణలో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (సర్) కార్యక్రమం గడువును కేంద్ర ఎన్నికల సంఘం పొడిగించింది. జాబితాపై అభ్యంతరాలు, క్లెయిమ్‌లు దాఖలు చేసేందుకు అక్టోబర్ 7వ తేదీ వరకు అవకాశం కల్పించింది. ఈ మేరకు సవరించిన షెడ్యూల్‌ను ఈసీ విడుదల చేసింది. గతంలో పొడిగించిన షెడ్యూల్ ప్రకారం ఈ గడువు సెప్టెంబర్ 16తో ముగియాల్సి ఉంది. అయితే, ఓటర్ల జాబితా సవరణ ప్రక్రియకు మరింత సమయం కావాలని మిగతా 9లో..

# రక్షణ రంగానికి ఊతం

రూ.1.10 లక్షల కోట్లతో సైనిక కొనుగోళ్లకు ఆమోదం



న్యూఢిల్లీ(జనంసాక్షి):భారత త్రివిధ దళాల సామర్థ్యాలను మరింత బలోపేతం చేసే దిశగా రక్షణశాఖ కీలక నిర్ణయం తీసుకుంది. రూ.1.10 లక్షల కోట్ల వ్యయంతో సైనిక సామగ్రి కొనుగోలుకు పచ్చజెండా ఊపింది. రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన సమావేశమైన 'రక్షణ కొనుగోళ్ల మండలి' (డీఏసీ).. సంబంధిత ప్రతిపాదనలకు ఆమోదం తెలిపింది. రాడార్లు, అధునాతన తేలికపాటి హెలికాప్టర్లు, మెకానికల్ మైన్ లేయర్ (మందుపాతరలు అమర్చే వాహనాలు)లు వంటివి ఇందులో ఉన్నాయి. ఈ కొనుగోళ్లలో 98 శాతం దేశీయంగానే చేయనున్నారు.డీఏసీ మిగతా 9లో..

# ఇస్రో ప్రైవేటీకరణ ఉండదు

ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలపై వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తాం: చైర్మన్ వి.నారాయణన్



9లో..

జనంసాక్షి www.janamsakshi.org
మంగళవారం 08.09.2026

# తెలంగాణలో కోటి ఓట్లను తొలగించే కుట్ర జరుగుతోంది

వల్లే కాంగ్రెస్ పలు చట్టాలు తీసుకొచ్చిందని రేవంత్ రెడ్డి అన్నారు. కార్మికులు, పేదల సమస్యలపై కమ్యూనిస్టులు చేసిన పోరాటాలు తమ ప్రభుత్వ ఏర్పాటుకు ప్రత్యక్షంగా, పరోక్షంగా దోహదపడ్డాయని చెప్పారు. తెలంగాణలో సర్? ప్రక్రియ మొదలవ్వకముందు ప్రధాన ప్రతిపక్షం మాట్లాడింది. కోటి ఓట్లు తొలగించిన తర్వాత సర్‌కు వ్యతిరేకంగా వారు ఒక్కమాట కూడా మాట్లాడటం లేదు. బీజేపీ కుట్రపూరితంగా వ్యవహరిస్తున్నప్పుడు ప్రధాన ప్రతిపక్షం ఆ అంశాన్ని లేవనెత్తడం లేదు. 2029లో జరగబోవు ఎన్నికల్లో నరేంద్రమోదీ ఓటమికి ఈ ఓట్లతోనే పునాది పడుతుంది. ఈ ఓట్లు తొలగిస్తే మోదీకి వెయ్యేనుగుల బలం చేకూరుతుంది. ఎన్నికలు ఎప్పుడో ఉన్నాయి అప్పుడు చూద్దామనుకోవద్దు. గెలుపోటములను నిర్ణయించేంది ఎస్?ఐఆర్ అని అన్నారు. వ్యవసాయం గురించి సాధికారంగా మాట్లాడగలిగిన వ్యక్తి సారంపల్లి మల్లారెడ్డి అని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. భూమిలోని సారం నుంచి మొదలుపెట్టి నీరు, విత్తనం, పెట్టుబడి, పంట, గిట్టుబాటు ధర.. అన్ని అంశాలు కూలంకషంగా చెప్పేవారని గుర్తుచేశారు. వ్యవసాయం గురించి అవగాహన కోసం సారంపల్లి మల్లారెడ్డి రాసిన పుస్తకాలు చదివానని తెలిపారు.


తెలంగాణ ప్రభుత్వం
ఫారం-VII

**(Declaration) రూఢీ ప్రకటన**

భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార హక్కు చట్టము 2013 (చట్టం 30/2013) సెక్షన్ 19(1) మరియు తెలంగాణ రాష్ట్ర భూసేకరణ, పునరావాస, పునఃస్థాపనలో పారదర్శకత మరియు సముచిత నష్టపరిహార నియమావళి 2014 రూల్ 25 ప్రకారము

NO. G2/1586/2025 తేది: 28.08.2026.
Gaz. No. 146/2026

నాగర్‌కర్నూల్ జిల్లా అచ్చంపేట మండలములోని చౌటపల్లి గ్రామము వద్ద అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రంగాపూర్ కెనాల్ నిర్మాణ నిమిత్తము చౌటపల్లి గ్రామా పరిధి నందు ఈ క్రింది షెడ్యూల్‌లో ఉదహరించిన ఎ.21.23 గుంటలు/సెంట్లు భూమి ప్రజా ప్రయోజనార్థం అనగా అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రంగాపూర్ కెనాల్ నిమిత్తం సేకరించవలసిన అవసరం ఉన్నదని ప్రత్యేక ఉప కలెక్టరు (భూసేకరణ) యం.జి.ఎల్.ఐ.యస్.పి నాగర్‌కర్నూల్ గారు భావిస్తున్నారు. కాబట్టి ఎ॥లు.21.23 గుం॥ భూమి అచ్చంపేట్ లిఫ్ట్ ఇరిగేషన్ క్రింద రంగాపూర్ కెనాల్ నిమిత్తం భూసేకరణ ద్వారా సేకరించుటకుగాను రూఢీ ప్రకటన చేయడమైనది. సేకరించదానికి నిర్ధారించిన భూముల వివరాలు సంక్షిప్తంగా క్రింది ప్రకారం గలవు.

**షెడ్యూల్**

గ్రామము : చౌటపల్లి | మండలం : అచ్చంపేట్ | జిల్లా : నాగర్‌కర్నూల్

| క్ర. సం. | సర్వే నెం./ ఎస్. డి. నెం. | పట్టా/ ఇనాం etc. | భూవర్గీకరణ మెట్ట /అరుతడి /తరి | భూసేకరణకు ప్రతిపాదించిన విస్తీర్ణము ఎ.సెంట్లు ఎ.గుంటలు | పట్టాదారు పేరు అనుభవదారు పేరు మరియు ఏవైనా హక్కులు గల ఇతర వ్యక్తులు | సరిహద్దులు ఉ | ద | తూ | ప | చెట్లు చెట్ల పేర్లు | చెట్ల సంఖ్య | నిర్మాణములు వర్గము | విస్తీర్ణము |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 | 9 | 10 | 11 | 12 | 13 | 14 |
| 1 | 73 | పట్టా | మెట్ట | 1.33 | పాత్లావత్‌శంకర్ తండ్రి రాములు(0.18)<br>పాత్లావత్ శారద భర్త సూర్య(0.18)<br>పాత్లవత్ రాములు తండ్రి గన్యా(0.19)<br>పాత్లవత్ లక్ష్మణ్ తండ్రి రాములు(0.18)<br>పి.సేవ్య తండ్రి రాములు<br>పి.నిరంజనమ్మ భర్త హన్మ<br>పి.భాస్కర్ తండ్రి హన్మ<br>పి.శంకర్ తండ్రి రాములు | 74 | 72/1 | 80 | 147 | లేవు | లేవు | లేవు | లేవు |
| 2 | 71 | పట్టా | మెట్ట | 5.02 | నేనావత్ హరిలాల్ తండ్రి శక్రు(0.14½)<br>నేనావత్ జాంలా తండ్రి శక్రు(0.14½)<br>నేనావత్‌లాల్య తండ్రి అంబ్రియా(0.14½)<br>నేనావత్‌చాంద్య తండ్రి అంబ్రియా(0.14½)<br>నేనావత్ శారద భర్త రాములు(0.14½)<br>నేనావత్ చంద్రకళ భర్త రాములు(0.14½)<br>నేనావత్ లక్ష్మణ్‌తండ్రి పూల్య(0.14½)<br>నేనావత్ భీమా తండ్రి పూల్య(0.14½)<br>నేనావత్‌వెంకటయ్య తండ్రి తార్య(0.14½)<br>నేనావత్‌చిన్నజాంలా తండ్రి తార్య(0.14½)<br>నేనావత్ రాములు తండ్రి కిసన్య(0.14½)<br>నేనావత్ శివ తండ్రి రాములు(0.14½)<br>నేనావత్ శాంతమ్మ భర్త హరిలాల్(0.14)<br>నేనావత్ రాములమ్మ భర్త పెద్ద(0.14)<br>నేనావత్ పూల్య తండ్రి వసురాం<br>నేనావత్ జెమ్లా తండ్రి తార్య<br>నేనావత్ జెమ్లా తండ్రి శక్రు | 69 | 72/7 | 51/1 | 70 | టేకు చెట్లు | 1 | లేవు | లేవు |
| 3 | 70 | పట్టా | మెట్ట | 0.03 | నేనావత్‌వెంకటయ్య తండ్రి తార్య(0.01½)<br>నేనావత్ చిన్నజాంలా తండ్రి తార్య(0.01½)<br>నేనావత్ భీమ్లు తండ్రి పూల్య<br>నేనావత్ శివ తండ్రి రాములు<br>జి.ఉజ్వల భర్త సతీష్ రెడ్డి<br>నేనావత్ జెమ్లా తండ్రి తార్య<br>నేనావత్ చంద్యా తండ్రి అమ్రియ<br>నేనావత్ చంద్రకళ భర్త రాములు<br>నేనావత్ హన్మంతు తండ్రి జెమ్లు<br>నేనావత్ రమేష్ తండ్రి జెమ్లు<br>నేనావత్ శాంతి భర్త జెమ్లు<br>నేనావత్ హరిలాల్ తండ్రి శక్రు<br>గంటఉజ్వల భర్త సతీష్ రెడ్డి | 69 | 80 | 71 | 80 | లేవు | లేవు | లేవు | లేవు |
| 4 | 69 | పట్టా | మెట్ట | 2.24 | నేనావత్‌హరిలాల్ తండ్రి శక్రు (0.07½)<br>నేనావత్ పెద్దజాంలా తండ్రి శక్రు(0.07½)<br>నేనావత్‌లాల్య తండ్రి అంబ్రియా(0.07½)<br>నేనావత్‌చాంద్య తండ్రిఅంబ్రియా(0.07½)<br>నేనావత్ శారద భర్త రాములు(0.07½)<br>నేనావత్‌చంద్రకళ రాములు(0.07½)<br>నేనావత్ లక్ష్మణ్ తండ్రి పూల్య(0.07½)<br>నేనావత్ భీమ్లు తండ్రి పూల్య(0.07½)<br>నేనావత్‌వెంకటయ్య తండ్రి తార్య(0.07½)<br>నేనావత్‌చిన్నజాంలా తండ్రి తార్య(0.07½)<br>నేనావత్‌రాములు తండ్రి కసన్య(0.07½)<br>నేనావత్ శివ తండ్రి రాములు(0.07½)<br>నేనావత్ శాంతమ్మ భర్త హరిలాల్(0.07)<br>నేనావత్‌రాములమ్మ భర్త పెద్దజాంలా(0.07)<br>నేనావత్ జెమ్లా తండ్రి తార్య<br>గంట ఉజ్వల భర్త సతీష్ రెడ్డి<br>సి.పారిజాత భర్త రాంరెడ్డి<br>నేనావత్ హన్మంతు తండ్రి జెమ్లు<br>నేనావత్ రమేష్ తండ్రి జెమ్లు<br>నేనావత్ శాంతి భర్త హరిలాల్ | 68 | 71 | 51/3 | 80 | టేకు చెట్లు | 17 | బోరు పైప్ లైన్ | 1<br>3 |
| 5 | 68 | పట్టా | మెట్ట | 4.10 | నేనావత్‌హరిలాల్ తండ్రి శక్రు (0.07½)<br>నేనావత్ పెద్దజాంలా తండ్రి శక్రు(0.07½)<br>నేనావత్‌లాల్య తండ్రి అంబ్రియా(0.07½)<br>నేనావత్‌చాంద్య తండ్రిఅంబ్రియా(0.07½)<br>నేనావత్ శారద భర్త రాములు(0.07½)<br>నేనావత్‌చంద్రకళ రాములు(0.07½)<br>నేనావత్ లక్ష్మణ్ తండ్రి పూల్య(0.07½)<br>నేనావత్ భీమ్లు తండ్రి పూల్య(0.07½)<br>నేనావత్‌వెంకటయ్య తండ్రి తార్య(0.07½)<br>నేనావత్‌చిన్నజాంలా తండ్రి తార్య(0.07½)<br>నేనావత్‌రాములు తండ్రి కసన్య(0.07½)<br>నేనావత్ శివ తండ్రి రాములు(0.07½)<br>నేనావత్‌శాంతమ్మ భర్త హరిలాల్(0.07½)<br>నేనావత్‌రాములమ్మ భర్తపెద్దజాంలా(0.07½)<br>మందులబాలీశ్వర్ తండ్రి బాల్‌రాజ్(1.25)<br>యం.శ్రీను తండ్రి బుచ్చయ్య<br>యం.బాలీశ్వరయ్య తండ్రి బాల్‌రాజు<br>యం.భీమయ్య తండ్రి బాలయ్య<br>యం.బాలయ్య తండ్రి శాయిలు<br>జి.ఉజ్వల భర్త సతీష్ రెడ్డి<br>యస్.ధర్య తండ్రి వసురాం<br>యస్.హన్మంతు తండ్రి జెమ్లు<br>యన్.రమేష్ తండ్రి జెమ్లు<br>యన్.శాంతి భర్త హరిలాల్<br>యం.భీరమ్మ భర్త యం.బాల్‌రాజు | 63 | 69 | 67 | 80 | టేకు మామిడి చెట్లు | 3<br>1 | బోరు | 2 |
| 6 | 66 | పట్టా | మెట్ట | 3.02 | పాత్లావత్‌పెద్దరాములు తండ్రి వాల్య(0.38)<br>పాత్లావత్ లక్ష్మి భర్త లాల్య (0.38)<br>పాత్లావత్‌చిన్నరాములు తండ్రివాల్య(0.38)<br>పి.భీంలాల్ తండ్రిపెద్దరాములు(0.08)<br>కె.ద్వాలి భర్త హన్మ<br>షేక్‌సాలంబిన్ అబ్దుల్లా తండ్రి<br>అబ్దుల్లా బిన్ హంషేన్<br>యం.డి.జహంగీర్ వలి<br>తండ్రి యం.డి.బలే మియా<br>యం.శివరాం తండ్రి మూన్య<br>పి.రాములు తండ్రి వాల్య<br>పి.నాగేందర్ తండ్రి లాల్య<br>పి.సీత భర్త పెద్దరాములు<br>కొడావత్ లక్ష్మి భర్త బాలు | 65 | 67 | 51/8 | 64 | టేకు చెట్లు | 1 | బావి బోరు పైప్ లైన్ | 1<br>1<br>1 |
| 7 | 50 | లావుని పట్టా | మెట్ట | 4.00 | వడ్య రమణి భర్త రాజా (1.14)<br>వడ్య కాద్య తండ్రి రావుజ (1.13)<br>వడ్య సరోజ భర్త రవి (1.13)<br>మీసాల దుర్గమ్మ భర్త రవి<br>సోట సరిత భర్త రాముకుమార్<br>కదారి లింగమ్మ భర్త నర్సయ్య<br>వడ్య కాద్య తండ్రి రాజ్య<br>వడ్య రోజా భర్త రవి<br>పి.మల్లమ్మ భర్త కృష్ణయ్య<br>యం.శైలజ భర్త సతీష్ | 46 | 51/1 | VB | 49 | లేవు | లేవు | లేవు | లేవు |
| 8 | వాగు | పట్టా | మెట్ట | 0.29 | వాగు | 47 | 51/23 | 50 | 53 | లేవు | లేవు | లేవు | లేవు |
| | మొత్తం | | | 21.23 | | | | | | | | | |

భూసేకరణ చట్టం 30/2013లోని సెక్షన్ 15(1) అనుసరించి పైన కనబరిచిన భూములకు సంబంధించినటువంటి రైతుల నుండి ఎటువంటి అభ్యంతరములు/ ఆక్షేపణలు లేనందున ఇట్టి రూఢీ ప్రకటన చేయడమైనది.

భూసేకరణ తలపెట్టిన భూమిలో బొగ్గు, ఇనుము, స్టీల్ మరియు ఇతర ఖనిజములు ఇట్టి భూములలో లేదా కొంత భాగములో లభ్యమైనచో, ఆ ఖనిజాలు ప్రాజెక్టు నిర్మాణమునకు ఉపయోగమున్న పక్షములో, వాటిని స్వీకరించబడును. లేనిచో స్వీకరించబడవు.

పైన చూపిన భూమిని భూసేకరణ చేయు భూముల యొక్క ప్లాన్ ఏదైనా పని దినములలో మరియు కార్యాలయ పని వేళలలో భూసేకరణ అధికారి మరియు ప్రత్యేక ఉప కలెక్టర్ కార్యాలయము, నాగర్‌కర్నూల్ నందు పరిశీలించుకొను నిమిత్తం అందుబాటులో ఉండును.

సామాజిక ఆర్థిక సర్వే నివేదిక ప్రకారము పైన చూపిన భూసేకరణ పిమ్మట ఏ ఒక్కరునూ వారి జీవనోపాధి కోల్పోవడంగానీ నిర్వాసితులుగా మారడం గాని మరియు భూమి లేని వారిగా గాని జరగడము లేనందున ఇట్టి భూసేకరణ ప్రక్రియనందు పునరుపాధి మరియు పునరావాస కల్పన ప్రతిపాదనలు ఏమియును లేవు.

సం/-. స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ (భూ.సే), యూనిట్-I, యం.జి.ఎల్.ఐ.యస్.పి., నాగర్‌కర్నూల్
సం/- అదనపు కలెక్టర్, నాగర్‌కర్నూల్
సం/-. జిల్లా కలెక్టర్ నాగర్‌కర్నూల్

DIPR RO.NO: 830/LA/PP/Advt/Pub/2026-27


## అసెంబ్లీ గేటు వద్దే బీఆర్ఎస్ సభ్యులను

# అడ్డుకున్న పోలీసులు





మరోవైపు బీఆర్ ఎస్ సభ్యుల నిరసనపై పోలీసులు స్పందిం చారు. అసెంబ్లీ ప్రాంగణం వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు ధరించిన బ్లాక్ టీషర్టులపై అభ్యంత రకర పదాలు ఉండటంతో అనుమ తి ఇవ్వలేదని ఖైరతాబాద్ జోన్ డీసీపీ శిల్పావళి తెలిపారు. "బ్లాక్ టీషర్ట్ వేసుకోవడం నేరం కాదు. వాటిపై ఉన్న పదాల కారణంగానే లోపలికి అనుమతించలేదు. బీఆర్ఎస్ ఎమ్మెల్యేలతో పోలీసులు అసభ్యంగా ప్రవర్తించలేదు. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నేతలు చేస్తోన్న ఆరోపణలను పరిశీలిస్తాం. అసెంబ్లీ గేటు దగ్గర జరిగిన ఘటనకు సంబంధించిన వీడియోలను పరిశీలిస్తాం. స్పీకర్ సూచనల మేరకే పోలీసులు వ్యవహరించారు" అని తెలిపారు.

**మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం: కేటీఆర్**

హైదరాబాద్: బీఆర్ఎస్ మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు దుర్మార్గంగా ప్రవర్తించారని ఆ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ విమర్శించారు. అసెంబ్లీ వద్ద పోలీసులు వ్యవహరించిన తీరును రాష్ట్రం మొత్తం చూసిందన్నారు. తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో కేటీఆర్ మాట్లాడారు.

**స్పీకర్‌పై అవిశ్వాసం.. ఆలోచిస్తాం**

"మేం నిలదీస్తామని తెలిసే.. మమ్మల్ని అసెంబ్లీకి రా కుండా అడ్డుకున్నారు. మా ఆడబిడ్డలకు క్షమాపణ చెప్పేదాకా వదిలిపెట్టం. హోంమంత్రిగానూ ఉన్న రేవంత్‌రెడ్డి క్షమాపణలు చెప్పాల్సిందే. ఈ అంశాన్ని ఇక్కడితో వదిలిపెట్టం.. జాతీయ మహిళా కమిషన్ దగ్గరకూ వెళ్తాం. ప్రజా సమస్యలు చాలా ఉన్నాయి.. అసెంబ్లీని నెలరోజులు నిర్వహించాలి. సీఎంను విమర్శిస్తే మైక్ ఇవ్వను అనడమేంటి? స్పీకర్‌పై అవిశ్వాసం పెట్టే అంశంపై ఆలోచిస్తాం" అని కేటీఆర్ అన్నారు.

**ఇది శాసన సభా.. లేక కౌరవ సభా?: హరీశ్‌రావు**

అసెంబ్లీ సమావేశాల నేపథ్యంలో తమ పార్టీ ఎమ్మెల్యేలపై పోలీసులు దురుసుగా ప్రవర్తించారని మాజీ మంత్రి హరీశ్‌రావు ఆరోపించారు. బీఆర్ఎస్ సభ్యులు అసెంబ్లీలోకి రాకూడదనే ఇలాంటి చర్యలకు ప్రభుత్వం పాల్పడుతోందని మండిపడ్డారు. ప్రధాన ప్రతిపక్షం లేకుండానే చర్చ జరపాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. "కాంగ్రెస్ అగ్రనేతలు రాహుల్‌గాంధీ, ప్రియాంక గాంధీ టీషర్టులు ధరించి పార్లమెంట్‌కు వెళ్లారు. వారు పార్లమెంట్‌కు టీషర్టులతో వెళ్లినప్పుడు.. మేం అసెంబ్లీకి అలా వెళ్లకూడదా..? నల్ల టీషర్టులపై ఏముంది.. ప్రభుత్వం హామీలు అమలు చేయాలని మాత్రమే ఉంది. నిరసనలు తెలిపే హక్కు మాకు ఉంది. సునీతా లక్ష్మారెడ్డి చీర లాగితే ఊరుకోవాలా..? మా ఎమ్మెల్యేల గొంతు నొక్కితే చూస్తూ ఉండాలా..?" అని హరీశ్‌రావు ప్రశ్నించారు. "తెలంగాణ అసెంబ్లీ చరిత్రలో ఈ రోజు బ్లాక్ డే. ఇది శాసన సభా.. లేక కౌరవ సభా?. సునీతమ్మ చీర లాగిన, సబితమ్మ గొంతు నొక్కిన ఖాకీలను వదలం. జగదీశ్‌రెడ్డిని కింద పడేసిన వారు సప్త సముద్రాల అవతల ఉన్నా వదలం. కేటీఆర్ చేయి, ముఖం మీద గీరుకుపోయింది. ఆస్పత్రికి కూడా తీసుకెళ్లకుండా మమ్మల్ని అడ్డుకుంటారా..? వీటన్నింటికీ రేవంత్‌రెడ్డి తగిన మూల్యం చెల్లించుకోక తప్పదు" అని హరీశ్‌రావు హెచ్చరించారు

## 12 వరకు అసెంబ్లీ

సమీక్ష జరపాలని నిర్ణయించారు. స్పీకర్ గడ్డం ప్రసాద్?కుమార్ అధ్యక్షతన ఇవాళ జరిగిన శాసనసభ బీఏసీ సమావేశంలో ప్రధానంగా ప్రజా సమస్యలపై చర్చించేందుకు అజెండా రూపొందించారు. ఈ భేటీకి డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసనసభా వ్యవహారాల మంత్రి శ్రీధర్‌బాబు, ఆది శ్రీనివాస్, బీర్ల ఐలయ్య, బీజేపీ శాసనసభా పక్షనేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంఐఎం ఎమ్మెల్యే బలాల హాజరయ్యారు. ఉదయం శాసనసభకు వెళ్తున్న తమపై పోలీసులు దౌర్జన్యం చేశారని నిరసిస్తూ బీఆర్ఎస్ ఈ సమావేశాన్ని బహిష్కరించింది. అసెంబ్లీ బీఏసీ సమావేశంలో 22ఏ, ఫీజు రీఎంబర్స్‌మెంట్‌పై స్వల్పకాలిక చర్చలు జరిపేందుకు నిర్ణయం తీసుకున్నట్లు తెలుస్తోంది. ఇవాళ ఉదయం 22ఏ నిషేధిత భూముల జాబితాపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరపాలని బీజేపీ నేతలు డిమాండ్ చేశారు. దీంతో పాటు మరో 22 కీలకమైన అంశాలపై చర్చ జరిపేందుకు కనీసం 15 రోజుల పాటు అసెంబ్లీలో సమావేశాలు నిర్వహించాలని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్‌తో పాటు మైనారిటీ అంశాలపైనా అసెంబ్లీలో చర్చలు జరపాలని ఎంఐఎం నేత బలాలా సైతం కోరారు. ఈ నేపథ్యంలో సభలో ఎన్నిరోజులైనా సమావేశాలు నిర్వహించేందుకు ప్రభుత్వం సిద్ధంగా ఉన్నట్లు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి శ్రీధర్‌బాబు తెలిపారు. కాగా బీఏసీ సమావేశాన్ని బహిష్కరించిన బీఆర్ఎస్.. రాష్ట్రంలో ప్రజా సమస్యలు చాలా ఉన్నాయని, అసెంబ్లీని కనీసం 20 నుంచి 30 రోజుల పాటు నడపాలని ఆ పార్టీ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ డిమాండ్ చేశారు.

వారంపాటు మండలి సమావేశాలు

మరోవైపు శాసనమండలి సమావేశాలను వారం రోజులపాటు నిర్వహించాలని బీఏసీలో నిర్ణయించినట్లు మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్?రెడ్డి తెలిపారు. సభ్యుల కోరిక మేరకు అవసరమైతే మరిన్ని రోజులు పొడగిస్తామని ఆయన పేర్కొన్నారు. సుఖేందర్?రెడ్డి అధ్యక్షతన తన ఛాంబర్?లో మండలి బీఏసీ సమావేశం జరిగింది. సమావేశంలో డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్క, శాసన సభ వ్యవహారాలశాఖ మంత్రి శ్రీధర్?బాబు, ఎమ్మెల్సీలు నెల్లికంటి సత్యం, ఎఫ్ఎండీ, శ్రీపాల్ రెడ్డి, శాసన మండలి సెక్రెటరీ డా.నరసింహా చార్యులు పాల్గొన్నారు.

**22ఏ అంశంపై చర్చకు సిద్ధం:మంత్రి శ్రీధర్‌బాబు**

తెలంగాణ అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. 22ఏపై విచారణ జరిపించాలని శాసనసభలో భాజపా సభ్యులు నినాదాలు చేశారు. ఈ అంశంపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని ప్లకార్డులు ప్రదర్శించారు. దీనిపై మంత్రి శ్రీధర్‌బాబు స్పందించారు. 22ఏపై స్వల్ప కాలిక చర్చ పెట్టాలని ప్రభుత్వం భావిస్తోందని తెలిపారు. బీఏసీ సమావేశంలో 22ఏ అంశాన్ని మొదటి ప్రాధాన్యతగా తీసుకుంటామన్నారు. 22ఏపై స్వల్ప కాలిక చర్చకు ప్రభుత్వం సిద్ధమని హామీ ఇచ్చారు. నియమ నిబంధనలకు అనుగణంగా బీఏసీ సమావేశంలో నిర్ణయం తీసుకుంటామని భాజపా ఎమ్మెల్యేలకు చెప్పారు. మంత్రి శ్రీధర్ బాబు, స్పీకర్ సర్దిచెప్పినా.. భాజపా ఎమ్మెల్యేలు వినకుండా 22ఏపై సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలని నినాదాలు చేశారు. రాజకీయాల కోసం సభను అడ్డుకోవడం సరైంది కాదని మంత్రి శ్రీధర్‌బాబు విమర్శించారు. సభ సజావుగా సాగేందుకు సహకరించాలని కోరారు.

## 22ఏ పేరుతో సాగుతున్న భూదందా

- దీని వెనుక మంత్రి పొంగులేటి ఉన్నారు
- సిట్టింగ్ జడ్జితో విచారణ జరిపించాలి
- బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి
- గన్‌పార్క్ వద్ద బీజేపీ తీవ్ర నిరసన

హైదరాబాద్,సెప్టెంబర్7(జనంసాక్షి):రాష్ట్రంలో సెక్షన్ 22ఏ నిషిద్ధ భూముల పేరుతో సాగుతున్న భారీ భూదందా వెనుక మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి హస్తముందని, ఈ అక్రమాల ద్వారా ఆయన వేల కోట్ల రూపాయలు వెనకేస్తున్నారని బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్ రెడ్డి సంచలన ఆరోపణలు చేశారు. శాసనసభ సమావేశాల ప్రారంభం సందర్భంగా గన్‌పార్క్‌లోని అమరవీరుల స్థూపం వద్ద నివాళులర్పించిన అనంతరం, బీజేపీ ఎమ్మెల్యేలతో కలిసి కాంగ్రెస్ ప్రభుత్వ వైఖరికి వ్యతిరేకంగా ప్లకార్డులతో నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడిన మహేశ్వర్ రెడ్డి... రాష్ట్రంలో అసలు రూల్ ఆఫ్ లా అనేది అమలు కావడం లేదని, దీనిపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే ప్రజలకు జవాబు చెప్పాలని డిమాండ్ చేశారు.

## అసెంబ్లీకి వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దు

**తెలంగాణ రాష్ట్ర హైకోర్టు పోలీసులకు ఆదేశం**

హైదరాబాద్,సెప్టెంబర్1(జనంసాక్షి): తెలంగాణ శాసనసభకు వెళ్లే ఎమ్మెల్యేలను అడ్డుకోవద్దని రాష్ట్ర పోలీసులను హైకోర్టు సోమవారం ఆదేశించింది. శాసనసభ్యులు ఏవైనా నిబంధనలు ఉల్లంఘిస్తే ఆ వ్యవహారాన్ని స్పీకర్ చూసుకుంటారని, పోలీసులు వారిపై ఎలాంటి చర్యలు తీసుకోరాదని న్యాయస్థానం స్పష్టం చేసింది. అసెంబ్లీ సమీపంలో సోమవారం ఉదయం చోటుచేసుకున్న పరిణామాలను పరిగణనలోకి తీసుకున్న ఉన్నత న్యాయస్థానం, ఈ మేరకు మధ్యంతర ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉదంతంపై రాష్ట్ర హోం శాఖకు హైకోర్టు నోటీసులు జారీ చేసింది. విచారణలో భాగంగా, మహిళా ఎమ్మెల్యేలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలు ఎదుర్కొంటున్న పోలీసు అధికారులను గుర్తించాలని ఆదేశించింది. ఈ ఘటనపై పూర్తిస్థాయి విచారణ జరిపి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. ఈ మొత్తం వ్యవహారంపై సమగ్ర నివేదికను సమర్పించాలని డీజీపీని ఉన్నత న్యాయస్థానం ఆదేశించింది. అనంతరం తదుపరి విచారణను రెండు వారాలకు వాయిదా వేసింది.

## తెలంగాణ స్పీకర్ ప్రసాద్‌కుమార్ కంటతడి

శాసన సభలో మంత్రి సీతక్క మాట్లాడారు. స్పీకర్ తల్లిని అవమానించడం బాధాకరమన్నారు. ఈ సమయంలో స్పీకర్ భావోద్వేగానికి గురై కంటతడి పెట్టుకున్నారు. బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు వ్యాఖ్యలు బాధాకరమని స్పీకర్ ప్రసాద్‌కుమార్ అన్నారు. శాసన సభ వాయిదా పడిన అనంతరం మీడియాతో చిట్‌చాట్ నిర్వహించారు. "సీతక్క ఐదేళ్లుగా నాకు రాఖీ కడుతున్నారు. సభలో ఆమె కన్నీరు పెట్టుకుంటే నాకు దుఃఖం ఆగలేదు. తాతా మధు వ్యాఖ్యలపై శాసనసభ తీర్మానం చేసి మండలికి పంపిస్తాం"అని స్పీకర్ తెలిపారు.

## నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నా

నా మాటలపై విచారం వ్యక్తం చేస్తున్నా. నాపై దాడి చేసి గొంతు నొక్కే ప్రయత్నం చేశారు. నాపై దాడి చేసిన వారిని మాత్రమే ఆవేశంతో అన్నాను" అని తాతా మధు వివరణ ఇచ్చారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి తాతా మధు అనుచిత వ్యాఖ్యలు చేశారంటూ కాంగ్రెస్ పార్టీ తీవ్రస్థాయిలో మండిపడింది. శాసనసభలో సీఎం రేవంత్ సహా పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు ఆయన వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేశారు. భాజపా శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి కూడా తాతా మధు వ్యాఖ్యలను ఖండించారు. ఆయనపై చర్యలు తీసుకోవాలని పలువురు నేతలు కోరారు. ఈ నేపథ్యంలో తాతా మధు స్పందించారు.

# తాతా మధును డిస్మిస్ చేయాలి

రాజీనామా చేయించాలి. ఇలాంటి వాటికి క్షమిస్తే చట్టసభలకు గౌరవం, మర్యాద ఉండదు" అని రేవంత్ అన్నారు.

**కేసీఆర్ స్పందించాలి:మంత్రి శ్రీధర్‌బాబు**

స్పీకర్ ప్రసాద్‌కుమార్‌ను ఉద్దేశించి బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధు సభ్య సమాజం అసహ్యించుకునే భాష మాట్లాడారని మంత్రి శ్రీధర్‌బాబు అన్నారు. స్పీకర్‌పై అంత ఘోరమైన భాష ఉపయోగించడం సరికాదన్నారు. ఈ ఘటనపై స్పందించాల్సిన బాధ్యత బీఆర్ఎస్ అధినేత కేసీఆర్‌కు ఉందన్నారు. కేసీఆర్ స్పందించకుంటే ఆయనే ప్రేరేపించారన్న అనుమానాలు వస్తాయన్నారు. పార్టీ నేతలతో కలిసి శ్రీధర్‌బాబు మీడియా సమావేశం నిర్వహించారు. "సీనియర్ శాసనసభ్యుడిగా ఉన్న వ్యక్తి పోలీసులపై దాడి చేశారు. ఓ శాసనసభ్యుడు యూనిఫామ్‌లో ఉన్న వ్యక్తి కాలర్ పట్టుకున్నారు. పోలీసులపై దాడి చేయడం మీడియా ఛానళ్లలో స్పష్టంగా కనిపించింది. పోలీసులపై కేటీఆర్ చేయిచేసుకున్నట్లు కనబడుతోంది. పోలీసు సిబ్బంది గొంతు నొక్కుతున్నట్లు కనిపించింది. ఉమ్మడి రాష్ట్రంలోనూ పోలీసులపై ఇలాంటి ఘటనలు జరగలేదు. ప్రజాప్రతినిధులు హుందాగా ప్రవర్తించాలి. బీఆర్ఎస్ సభ్యుల తీరు చాలా దారుణంగా ఉంది. అసెంబ్లీలోకి బ్యాడ్జీలు తీసుకురాకూడదని గత బీఆర్ఎస్ ప్రభుత్వమే రూల్స్ రూపొందించింది. రూల్స్‌కు అనుగుణంగానే స్పీకర్ నిర్ణయం తీసుకున్నారు. టీషర్టుపై నినాదాలు ఉంటే అనుమతించకూడదనే నిబంధన ఉంది. లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒక న్యాయం, మాకో న్యాయమా అని కేటీఆర్ అంటున్నారు. రాహుల్ టీషర్టుపై ఏదీ రాసుకుని లోక్‌సభకు వెళ్లలేదు. సభా గౌరవాన్ని తగ్గించేలా బీఆర్ఎస్ సభ్యులు టీషర్టులపై నినాదాలు ఉన్నాయి. గతంలో ప్లకార్డులు అనుమతించరని చెబితే మేము తీసుకెళ్లలేదు. మహిళా సభ్యులకు ఇబ్బంది జరిగిందని తెలియగానే సీఎం సమీక్ష చేశారు. ఏవైనా లోటుపాట్లు జరిగితే మా ప్రభుత్వం సీరియస్‌గా తీసుకుంటుంది.

**ఆ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు**

తాతా మధు వ్యాఖ్యలకు బీఆర్ఎస్ బాధ్యత వహించాలి. ఆయన వ్యాఖ్యలను బీఆర్ఎస్ ఎందుకు ఖండించలేదు. స్పీకర్ తల్లిని దూషించేలా వ్యాఖ్యలు చేయడం ఎంతవరకు సమంజసం?. దళిత వ్యతిరేక పార్టీగా బీఆర్ఎస్ నిరూపించుకుంది. తాతా మధు వ్యాఖ్యలు విని స్పీకర్ కన్నీరు పెట్టుకున్నారు. బీఆర్ఎస్ నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడుతూ పోలీసులను బెదిరిస్తున్నారు. శాసనసభను దుశ్శాసన సభ అని కేటీఆర్ అవమానించారు. మహిళల గురించి మాట్లాడే అర్హత బీఆర్ఎస్‌కు లేదు. మహిళా మంత్రి లేకుండా ఐదేళ్లు బీఆర్ఎస్ ప్రభుత్వాన్ని నడిపింది. స్పీకర్‌పై అవిశ్వాస తీర్మానం పెడతామని కేటీఆర్ బెదిరిస్తున్నారు. ఆ బెదిరింపులకు భయపడే ప్రసక్తే లేదు. స్పీకర్‌కు క్షమాపణ చెప్పాల్సిందే. ఆ తర్వాతే మిగతా కార్యకలాపాలు ఉంటాయి. అసెంబ్లీ ప్రాంగణానికి సంబంధించి పూర్తిస్థాయి అధికారం స్పీకర్, ఛైర్మన్‌కే ఉంటుంది" అని శ్రీధర్‌బాబు అన్నారు.

**అట్టడుగు వర్గాల బిడ్డలమనేనా.. ఇంత అవమానం? : మంత్రి సీతక్క**

బీఆర్ఎస్ సభ్యుల తీరు సభ్య సమాజం తలదించుకునేలా ఉందని తెలంగాణ మంత్రి సీతక్క విమర్శించారు. స్పీకర్ ప్రసాద్‌కుమార్‌పై ఆ పార్టీ సభ్యుడు తాతా మధు అత్యంత హేయమైన భాష వాడారని ఆగ్రహం వ్యక్తం చేశారు. స్పీకర్‌ను అవమానించిన వారిపై ఎస్సీ, ఎస్టీ కేసు పెట్టాలన్నారు. శాసనసభలో సీతక్క మాట్లాడారు. "తాతా మధు వ్యాఖ్యలకు ప్రతిపక్ష నేత కేసీఆర్ బాధ్యత వహించి క్షమాపణ చెప్పాలి. ఆయన డైరెక్షన్‌లోనే బీఆర్ఎస్ సభ్యులు ఇలా మాట్లాడారు. దళితులంటేనే ఆ పార్టీకి నచ్చదు. స్పీకర్‌గా దళితుడు ఉండటం కేసీఆర్‌కు నచ్చదు. దళితుడైన స్పీకర్‌ను అధ్యక్షా అనాల్సి వస్తుందనే ఆయన అసెంబ్లీకి రావడం లేదు. గతంలో సీఎల్పీ నేతగా భట్టి విక్రమార్క ఉంటే ఓర్వలేక ఆయన్ను తొలగించారు. గతంలో జగదీశ్‌రెడ్డి కూడా ఇదే తరహాలో మాట్లాడారు. స్పీకర్ తల్లిని అవమానించడం బాధాకరం. ఆయన ఉన్నత స్థాయికి వెళ్లినందుకు తల్లిని అవమానించాలా?అట్టడుగు వర్గాల బిడ్డలమనేనా.. మనకింత అవమానం? "అంటూ సీతక్క ఒకింత భావోద్వేగానికి గురయ్యారు.

## గ్యాస్ వినియోగదారులకు కేంద్రం తీపికబురు

**పట్టణ, గ్రామీణ ప్రాంతాలకు ఒకే నిబంధన**

న్యూఢిల్లీ,సెప్టెంబర్7(జనంసాక్షి):వంట గ్యాస్ వినియోగదారులకు కేంద్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. ఇక గ్రామీణ ప్రాంతాల్లోనూ 25 రోజులకే ఎల్‌పీజీ సిలిండర్ రీఫిల్ బుక్ చేసుకోవచ్చు. ఇప్పటివరకు అక్కడ 45 రోజుల వ్యవధి ఉండేది. పట్టణ, గ్రామీణ ప్రాంతాలన్నింటికీ ఇక 25 రోజుల నిబంధనే అమల్లో ఉంటుంది. ఈ మార్పును వెంటనే అమలు చేయాలని ప్రభుత్వ రంగ చమురు సంస్థలను కేంద్రం ఆదేశించింది. ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ (ఐఓసీఎల్), భారత్ పెట్రోలియం (బీపీసీఎల్), హిందుస్థాన్ పెట్రోలియం (హెచ్‌పీసీఎల్) ఈ నిబంధనను అమలు చేయనున్నాయి. రీఫిల్ బుకింగ్‌లో పట్టణ, గ్రామీణ ప్రాంతాల మధ్య ఉన్న తేడా ఇక ఉండదు. కేంద్ర పెట్రోలియం, సహజ వాయువు, పర్యాటక శాఖ సహాయ మంత్రి సురేశ్ గోపీ సోమవారం ఈ విషయాన్ని వెల్లడించారు. ఎల్‌పీజీ సరఫరా పరిస్థితి మెరుగుపడిందని తెలిపారు. రీఫిల్ బకాయిలు కూడా గణనీయంగా తగ్గాయని చెప్పారు. దీంతో 45 రోజుల నిబంధనను సడలించినట్లు పేర్కొన్నారు. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఈ ఏడాది ఫిబ్రవరిలో ఎల్‌పీజీ సరఫరాపై ఒత్తిడి పెరిగింది. దీంతో డిమాండ్‌ను నియంత్రించేందుకు పట్టణ ప్రాంతాల్లో 25 రోజులు, గ్రామీణ ప్రాంతాల్లో 45 రోజుల వ్యవధిని కేంద్రం తీసుకొచ్చింది.

## కుప్పకూలిన ఐదంతస్తుల భవనం..

ఈ ఘటన చోటుచేసుకున్న సంగతి తెలిసిందే. ప్రమాదంలో ఇప్పటి వరకు ఏడుగురు మృతిచెందగా.. శిథిలాల కింద చిక్కుకున్న పలువురిని సహాయక సిబ్బంది వెలికి తీశారు. ఇప్పటి వరకు 12 మందిని సురక్షితంగా బయటకు తీసుకొచ్చారు.ఘటనాస్థలాన్ని ఢిల్లీ సీఎం రేఖా గుప్తా సోమవారం ఉదయం పరిశీలించారు. బాధ్యులపై తప్పకుండా చర్యలు తీసుకుంటామని ఆమె హామీ ఇచ్చారు. బేస్‌మెంట్‌లో నీరు చేరడం, మరమ్మతుల కోసం చేపట్టిన పనుల వల్లే ప్రమాదం జరిగిందని పోలీసులు ప్రాథమికంగా నిర్ధరించారు.

## అధికారులు బాధ్యతగా ఉంటే ఇలా జరిగేది కాదు

కాదని పేర్కొంది. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా నివారించడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్రం, ఢిల్లీ ప్రభుత్వం, మున్సిపల్ కార్పొరేషన్ ఢిల్లీ విశ్వవిద్యాలయం జాతీయ మానవ హక్కుల కమిషన్‌లకు నోటీసులు జారీ చేసింది. సత్య నికేతన్‌లోని హాస్టల్ కూలిపోయిన ఘటన నేపథ్యంలో ఢిల్లీలోని అనధికార నిర్మాణాలపై దాఖలైన ప్రజాప్రయోజన వ్యాజ్యంపై విచారణ జరుపుతూ న్యాయస్థానం ఈ వ్యాఖ్యలు చేసింది.ఢిల్లీలో పీజీ హాస్టళ్ల ఏర్పాటు, వసతులకు సంబంధించి ఏవైనా నిబంధనలు ఉన్నాయా అనే దానిపై వివరణాత్మక స్పందన సమర్పించాలని ఢిల్లీ హైకోర్టు మున్సిపల్ కార్పొరేషన్‌ను ఆదేశించింది.

## హర్మూజ్ వద్ద 'నిషేధిత జోన్'..!

**ఏర్పాటుకు టెహ్రాన్ కీలక నిర్ణయం**

టెహ్రాన్(జనంసాక్షి):ఇరాన్-అమెరికా మధ్య యుద్ధం నేపథ్యంలో హర్మూజ్ జలసంధిలో ఉద్రిక్తతలు కొనసాగుతున్నాయి. ఈ క్రమంలోనే టెహ్రాన్ కీలక నిర్ణయం తీసుకుంది. హర్మూజ్‌లో తాము సూచించిన మార్గంలో కాకుండా వేరే రూట్‌లో వెళ్లడానికి యత్నిస్తున్న నౌకలను అడ్డుకునేందుకు.. జలసంధి వెలుపల ఓ నిషేధిత ప్రాంతాన్ని ప్రకటించేందుకు సిద్ధమైంది. ఈ మేరకు ఇరాన్ జాతీయ భద్రతా అధిపతి మొహసెన్ రెజాయ్ వెల్లడించారు. రాబోయే వారం రోజుల్లో ఆ ప్రాంతాన్ని ప్రకటిస్తామన్నారు. అది అమెరికా నౌకా దిగ్బంధన రేఖ నుంచి ప్రారంభమై.. హర్మూజ్ మీదుగా పర్షియన్ గల్ఫ్ వరకు కొనసాగుతుందన్నారు.తాము నిషేధించిన ప్రాంతం మీదుగా వెళ్లే ఏ నౌక అయినా తమ ఆంక్షల జాబితాలో చేరుతుందని రెజాయ్ ఈ సందర్భంగా పేర్కొన్నారు. హర్మూజ్ జలసంధి అమెరికా నియంత్రణలో ఉందని ఆ దేశాధ్యక్షుడు ట్రంప్ చెబుతున్న మాటల్లో నిజం లేదన్నారు. తమ చమురు ట్యాంకర్లను అగ్రరాజ్యం లక్ష్యం చేసుకుంటున్నా.. చమురు ఉత్పత్తి, రవాణా యథావిధిగా కొనసాగుతున్నాయన్నారు. ప్రతిరోజూ 10-15 లక్షల బ్యారెళ్ల చమురును విక్రయిస్తున్నట్లు తెలిపారు. టెహ్రాన్ నుంచి చమురు ఎగుమతులను నిరోధించే లక్ష్యంతో అమెరికా కొన్ని నెలల క్రితం ఇరాన్ ఓడరేవులపై నావికా దిగ్బంధనాన్ని విధించిన సంగతి తెలిసిందే. దీనిని పర్యవేక్షించడానికి 20కి పైగా యుద్ధనౌకలను హర్మూజ్ వద్ద మోహరించింది.

## రాష్ట్రవ్యాప్త నిరసనలకు బీఆర్ఎస్ పిలుపు

హైదరాబాద్(జనంసాక్షి): అసెంబ్లీ ప్రాంగణం వద్ద తమపట్ల ప్రభుత్వం వ్యవహరించిన తీరును నిరసిస్తూ బీఆర్ఎస్ రాష్ట్రవ్యాప్త నిరసనలకు పిలుపునిచ్చింది. బీఆర్ఎస్ సభ్యులను అసెంబ్లీకి రాకుండా ప్రభుత్వం అడ్డుకుందని ఆ పార్టీ నేతలు విమర్శించారు. దీనిపై ఎక్కిడకక్కడ నిరసనలు తెలపాలని నేతలకు ఆపార్టీ పిలుపునిచ్చింది.ఈ ఉదయం అసెంబ్లీ సమావేశాలు ప్రారంభమయ్యాయి. అసెంబ్లీ గేటు వద్ద బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను పోలీసులు అడ్డుకున్నారు. నినాదాలు రాసి ఉన్న నల్ల టీషర్టులతో బీఆర్ఎస్ నేతలు అసెంబ్లీ ప్రాంగణంలోకి ప్రవేశించేందుకు యత్నించారు. పోలీసులు అభ్యంతరం వ్యక్తం చేయడంతో టీషర్టులు విప్పి హరీశ్‌రావు, పలువురు ఎమ్మెల్యేలు బనియన్లతో అక్కడే నిరసన తెలిపారు.



# ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు చెల్లించాలి

- హనుమకొండలో విద్యార్థులతో కలిసి కల్వకుంట్ల కవిత భారీ ర్యాలీ
- నడిరోడ్డుపై బఠాయించి నిరసన వ్యక్తం చేసిన కల్వకుంట్ల కవిత

**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను వెంటనే చెల్లించాలని, విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ రక్షణ సేన వ్యవస్థాపక అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ఆధ్వర్యంలో సోమవారం హనుమకొండలో భారీ ర్యాలీ నిర్వహించారు. టీఆర్ఎస్ నాయకుడు నడిపెల్లి వెంకటేశ్వర రావు ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి అంబేద్కర్ విగ్రహం నుంచి హనుమకొండ కలెక్టరేట్ వరకు ర్యాలీ చేపట్టారు. అనంతరం విద్యార్థులతో కలిసి కలెక్టర్‌కు వినతిపత్రం అందించేందుకు అనుమతించాలని కోరుతూ కవిత రోడ్డుపై బైఠాయించి నిరసన తెలిపారు. అనంతరం పోలీసుల అనుమతితో విద్యార్థులతో కలిసి కలెక్టర్ కు వినతిపత్రం అందించి, వారి సమస్యలనువివరించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిల కారణంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న ఇబ్బందులను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి, సమస్యను పరిష్కరించాలని కోరారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. విద్యార్థుల ఫీజు బకాయిలను చెల్లించకుండా ప్రభుత్వం వారిని ఇబ్బందులకు గురిచేస్తోందని ఆరోపించారు. ముఖ్యమంత్రి ఒకసారి ఇంటర్మీడియట్ విద్యా విధానాన్ని తొలగిస్తామని, మరోసారి పాలిటెక్నిక్ కళాశాలలను స్కిల్ యూనివర్సిటీలో విలీనం చేస్తామని ప్రకటిస్తున్నారని విమర్శించారు. ఫీజు రీయింబర్స్మెంట్ అందకపోవడంతో లక్షలాది మంది విద్యార్థులు డిగ్రీలు, ప్రొఫెషనల్ డిగ్రీలు పూర్తి చేసినప్పటికీ సర్టిఫికెట్లు పొందలేకపోతున్నారని అన్నారు. సర్టిఫికెట్లు లేకపోవడంతో ఉద్యోగ అవకాశాలను కూడా కోల్పోతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తుతో ప్రభుత్వం చెలగాటమాడొద్దని కవిత హెచ్చరించారు. ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలను పూర్తిగా చెల్లించే వరకు కాంగ్రెస్ ప్రభుత్వంపై తమ పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.

# బాధ్యతగా ప్రజాసేవ చేస్తా

- ఈ పదవి బీసీ మహిళలకు లభించిన గౌరవం
- రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్‌గా బాధ్యతలు స్వీకరించిన గద్వాల విజయలక్ష్మి



**హైదరాబాద్, సెప్టెంబర్ 7(జనంసాక్షి) :** రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గా, క్యాబినెట్ మంత్రి హోదాతో గద్వాల విజయలక్ష్మి సోమవారం మహాత్మా జ్యోతిబా పూలే ప్రజాభవన్‌లో పదవీ బాధ్యతలు స్వీకరించారు. సోమవారం ప్రజా భవన్ కు విచ్చేసిన గద్వాల విజయలక్ష్మికి వేద పండితులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. అనంతరం పూజా కార్యక్రమాలు నిర్వహించి వేద పండితుల మంత్రోచ్ఛరణల మధ్య ఫైల్ పై విజయలక్ష్మి సంతకం చేశారు. అనంతరం సీఎం ప్రజావాణి హాల్ ను పరిశీలించారు. సీఎం ప్రజావాణి అమలు జరుగుతున్న తీరును ఆమె విశ్లేశించారు. ఈ సందర్భంగా గద్వాల విజయలక్ష్మి మాట్లాడుతూ.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో కానీ, తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన తరువాత కానీ రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ పదవికి ఇప్పటి వరకు ఒక మహిళకు అవకాశం లభించలేదని, తొలిసారిగా ఒక మహిళకు ఈ బాధ్యత అప్పగించడం చారిత్రాత్మక నిర్ణయం అని పేర్కొన్నారు. "ఈ అవకాశం నాకు వ్యక్తిగతంగా వచ్చిన గౌరవంగా మాత్రమే చూడటం లేదు. రాష్ట్రంలోని మహిళలకు, ముఖ్యంగా బీసీ మహిళలకు లభించిన గుర్తింపుగా, ప్రోత్సాహంగా భావిస్తున్నాను. పరిపాలనలోనూ నిర్ణయాలు తీసుకునే స్థాయిలోనూ మహిళలకు మరిన్ని అవకాశాలు రావాలనే బలమైన సందేశాన్ని ఈ నియామకం ఇస్తోంది" అని విజయలక్ష్మి తెలిపారు. రాష్ట్రంలో మూడు కీలకమైన పదవుల్లో మహిళలకు, ముఖ్యంగా బీసీ మహిళలకు అవకాశం కల్పించడం మహిళా సాధికారతకు, సామాజిక న్యాయానికి కాంగ్రెస్ ప్రభుత్వం, రాష్ట్ర ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి ఇస్తున్న ప్రాధాన్యతకు నిదర్శనమని విజయలక్ష్మి అన్నారు. తనపై విశ్వాసం ఉంచి ఈ గురుతర బాధ్యతను అప్పగించిన ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డికి ఆమె ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అలాగే కాంగ్రెస్ అగ్రనాయకత్వం సోనియా గాంధీ, మల్లికార్జున ఖర్గే, రాహుల్ గాంధీ, కే.సి. వేణుగోపాల్, కుమారి మీనాక్షి నటరాజన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, టీపీసీసీ అధ్యక్షులు మహేష్ కుమార్ గౌడ్, కాంగ్రెస్ పార్టీ నాయకత్వానికి విజయలక్ష్మి హృదయపూర్వక కృతజ్ఞతలు తెలిపారు. 'ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నాయకత్వం నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకుంటాను. తెలంగాణ రాష్ట్ర సమగ్ర, సమతుల్య అభివృద్ధికి, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ప్రణాళికలు రూపొందించేందుకు నా వంతు కృషి చేస్తాను. ఈ పదవిని గౌరవంగా కాకుండా బాధ్యతగా భావించి ప్రజలకు అంకితభావంతో సేవ చేస్తాను' అని గద్వాల విజయలక్ష్మి వివరించారు. రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్ పర్సన్ గా గద్వాల విజయలక్ష్మి పదవీ బాధ్యతల స్వీకారోత్సవ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ సలహాదారులు డాక్టర్ కే కేశవరావు, వి. హనుమంతరావు, మహ్మద్ అలీ షబ్బీర్, ప్రభుత్వ విప్ బల్మూరి వెంకట్, ఎమ్మెల్సీ బొగ్గారపు దయానంద్ గుప్తా, డాక్టర్ రోహిన్ రెడ్డి, మధు యాస్కి గౌడ్, రాజ్యసభ సభ్యులు రేణుకా చౌదరి, పీ. అనిల్ కుమార్ యాదవ్, వివిధ కార్పొరేషన్స్ చైర్మన్స్ ఈరావత్రి అనిల్, మెట్టు సాయి కుమార్, నూతి శ్రీకాంత్ గౌడ్, ఫయీమ్ ఖురేషి, అజ్మాతుల్లా హుస్సేని, గుత్తా అమిత్ రెడ్డి, చరణ్ కౌశిక్ యాదవ్, ఎన్.ఆర్.ఐ. సలహా మండలి వైస్ చైర్మన్ మంద భీం రెడ్డి, మాజీ డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్ రెడ్డి, మహిళా కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షురాలు స్వర్ణ, మహిళా కాంగ్రెస్ నాయకురాలు అనితా రావు, యూత్ కాంగ్రెస్ రాష్ట్ర అధ్యక్షులు జక్కిడి శివచరణ్ రెడ్డి, ప్లానింగ్ శాఖ కార్యదర్శి గౌరవ్ ఉప్పల్, ప్రజావాణి స్టేట్ నోడల్ ఆఫీసర్ కే. విద్యాసాగర్, కాంగ్రెస్ పార్టీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# భర్తను చంపి పెట్టెలో కుక్కిన భార్య, కుమారులు

- అమ్రాబాద్‌లో దారుణం



**అచ్చంపేట, సెప్టెంబర్ 07 (జనంసాక్షి) :** నియోజకవర్గ పరిధిలోని అమ్రాబాద్ మండల కేంద్రంలో దారుణ హత్య ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. స్థానికులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం అమ్రాబాద్ కు చెందిన మహమ్మద్ బురాన్ ను అతని భార్య, ఇద్దరు కుమారులు కలిసి హత్య చేసి మృతదేహాన్ని పెట్టెలో కుక్కి ఇంట్లోనే దాచి ఉంచారు. తర్వాత ఆ పెట్టెను వేరే చోటికి తరలించేందుకు యత్నించారు. రోజులు గడవడంతో పెట్టె నుండి తీవ్ర దుర్వాసన రావడంతో అనుమానం వచ్చిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. అంతలోపే భార్య, ఇద్దరు కుమారులు ఇంటి నుండి పరారయ్యారు. సమాచారం అందుకున్న అమ్రాబాద్ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పెట్టెను తెరిచి చూడగా అందులో పురుషుడి మృతదేహం కనిపించింది. వెంటనే మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని పోస్టుమార్టం నిమిత్తం అచ్చంపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని అమ్రాబాద్ సీఐ చంద్రయ్య తెలిపారు. సీఐ చంద్రయ్య ఆధ్వర్యంలో క్లూస్ టీమ్, డాగ్ స్క్వాడ్ తో కలిసి సంఘటన స్థలానికి చేరుకొని హత్యకు గల కారణాలు, ఇతర ఆధారాలను సేకరించి దర్యాప్తు కొనసాగిస్తున్నామని సీఐ చంద్రయ్య తెలిపారు.



# ప్రతిపక్ష నాయకుల అరెస్టు అప్రజాస్వామికం

- బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర

**హైదరాబాద్ (జనంసాక్షి) :** ప్రతిపక్ష నాయకుల అరెస్టు అప్రజాస్వామికమని బీసీ కమిషన్ మాజీ సభ్యులు ఉపేంద్ర తెలిపారు. అరెస్టులతో ప్రతిపక్షాల గొంతులు నొక్కలేరని, ప్రతిపక్ష పార్టీలు లేకుండా శాసనసభ నడవడం ఆక్షేపనీయమని అన్నారు. అరెస్టు చేసిన నాయకులను వెంటనే రిలీజ్ చేయాలి లేదంటే పోలీస్ స్టేషన్ ముట్టడిస్తామని, అసెంబ్లీని ముట్టడిస్తామని హెచ్చరించారు. ప్రభుత్వ నిరంకుశ వైఖరిని ప్రజలందరూ గమనిస్తున్నారు రాబోయే కాలంలో తప్పకుండా కాంగ్రెస్ పార్టీకి బుద్ధి చెప్పటానికి సిద్ధంగా ఉన్నారని, 420 హామీలు ఆరు గ్యారెంటీలు డిక్లరేషన్లపై బీఆర్ఎస్ పార్టీ ప్రశ్నిస్తే సమాధానం చెప్పలేని దిక్కుతోచని పరిస్థితుల్లో ముఖ్యమంత్రి తన ఒంటెద్దు పోకడలతో హిట్లర్ ఆలోచనలతో ప్రతిపక్ష పార్టీ నాయకులను అరెస్టు చేయడం దౌర్భాగ్యమన్నారు. రాబోయే కాలంలో కేసీఆర్ నాయకత్వంలో ప్రజాక్షేత్రంలో కాంగ్రెస్ పార్టీ వైఫల్యాలను మోసాలను దగాలను అవినీతిని చీల్చి చెండాడుతామని అన్నారు.

# బాలికపై లైంగికదాడి

- ఇద్దరు మైనర్ల రిమాండ్
- ఎదుట్ల గ్రామంలో ఘటన..
- బాధితురాలి తల్లి ఫిర్యాదుతో కేసు

గోపాల్‌పేట సెప్టెంబర్ :7 (జనంసాక్షి) మండల పరిధిలోని ఎదుట్ల గ్రామంలో మైనర్ బాలికపై జరిగిన లైంగిక దాడి ఘటనకు సంబంధించి పోలీసులు ఇద్దరు నిందితులను అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గ్రామానికి చెందిన 13 ఏళ్ల మైనర్ బాలికపై గత వేసవి సెలవుల్లో లైంగిక దాడి జరిగినట్లు బాధితురాలి తల్లి పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు గోపాల్‌పేట పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. దర్యాప్తులో భాగంగా పోలీసులు ఇద్దరు నిందితులను గుర్తించి అరెస్టు చేసిన అనంతరం నేడు రిమాండ్‌కు తరలించినట్లు వెల్లడించారు. బాధితురాలితో పాటు ఇద్దరు నిందితులు కూడా మైనర్లు కావడంతో చట్టపరమైన నిబంధనలను అనుసరించి వారి పేర్లు, ఇతర వ్యక్తిగత వివరాలను పోలీసులు గోప్యంగా ఉంచారు. కేసులో జరిగిన ఘటనకు సంబంధించిన వివరాలను సేకరిస్తూ పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. బాలికకు సంబంధించిన వివరాలను బహిర్గతం చేయకుండా పోలీసులు చర్యలు చేపట్టారు.

## కాసిపేట-2 గనిలో ప్రమాదం

- నలుగురు కార్మికులకు తీవ్ర గాయాలు



**రామకృష్ణాపూర్, సెప్టెంబర్ 07(జనంసాక్షి):** మంచిర్యాల జిల్లా మందమర్రి ఏరియాలోని కాసిపేట-2 గనిలో సోమవారం మిడిల్ షిఫ్ట్‌లో ప్రమాదం చోటుచేసుకుంది. గనిలోని 18 డిస్ట్రిక్ట్‌లో బ్లాస్టింగ్ జరుగుతున్న సమయంలో ప్రమాదం సంభవించినట్లు తోటి కార్మికులు తెలిపారు. ఈ ఘటనలో సపోర్ట్‌మెన్ రమేష్, రాజ్‌కుమార్, క్రాంతి, పుప్పాల శ్రీనివాస్ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను అధికారులు ప్రథమ చికిత్స కోసం మందమర్రి సింగరేణి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అయితే కొత్త పూర్ణిమల కారణంగానే బ్లాస్టింగ్ జరిగిందని కార్మికులు ఆరోపించారు. ప్రమాదానికి గల పూర్తి కారణాలపై అధికారులు విచారణ చేపట్టాల్సి ఉంది.

# 'గ్లోబల్ సమ్మిట్-2026' నిర్వహణపై సీఎస్ సమీక్ష..

**హైదరాబాద్ (జనంసాక్షి) :** గ్లోబల్ సమ్మిట్‌కు దేశ, విదేశాల నుంచి ప్రముఖులు, అంతర్జాతీయ పెట్టుబడిదారులు, పారిశ్రామికవేత్తలు, వివిధ రంగాల ప్రతినిధులు, సీఈవోలు, సీఎక్స్‌వోలు, దౌత్యవేత్తలు తదితరులను పెద్ద సంఖ్యలో ఆహ్వానించేలా చర్యలు చేపట్టాలని సీఎస్ సంజయ్ జాజు అధికారులను ఆదేశించారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ-తెలంగాణ రైజింగ్ గ్లోబల్ సమ్మిట్ 2026' నిర్వహణకు సంబంధించి సీఎస్ సోమవారం సచివాలయంలో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా సీఎస్ మాట్లాడుతూ.. సమ్మిట్‌కు హాజరుకావాల్సిందిగా ప్రముఖులకు ఈ-మెయిల్స్ ద్వారా అధికారిక ఆహ్వానాలు పంపే ప్రక్రియను తక్షణమే ప్రారంభించాలని సూచించారు. సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేస్తూ ఆహ్వానితుల జాబితాను సిద్ధం చేసి, ఆహ్వానాల పంపిణీ ప్రక్రియను వేగవంతం చేయాలని ఆదేశించారు. 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో నిర్వహించనున్న ఈ గ్లోబల్ సమ్మిట్ ద్వారా తెలంగాణలోని పెట్టుబడి అవకాశాలను ప్రపంచానికి విస్తృతంగా పరిచయం చేయడంతోపాటు రాష్ట్రాన్ని ప్రపంచ స్థాయి పెట్టుబడుల గమ్యస్థానంగా మరింతగా ప్రతిష్టించేందుకు కృషి చేయాలని పేర్కొన్నారు. తెలంగాణలోని ఫ్యూచర్ సిటీ, ఐటీ, ఏఐ, ఫార్మాస్యూటికల్స్, డిఫెన్స్ అండ్ ఏరోస్పేస్, ఎలక్ట్రానిక్స్, సెమీకండక్టర్లు, క్లీన్ ఎనర్జీ, అధునాతన తయారీ రంగాలు, మౌలిక వసతులు, ఆవిష్కరణలు తదితర రంగాల్లో ఉన్న అవకాశాలను సమ్మిట్ ద్వారా ప్రపంచ పెట్టుబడిదారులకు సమర్థవంతంగా ప్రదర్శించేలా కార్యాచరణ రూపొందించాలని సూచించారు. ఈ సమావేశంలో సీనియర్ అధికారులు కృష్ణాదిత్య, అజిత్‌రెడ్డి, అనుదీప్ దురిశెట్టి, నిఖిల్ చక్రవర్తి, ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.




# జాలరి వలకు చిక్కిన 150 కిలోల 'మహా' బొచ్చలు

**ఎర్రవల్లి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** షేక్ పల్లి గ్రామానికి చెందిన మత్స్యకారుడు తెలుగు వినోద్‌ను అదృష్టం వరించింది. కృష్ణానదిలో వేటకై వెళ్లిన అతనికి ఒక్కొక్కటి ముప్పై కిలోల చొప్పున ఏకంగా ఐదు భారీ బొచ్చ చేపలు దొరికాయి. ఒకేసారి వలలో పడిన ఈ ఐదు చేపల మొత్తం బరువు దాదాపు 150 కిలోలు ఉండటం విశేషం. ఇంత పెద్ద పెద్ద చేపలు ఒకేసారి దొరకడంతో వినోద్ ఆనందం వ్యక్తం చేయగా, గ్రామస్తులు అతనికి ప్రత్యేక అభినందనలు తెలియజేశారు. ఈ అరుదైన అద్భుతం కృష్ణానది జలాల జీవవైవిధ్యానికి, ఇక్కడి మత్స్య సంపద ఎదుగుదలకు సజీవ సాక్ష్యంగా నిలిచింది. ఒకేసారి ఇంతటి భారీ పరిమాణంలో ఐదు మహా బొచ్చలు ఒకే వలకు చిక్కడం ఇటు స్థానిక మత్స్యకారులను, అటు పర్యావరణ శాస్త్రవేత్తలను సైతం తీవ్ర ఆశ్చర్యానికి గురిచేస్తోంది. నదిలోని సహజసిద్ధమైన ఆహారం, అనుకూల వాతావరణం వల్లే చేపలు ఈ స్థాయిలో పెరిగాయని నిపుణులు భావిస్తున్నారు. ఈ అద్భుత దృశ్యాన్ని చూసేందుకు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు వేలాదిగా తరలిరావడంతో కృష్ణానది తీరం కోలాహలంగా మారింది. నది గర్భంలో దాగున్న ఇలాంటి జలచరాల సంపదను కాపాడుకుంటూ, శాస్త్రీయ పద్ధతుల్లో చేపల పెంపకాన్ని మరింత ప్రోత్సహిస్తే మత్స్యకారుల జీవితాల్లో సరికొత్త వెలుగులు నిండుతాయని ఈ ఘటన నిరూపించింది.

# మానవీయ కోణంలో సింగరేణిలో 'మారుపేర్ల' సమస్య పరిష్కారానికి కృషి

- శాసనమండలిలో ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క



**హైదరాబాద్ (జనంసాక్షి) :** సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్‌లో సుదీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న 'మారుపేర్ల' సమస్యను మానవీయ కోణంలో పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క తెలంగాణ శాసనమండలిలో స్పష్టం చేశారు. ఈ సమస్య పరిష్కారానికి ప్రభుత్వం ఇప్పటికే ఒక కమిటీని ఏర్పాటు చేసిందని, ఆ కమిటీ ఇచ్చే సిఫార్సుల ఆధారంగా స్పష్టమైన నిర్ణయం తీసుకుంటామని ఆయన వెల్లడించారు. శాసనమండలి సమావేశాల్లో ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ, ఇది ఇటీవల ఉత్పన్నమైన సమస్య కాదని, 1990వ దశకంలో అనగా 1997 నుంచే సింగరేణిలో కొనసాగుతున్న పాత (లెగసీ) సమస్య అని వివరించారు. అధికారిక రిజిస్టర్‌లో ఒకరి పేరు ఉంటే, వారి స్థానంలో మరొకరు వచ్చి విధుల్లో పనిచేస్తున్న పరిస్థితులు ఉండేవి. చట్టప్రకారం ఒకరి పేరు మీద మరొకరు ఉద్యోగం చేయడం తీవ్రమైన నేరపూరితమైన అంశమైనప్పటికీ, కార్మికుల పరిస్థితిని అర్థం చేసుకొని సింగరేణి యాజమాన్యం గతంలో మానవీయ కోణంలో పరిష్కరించేందుకు ప్రయత్నించిందని గుర్తుచేశారు. అయితే, నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించారంటూ ఆ సమయంలో 45 మంది అధికారులతో పాటు సంబంధిత వ్యక్తులపైనా చట్టబద్ధమైన చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. సింగరేణిలో ప్రస్తుతం దాదాపు 90 వేల మంది ఉద్యోగులు పనిచేస్తుండగా, ఈ మారుపేర్ల సమస్యను ఎదుర్కొంటున్న వారి సంఖ్య కేవలం 128 మాత్రమేనని భట్టి విక్రమార్క తెలిపారు. ఇది భారీ సంఖ్యలో ఉన్న పెద్ద సమస్య కాకపోయినప్పటికీ, చట్టపరమైన చిక్కులు ఉన్నందున అధికారులు ఈ సమస్యను పరిష్కరించేందుకు భయపడుతున్నారని చెప్పారు. ఒకవైపు నిబంధనల ప్రకారం భవిష్యత్తులో చర్యలు ఉంటాయనే అధికారుల భయం, మరోవైపు ఈ సమస్యను పరిష్కరించాలని స్థానిక ప్రజాప్రతినిధుల నుంచి వస్తున్న ఒత్తిడిని ప్రభుత్వం క్షుణ్ణంగా పరిశీలించిందని తెలిపారు. కార్మికులు చాలా ఏళ్లుగా అక్కడ పనిచేస్తున్నందున, ఏ ఒక్క అధికారిపైనా భారం పడకుండా కమిటీ ద్వారా మానవీయ కోణంలో సమగ్రంగా పరిశీలించాలని నిర్ణయించినట్లు డిప్యూటీ సీఎం పేర్కొన్నారు. ఇప్పటికే నియమించిన కమిటీ నుంచి నివేదిక రాగానే సదరు 128 మంది మారుపేర్ల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరుకుతుందన్నారు.

# ప్రజావసరాల స్థలాలను కాపాడండి



- అక్రమ కట్టడాలపై చర్యలు తీసుకోండి
- హైడ్రా ప్రజావాణిలో 53 ఫిర్యాదులు

**హైదరాబాద్, సెప్టెంబరు 07 (జనంసాక్షి) :** కాలనీల్లో, నివాస ప్రాంతాల్లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాలను కబ్జా చేసి ప్లాట్లుగా మార్చేస్తున్నారని హైడ్రా ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. దేవాలయాలకు, ప్రభుత్వ పాఠశాలలకు, షాపింగ్ కాంప్లెక్స్ కు కేటాయించిన స్థలాలను ఆక్రమించి ఇళ్లు నిర్మించేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. రహదారులు, పార్కులు కూడా కబ్జాలకు గురౌతున్నాయని ఫిర్యా దులో పేర్కొన్నారు. రంగారెడ్డి జిల్లా బాలాపూర్ మండలంలోని బాలాపూర్ పెద్ద చెరువు ఒడ్డున వందల ఏళ్ల చరిత్ర కలిగిన శ్రీ ఆంజనేయ స్వామి ఆలయ స్థలం కబ్జాకు గురైందని స్థానికులు ఫిర్యాదు చేశారు. సర్వే నంబర్ 334/ూ సమీపంలో ఉన్న ఆలయ భూమిని కూడా వెంచర్‌లో కలిపేసి అమ్మేశారని ఆరోపించారు. హనుమాన్ జయంతి, శ్రీరామ నవమి ఉత్సవాల సమయంలో భక్తుల రాకపోకలకు మరింత ఇబ్బంది కలుగుతోందని పేర్కొన్నారు. వనస్థలి హిల్స్‌లో నాలా ఆక్రమణ, మాన్సూరాబాద్ పెద్ద చెరువులోకి మురుగు నీటి ప్రవాహం, ఖాజాగూడ, బాగ్ హయత్‌నగర్‌లో ప్రజావసరాలకు ఉద్దేశించిన స్థలాల పరిరక్షణ.. ఇలా హైడ్రా ప్రజావాణికి మొత్తం 53 ఫిర్యాదులందాయి. వీటిని హైడ్రా అడిషనల్ కమిషనర్ డి. ఆనంద్ కుమార్ పరిశీలించి పరిష్కార బాధ్యతలను సంబంధిత అధికారులకు అప్పగించారు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
8 సెప్టెంబర్ 2026

# సభా గౌరవం ఎక్కడ? మాటకు హద్దు లేదా?

సంపాదకీయం

ప్రజాస్వామ్యంలో అధికారం మారుతుంది.. పదవులు మారుతాయి.. రాజకీయ సమీకరణాలు మారుతాయి. కానీ రాజ్యాంగ వ్యవస్థల గౌరవం మాత్రం మారకూడదు. శాసనసభాపతి పదవి ఏ పార్టీ సొత్తు కాదు. అది మొత్తం శాసనసభకు ప్రతీక. సభలోని అధికార పక్షానికీ, ప్రతిపక్షానికీ సమాన దూరంలో ఉండాల్సిన అత్యున్నత రాజ్యాంగబద్ధ స్థానం. అలాంటి పదవిని వ్యక్తిగత దూషణలకు, అవమానకర వ్యాఖ్యలకు వేదికగా మార్చడం అంటే ఒక వ్యక్తిని కించపరచడం మాత్రమే కాదు.. సభా వ్యవస్థనే కించపరచడం.

గడ్డం ప్రసాద్ ఎవరు? ఏ సామాజిక నేపథ్యం నుంచి వచ్చారు? ఏ రాజకీయ పార్టీకి చెందినవారు? ఇవన్నీ రాజకీయ చర్చకు సంబంధించిన అంశాలు కావచ్చు. కానీ ఆయన సభాపతి స్థానంలో ఉన్నంతకాలం ఆ పదవి పట్ల గౌరవం ఉండాల్సిందే. అణగారిన వర్గం నుంచి ఒక వ్యక్తి అత్యున్నత శాసనపదవికి ఎదగడం ప్రజాస్వామ్యం ఇచ్చిన అవకాశానికి నిదర్శనం. ఆ నేపథ్యాన్ని అవమానించేలా మాట్లాడటం మరింత బాధ్యతారాహిత్యం.

ప్రభుత్వాన్ని విమర్శించండి. ముఖ్యమంత్రిని విమర్శించండి. మంత్రుల విధానాలను ఎండగట్టండి. సభాపతి నిర్ణయాలను కూడా ప్రశ్నించండి. కానీ వ్యక్తిని అవమానించే భాషలో కాదు.. ప్రజాస్వామ్యాన్ని బలోపేతం చేసే భాషలో. విమర్శకు హక్కు ఉంది కాబట్టి అవమానించే హక్కు వచ్చేసిందనుకోవడం ప్రజాస్వామ్య స్వేచ్ఛకు వక్రీకరణ.

ముఖ్యంగా పెద్దల సభగా భావించే శాసనమండలిలో ఉన్న ప్రజాప్రతినిధులు మరింత సంయమనం పాటించాల్సిన అవసరం ఉంది. బయట రాజకీయ సభల్లో మాట్లాడిన మాటలకు, రాజ్యాంగ వ్యవస్థల వేదికపై మాట్లాడిన మాటలకు తేడా ఉంటుంది. ఒకటి రాజకీయ ప్రచారం కావచ్చు.. మరొకటి ప్రజాస్వామ్య సంస్థల ప్రతిష్ఠకు సంబంధించిన విషయం.

మాటలతో రాజకీయ ప్రత్యర్థిని గాయపరచడం సులభం. కానీ అదే మాటను వెనక్కి తీసుకుని క్షమాపణ చెప్పడానికి రాజకీయ ధైర్యం కావాలి.

ఈ నేపథ్యంలో తాతా మధు బేషరతుగా క్షమాపణలు చెప్పడం అభినందనీయం. అది వెనుకడుగు కాదు. రాజకీయ పరాజయం అంతకన్నా కాదు. తప్పును అంగీకరించే సంస్కారం ఇంకా రాజకీయాల్లో మిగిలే ఉందని చెప్పే పరిణతి. ఒక అనుచిత వ్యాఖ్యతో ఏర్పడిన వివాదాన్ని అక్కడితో ముగించి సభా గౌరవాన్ని కాపాడేందుకు ముందుకు రావడం హుందాతనం.

అయితే ఈ ఘటన ఒక్క వ్యక్తి క్షమాపణతో ముగిసిపోవాల్సిన అంశం కాదు. ప్రతి రాజకీయ పార్టీ, ప్రతి ప్రజాప్రతినిధి ఒకసారి ఆత్మపరిశీలన చేసుకోవాల్సిన సందర్భం ఇది.

సభలో నినాదాలు ఉండొచ్చు.. నిరసనలు ఉండొచ్చు.. వాగ్వాదాలు ఉండొచ్చు. కానీ సభా గౌరవాన్ని హరించే పదజాలం మాత్రం రాజకీయ ఆయుధం కాకూడదు. ప్రజలు ఎన్నుకున్న ప్రతినిధులు ప్రజాస్వామ్య సంస్థల విలువలను కాపాడాల్సినవారు.. వాటిని దిగజార్చేవారు కాదు.

రాజకీయాల్లో ప్రత్యర్థిని ఓడించేందుకు ఎన్నో మార్గాలుంటాయి. వాదనతో ఓడించవచ్చు.. ఆధారాలతో ఓడించవచ్చు.. ప్రజల తీర్పుతో ఓడించవచ్చు. కానీ అవమానంతో గెలిచామని భావించడం మాత్రం ప్రజాస్వామ్యానికి ఓటమి.

సభాపతి గౌరవం అంటే గడ్డం ప్రసాద్‌కు ఇచ్చే వ్యక్తిగత గౌరవం కాదు. అది శాసనసభకు, రాజ్యాంగానికి, ప్రజల తీర్పుకు ఇచ్చే గౌరవం.

ఆ గౌరవాన్ని కాపాడటం అధికార పక్షం ఒక్కటిదీ కాదు.. ప్రతిపక్షం ఒక్కటిదీ కాదు. అది ప్రతి ప్రజాప్రతినిధి బాధ్యత.

రాజకీయ విభేదాలు ఎంత తీవ్రంగా ఉన్నా.. ప్రజాస్వామ్య మర్యాదల గీత దాటకూడదు. ఆ గీత చెరిగిపోయిన రోజు సభ ఉంటుంది.. కానీ ప్రజాస్వామ్య సంస్కారం మాత్రం ఉండదు.

## చరిత్రను చెరిపేయాలనే ప్రయత్నమా?

# సామాజిక న్యాయంపై రాజకీయ దాడా?

"ఒక మహానేతను విమర్శించడం వేరు; ఆయన చారిత్రక పాత్రనే కల్పితం అని కొట్టిపారేయడం వేరు."

భారతదేశ సామాజిక చరిత్రలో డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ స్థానం అత్యంత ప్రత్యేకమైనది. కుల వ్యవస్థ, అంటరానితనం, సామాజిక అసమానత, విద్యా హక్కు, రాజకీయ ప్రాతినిధ్యం, మహిళా హక్కులు, కార్మికుల హక్కులు, రాజ్యాంగ హక్కులు వంటి అనేక అంశాలపై ఆయన పోరాటం సాగించారు. అలాంటి వ్యక్తిని "కల్పిత నాయకుడు", "అవసరానికి మించి గొప్పగా చూపించిన వ్యక్తి" లేదా "రాజకీయంగా తయారు చేసిన నాయకుడు" అంటూ అవమానించే వ్యాఖ్యలు చేయడం పరిపాటిగా మారింది.

ఇలాంటి వ్యాఖ్యలను కేవలం ఒక వ్యక్తిపై చేసిన విమర్శగా చూడటం సరిపోదు. అవి ఏ సామాజిక వర్గాన్ని లక్ష్యంగా చేసుకున్నాయి? ఏ చారిత్రక వాస్తవాన్ని నిరాకరిస్తున్నాయి? ఎవరి ప్రయోజనాలకు అవి ఉపయోగపడుతున్నాయి? అనే ప్రశ్నలను కూడా అడగాలి.

### అంబేద్కర్ చరిత్రలో ఉన్నారా? లేక చరిత్రను సృష్టించారా?

అంబేద్కర్ గురించి భిన్నమైన రాజకీయ అభిప్రాయాలు ఉండవచ్చు. ఆయన ఆర్థిక విధానాలను విమర్శించవచ్చు. ఆయన రాజకీయ వ్యూహాలతో విభేదించవచ్చు. కాంగ్రెస్‌పై ఆయన వైఖరిని, కమ్యూనిస్టు ఉద్యమంపై ఆయన చేసిన విమర్శలను, కార్మిక ఉద్యమంపై ఆయన అభిప్రాయాలను కూడా చర్చించవచ్చు. కానీ చర్చకు ఆధారం చరిత్ర కావాలి. అంబేద్కర్ మహారాష్ట్రలోని సామాజికంగా వెనుకబడిన వర్గంలో జన్మించి, తీవ్రమైన సామాజిక అవమానాలను ఎదుర్కొంటూ ఉన్నత విద్యను అభ్యసించారు. కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ స్కూల్ ఆఫ్ ఎకనామిక్స్ వంటి ప్రపంచ ప్రఖ్యాత విద్యాసంస్థల్లో చదివారు. న్యాయవాదిగా, ఆర్థికవేత్తగా, సామాజిక సంస్కర్తగా, రాజకీయ నాయకుడిగా, రచయితగా పనిచేశాడు .ఇది కల్పితం కాదు. అంబేద్కర్ జీవితాన్ని అధ్యయనం చేయడానికి ఆయన స్వీయ రచనలు, ప్రసంగాలు, ప్రభుత్వ రికార్డులు, రాజ్యాంగ సభ చర్చలు, సమకాలీన పత్రాలు, పుస్తకాలు వంటి విస్తృతమైన ఆధారాలు ఉన్నాయి. అందువల్ల "అంబేద్కర్ కల్పిత నాయకుడు" అనే వాదన చారిత్రక పరిశీలనను తట్టుకోవాలంటే బలమైన ఆధారాలు చూపాలి.

### రాజ్యాంగ నిర్మాణంలో అంబేద్కర్ పాత్రను ఎలా చూడాలి?

అంబేద్కర్‌ను భారత రాజ్యాంగానికి "ఒక్కడే రచయిత"గా చిత్రీకరించడం చారిత్రకంగా సరైనది కాదు. రాజ్యాంగం అనేది రాజ్యాంగ సభలో జరిగిన విస్తృత చర్చలు, అనేక కమిటీల పని, వివిధ సభ్యుల సూచనలు, న్యాయ నిపుణుల సహకారం, అంతర్జాతీయ అనుభవాల పరిశీలన వంటి అనేక ప్రక్రియల ఫలితం.

కానీ అదే సమయంలో డ్రాఫ్టింగ్ కమిటీ ఛైర్మన్‌గా అంబేద్కర్ నిర్వహించిన కీలక పాత్రను తగ్గించడం కూడా చరిత్ర వక్రీకరణే. రాజ్యాంగ సభలో క్లిష్టమైన అంశాలపై ఆయన ఇచ్చిన వివరణలు, రాజ్యాంగ నిబంధనలను సమర్థిస్తూ చేసిన ప్రసంగాలు, వ్యక్తిగత స్వేచ్ఛ, సమానత్వం, సామాజిక న్యాయం, రాజ్యాంగ పరిరక్షణపై ఆయన చేసిన వ్యాఖ్యలు ఆయన పాత్రను స్పష్టంగా చూపుతాయి.

అందుకే సరైన చారిత్రక వైఖరి:

"అంబేద్కర్ ఒక్కడే రాజ్యాంగాన్ని రాయలేదు; కానీ రాజ్యాంగ నిర్మాణంలో ఆయన కీలకమైన నాయకత్వ పాత్ర పోషించారు."ఇదే వాస్తవిక దృక్పథం.

### అంబేద్కర్‌పై దాడి ఎందుకు జరుగుతోంది?

అంబేద్కర్‌ను "కల్పిత నాయకుడు"గా చూపించే ప్రయత్నాన్ని సామాజిక నేపథ్యం లేకుండా అర్థం చేసుకోలేం.

అంబేద్కర్ ప్రధానంగా ప్రశ్నించినది కుల ఆధారిత సామాజిక వ్యవస్థ. ఆయన దృష్టిలో రాజకీయ స్వాతంత్ర్యం మాత్రమే సరిపోదు. సమాజంలో మనిషికి మనిషికి సమానత్వం లేకపోతే స్వాతంత్ర్యం అసంపూర్ణమే.అందుకే ఆయన: కుల వివక్షను ప్రశ్నించాడు అంటరానితనాన్ని,వ్యతిరేకించాడు .విద్యను సామాజిక విముక్తికి ఆయుధంగా చూశాడు – రాజకీయ ప్రాతినిధ్యాన్ని డిమాండ్ చేశాడు .– సామాజిక ప్రజాస్వామ్యాన్ని ప్రాముఖ్యంగా భావించాడు – మహిళల హక్కులకు మద్దతు ఇచ్చాడు .కార్మికుల సంక్షేమంపై పనిచేశాడు .– రాజ్యాంగబద్ధ హక్కులకు ప్రాధాన్యత ఇచ్చాడు .

ఇలాంటి ఆలోచనలు సమాజంలోని శక్తి సంబంధాలను ప్రశ్నిస్తాయి. అందువల్ల అంబేద్కర్‌పై దాడి అనేది చాలాసార్లు ఒక వ్యక్తిపై దాడిగా కాకుండా ఆయన ప్రతిపాదించిన సమానత్వ ఆలోచనలపై దాడిగా మారుతుంది.

అంబేద్కర్‌ను కేవలం ఒక కుల నాయకుడిగా పరిమితం చేయడం కూడా తప్పే!

అంబేద్కర్‌ను విమర్శించే మరో పద్ధతి ఆయనను కేవలం ఒక వర్గానికి చెందిన నాయకుడిగా పరిమితం చేయడం.



అంబేద్కర్ తన రాజకీయ జీవితంలో అణగారిన వర్గాల హక్కుల కోసం పోరాడటం నిజమే. కానీ ఆయన ఆలోచనలు అక్కడితో ఆగిపోలేదు.

ఆయన ప్రజాస్వామ్యాన్ని కేవలం ఎన్నికల ప్రక్రియగా చూడలేదు. సామాజిక, ఆర్థిక అసమానతలు కొనసాగితే రాజకీయ ప్రజాస్వామ్యం బలహీనపడుతుందని హెచ్చరించారు.

ఆయన చెప్పిన స్వేచ్ఛ, సమానత్వం, సౌభ్రాతృత్వం అనే విలువలు ఏ ఒక్క కులానికీ పరిమితమైనవి కావు.

అందుకే అంబేద్కర్‌ను ఒక కులానికి పరిమితం చేయడం ఎంత తప్పో, ఆయనపై విమర్శలను నిషేధించడం కూడా అంతే తప్పు.

అంబేద్కర్‌ను విమర్శించవచ్చు; కానీ ఆధారాలతో విమర్శించాలి.

అంబేద్కర్–గాంధీ విభేదాలను దాచాల్సిన అవసరం లేదు

అంబేద్కర్ చరిత్రను నిజాయితీగా అధ్యయనం చేయాలంటే మహాత్మా గాంధీతో ఆయనకు ఉన్న తీవ్రమైన విభేదాలను కూడా చర్చించాలి. ప్రత్యేక ఎన్నికల ప్రాతినిధ్యం, దళితుల రాజకీయ హక్కులు, కుల వ్యవస్థ నిర్మూలన, సామాజిక సంస్కరణల మార్గం వంటి అంశాల్లో ఇద్దరి మధ్య విభేదాలు ఉన్నాయి.

పూణే ఒప్పందం చుట్టూ జరిగిన రాజకీయ పరిణామాలు కూడా భారత సామాజిక–రాజకీయ చరిత్రలో ముఖ్యమైన అధ్యాయం.

అయితే ఈ విభేదాలను చూపిస్తూ అంబేద్కర్ పాత్రను పూర్తిగా నిరాకరించడం సరైన చరిత్ర కాదు. చరిత్రలో గొప్ప నాయకులు పరస్పరం విభేదిస్తారు. ఆ విభేదాల వల్ల ఎవరి చారిత్రక పాత్రా చెరిగిపోదు.అంబేద్కర్‌పై కమ్యూనిస్టుల విమర్శలు ఉన్నాయి. అంబేద్కర్‌ను గౌరవించడం అంటే ఆయన ప్రతి రాజకీయ అభిప్రాయాన్ని అంగీకరించాల్సిన అవసరం లేదు. అంబేద్కర్ కమ్యూనిస్టు ఉద్యమంలోని కొన్ని సిద్ధాంతాలు, రాజకీయ పద్ధతులను తీవ్రంగా విమర్శించారు. అదే సమయంలో కమ్యూనిస్టు ఉద్యమంలోని అనేక వర్గాలు అంబేద్కర్ కుల నిర్మూలన ప్రశ్నను సరైన స్థాయిలో ముందుకు తీసుకురాలేదని విమర్శలను ఎదుర్కొన్నాయి.

### ఇక్కడి నుంచి ఒక ముఖ్యమైన పాఠం వస్తుంది:

విమర్శ వేరు – నిరాకరణ వేరు. మార్క్సిస్టు దృష్టితో అంబేద్కర్‌ను విమర్శించాలంటే ఆయన వర్గ విశ్లేషణలోని పరిమితులను, కుల–వర్గ సంబంధాలపై ఆయన ఆలోచనలను, రాజ్యాంగపరమైన మార్గంపై ఆయన నమ్మకాన్ని విశ్లేషించవచ్చు.

అదే సమయంలో అంబేద్కర్ కుల నిర్మూలన ప్రశ్నను భారతీయ సమాజంలో కేంద్ర సమస్యగా ముందుకు తెచ్చిన చారిత్రక వాస్తవాన్ని కూడా అంగీకరించాలి. కులాన్ని పక్కన పెట్టి వర్గాన్ని అర్థం చేసుకోలేం; వర్గాన్ని పక్కన పెట్టి కులాన్ని పూర్తిగా అర్థం చేసుకోలేం. ఇది భారతీయ సామాజిక మార్పు ఉద్యమాలకు ఇప్పటికీ కీలకమైన పాఠం. "కల్పిత నాయకుడు" అనే పదం వెనుక అసలు రాజకీయమేమిటి? ఒక నాయకుడి చారిత్రక పాత్రను తగ్గించడానికి మొదట ఆయనను "అతిగా ప్రచారం చేయబడిన వ్యక్తి"గా చిత్రీకరిస్తారు. తర్వాత ఆయనకు ఉన్న ప్రజా ప్రభావాన్ని "రాజకీయ సృష్టి"గా చెబుతారు. ఆ తరువాత ఆయన ఆలోచనలను "విభజన రాజకీయాలు"గా ముద్ర వేస్తారు.

చివరకు ఆయన చారిత్రక పాత్రనే నిరాకరించే ప్రయత్నం జరుగుతుంది. ఇది కేవలం అంబేద్కర్ విషయంలోనే కనిపించే పద్ధతి కాదు. అనేక దేశాల్లో, అనేక సామాజిక ఉద్యమాల్లో, ప్రజల హక్కుల కోసం పోరాడిన నాయకుల చరిత్రను తిరిగి రాసే ప్రయత్నాలు జరిగాయి.

### అందువల్ల ప్రశ్న:

"అంబేద్కర్‌ను ఎవరు తయారు చేశారు?" కాదు. ప్రశ్న:

"అంబేద్కర్ ఎందుకు కోట్లాది మంది అణగారిన ప్రజలకు తమ స్వాభిమానానికి ప్రతీకగా మారారు?" అనే దానిని పరిశీలించాలి.

అంబేద్కర్ ప్రజాదరణకు కారణం ఏమిటి?

ఒక నాయకుడిని ప్రజలు దశాబ్దాల తరబడి గుర్తుంచుకోవడానికి కేవలం ప్రభుత్వ ప్రచారం సరిపోదు. అంబేద్కర్ పేరు భారతదేశంలోని అనేక అణగారిన వర్గాల సామాజిక చైతన్యంతో ముడిపడి ఉంది. విద్య కోసం పోరాటం, స్వాభిమానం కోసం పోరాటం, కుల వివక్షకు వ్యతిరేక పోరాటం, రాజకీయ ప్రాతినిధ్యం కోసం పోరాటం–ఇవి వారి జీవిత అనుభవాలకు సంబంధించిన ప్రశ్నలు. అందువల్ల అంబేద్కర్ ఒక పుస్తకంలోని పాత్రగా కాకుండా సామాజిక ఉద్యమాల సజీవ చిహ్నంగా మారారు. అది ఎవరైనా రాజకీయ పార్టీ ఇచ్చిన బిరుదు వల్ల జరిగినది కాదు. అంబేద్కర్ విగ్రహాలు పెరగడం మాత్రమే సరిపోతుందా? ఇక్కడ అంబేద్కర్‌ను విమర్శించే వారితో పాటు ఆయనను గౌరవించే వారినీ ఒక ప్రశ్న అడగాలి.

అంబేద్కర్ విగ్రహాలు పెరగడం, జయంతి వేడుకలు నిర్వహించడం మాత్రమే ఆయనను గౌరవించడం కాదు. ఆయన ఆలోచనలను ఆచరణలో పెట్టడం ముఖ్యం.– ప్రతి పిల్లవాడికి నాణ్యమైన విద్య అందుతున్నదా?– కుల వివక్ష తగ్గుతున్నదా?– భూమి, ఉపాధి, వనరులపై సమాన అవకాశాలు ఉన్నాయా?– మహిళలకు సమాన హక్కులు ఉన్నాయా?– అణగారిన వర్గాలకు రాజకీయ ప్రాతినిధ్యం పెరుగుతున్నదా?రాజ్యాంగ హక్కులు రక్షించబడుతున్నాయా?– సామాజిక ప్రజాస్వామ్యం బలపడుతున్నదా? ఈ ప్రశ్నలకు సమాధానాలు లేకుండా అంబేద్కర్ చిత్రపటాలకు పూలమాలలు వేయడం ఒక ఆచారంగా మాత్రమే మిగిలిపోతుంది. అంబేద్కర్‌ను విమర్శించకూడదా? విమర్శించాలి.కానీ

### మూడు ప్రమాణాలు ఉండాలి:

1. చారిత్రక ఆధారం

ఏ ఆరోపణ చేసినా దానికి ఆధారం ఉండాలి.

2. సంపూర్ణ సందర్భం

ఒక ప్రసంగంలోని ఒక్క వాక్యాన్ని తీసుకుని మొత్తం అంబేద్కర్ ఆలోచనగా చూపకూడదు.

3. వ్యక్తిగత అవమానం కాదు

రాజకీయ లేదా సిద్ధాంతపరమైన విమర్శకు వ్యక్తిగత అవమానం అవసరం లేదు. అంబేద్కర్ రచనలు చదివి ఆయనను విమర్శించడం ప్రజాస్వామ్యం. అంబేద్కర్ గురించి తెలియకుండానే "కల్పిత నాయకుడు" అని ముద్ర వేయడం చరిత్రపట్ల అన్యాయం. రాజ్యాంగ విలువలను కాపాడటం అంటే అంబేద్కర్‌ను విగ్రహంగా మార్చడం కాదు. అంబేద్కర్ వారసత్వాన్ని నిజంగా గౌరవించాలంటే ఆయనను కేవలం విగ్రహంగా కాకుండా ఆలోచనగా చూడాలి.

సమానత్వం ప్రమాదంలో ఉన్నప్పుడు ఆయనను గుర్తు చేసుకోవాలి. కుల వివక్ష ఎదురైనప్పుడు ఆయనను గుర్తు చేసుకోవాలి. విద్యా అవకాశాలు అసమానంగా మారినప్పుడు ఆయన ఆలోచనలను చర్చించాలి. రాజ్యాంగ హక్కులు బలహీనపడుతున్నప్పుడు ఆయన ప్రజాస్వామ్య దృక్పథాన్ని గుర్తుచేసుకోవాలి. అణగారిన ప్రజలకు రాజకీయ ప్రాతినిధ్యం నిరాకరించబడినప్పుడు ఆయన పోరాటాన్ని అధ్యయనం చేయాలి. అప్పుడు మాత్రమే అంబేద్కర్ వారసత్వం జీవిస్తుంది.

### చరిత్రను విమర్శించండి, చెరిపేయకండి

డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఒక దేవుడు కాదు. ఆయన తప్పులేని వాడు కూడా కాదు. ఆయన ఒక చారిత్రక వ్యక్తి. అందువల్ల ఆయనను అధ్యయనం చేయాలి, విశ్లేషించాలి, విమర్శించాలి. కానీ "కల్పిత నాయకుడు" అంటూ ఆయన చారిత్రక పాత్రను కొట్టిపారేయడం శాస్త్రీయ చర్చ కాదు. అంబేద్కర్ జీవితాన్ని అంగీకరించాలా వద్దా అనేది ఎవరి వ్యక్తిగత ఇష్టం కావచ్చు. కానీ ఆయన భారత సామాజిక చరిత్రపై చూపిన ప్రభావాన్ని నిరాకరించడం మాత్రం చారిత్రక వాస్తవాలను నిరాకరించడమే. అంబేద్కర్ అసలు వారసత్వం విగ్రహాల్లో లేదు. అది సమానత్వం కోసం పోరాటంలో ఉంది. అది స్వాభిమానం కోసం పోరాటంలో ఉంది.

అది కుల వివక్షకు వ్యతిరేకంగా నిలబడటంలో ఉంది.

అది విద్య, హక్కులు, ప్రాతినిధ్యం, ప్రజాస్వామ్యం కోసం పోరాటంలో ఉంది. కాబట్టి "అంబేద్కర్ కల్పిత నాయకుడు" అనే ప్రశ్నకు సమాధానం ఒక్కటే:

కల్పితం అయితే చరిత్ర పుస్తకాల్లో మాత్రమే ఉండేవాడు.

అంబేద్కర్ మాత్రం ప్రజల సామాజిక చైతన్యంలో ఉన్నాడు.

అందుకే అంబేద్కర్‌పై విమర్శలు రావచ్చు–విమర్శించండి.

ఆయన సిద్ధాంతాలతో విభేదించవచ్చు–విభేదించండి.

కానీ చరిత్రను వక్రీకరించి ఆయనను కల్పిత నాయకుడిగా చిత్రీకరించడాన్ని మాత్రం ప్రశ్నించాలి.



వ్యాస రచన
**మాలోతు సాగర్**
**సామాజిక వేత్త**
సెల్ నెంబర్ 7013805411

# తెలంగాణ రాజకీయ వ్యవస్థలో– ఏం జరుగుతోంది?

తెలంగాణ రాజకీయ వ్యవస్థ ప్రస్తుతం అత్యంత ఆసక్తికరమైన, సంక్లిష్టమైన, పరివర్తనాత్మక దశను ఎదుర్కొంటోంది. రాష్ట్ర ఆవిర్భావం అనంతరం రాజకీయంగా ఏర్పడిన ఒకే కేంద్రక శక్తి ఆధిపత్యం క్రమంగా బహుళ రాజకీయ పోటీ వ్యవస్థగా మారుతోంది. తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమం, ప్రాంతీయ అస్తిత్వం, నీళ్లు–నిధులు–నియామకాలు వంటి భావోద్వేగ రాజకీయ అంశాలపై ఏర్పడిన రాజకీయ సమీకరణలు ఇప్పుడు సంక్షేమం, సామాజిక న్యాయం, ఉద్యోగాలు, ఆర్థిక అభివృద్ధి, కుల ప్రాతినిధ్యం, పాలనా పనితీరు వంటి అంశాల వైపు మళ్లుతున్నాయి. అందువల్ల ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో జరుగుతున్న పరిణామాలను కేవలం అధికార పార్టీ––ప్రతిపక్ష పార్టీ మధ్య పోరాటంగా చూడటం సరిపోదు. ఇది రాష్ట్ర రాజకీయ వ్యవస్థ స్వభావంలో జరుగుతున్న ఒక పెద్ద మార్పు.


తెలంగాణ ఏర్పడిన తొలి దశలో ప్రాంతీయ అస్తిత్వ రాజకీయాలు అత్యంత బలంగా పనిచేశాయి. రాష్ట్ర సాధన ఉద్యమానికి నాయకత్వం వహించిన రాజకీయ శక్తి ప్రజల భావోద్వేగాలతో బలమైన అనుబంధాన్ని ఏర్పరచుకుంది. తెలంగాణ అనే భావన రాజకీయంగా ఒక గొప్ప ఐక్యతా శక్తిగా మారింది. రాష్ట్రం ఏర్పడి అనేక సంవత్సరాలు గడిచిన తరువాత రాజకీయ చర్చలో సహజంగానే కొత్త ప్రశ్నలు ముందుకు వచ్చాయి. రాష్ట్రాన్ని సాధించిన తరువాత ప్రజల జీవన ప్రమాణాలు ఎంతవరకు మెరుగుపడ్డాయి? యువతకు ఉద్యోగాలు వచ్చాయా? రైతుల ఆదాయం పెరిగిందా? గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలపడిందా? పేదలకు సంక్షేమ పథకాలు సమర్థవంతంగా అందుతున్నాయా? ప్రభుత్వంపై ప్రజల విశ్వాసం ఎంతవరకు ఉంది? వంటి ప్రశ్నలు ఇప్పుడు తెలంగాణ రాజకీయాల కేంద్ర బిందువుగా మారుతున్నాయి.

ఈ మార్పులో అత్యంత ముఖ్యమైన అంశం అధికార కాంగ్రెస్ ప్రభుత్వంపై పెరుగుతున్న రాజకీయ ఒత్తిడి. ప్రభుత్వం తన పాలనను అభివృద్ధి, సంక్షేమం, సామాజిక న్యాయం అనే మూడు ప్రధాన ఆధారాలపై నిలబెట్టుకోవడానికి ప్రయత్నిస్తోంది. ముఖ్యంగా కుల గణన, వెనుకబడిన వర్గాల ప్రాతినిధ్యం, ఎస్సీ వర్గీకరణ, పేదలకు గృహాలు, ఉద్యోగాల కల్పన వంటి అంశాలను ప్రభుత్వం తన రాజకీయ, సామాజిక విధానంలో కీలకంగా చూపిస్తోంది. ప్రభుత్వం సామాజిక న్యాయాన్ని రాజకీయ అజెండాగా మార్చే ప్రయత్నం చేస్తుండటం తెలంగాణ రాజకీయాల్లో ఒక ముఖ్యమైన పరిణామం. కుల గణన, ఎస్సీ ఉపవర్గీకరణ వంటి అంశాలను సామాజిక ప్రాతినిధ్యంతో అనుసంధానిస్తూ ప్రభుత్వం తన రాజకీయ దిశను స్పష్టంగా తెలియజేస్తోంది.

అయితే ప్రభుత్వానికి రాజకీయంగా ప్రధాన సవాలు హామీల అమలు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల అంచనాలుగా మారిపోతాయి. ఎన్నికల హామీ ఒక రాజకీయ వాగ్దానం మాత్రమే అయినప్పటికీ, అధికారంలోకి వచ్చిన తరువాత అది ప్రభుత్వ పనితీరును కొలిచే ప్రమాణంగా మారుతుంది. ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఇదే ప్రధాన సంఘర్షణ. అధికార పార్టీ ప్రభుత్వం చేసిన పనులను ప్రజలకు వివరించడానికి ప్రయత్నిస్తుంటే, ప్రతిపక్షాలు ఇంకా అమలు కాని హామీలను రాజకీయ ఆయుధంగా ఉపయోగిస్తున్నాయి. బీఆర్ఎస్ నాయకత్వం ఉద్యోగాలు, విద్యార్థులు, నిరుద్యోగం, విద్యుత్, ఇతర ప్రజా సమస్యలపై ప్రభుత్వాన్ని తీవ్రంగా విమర్శిస్తోంది. ప్రతిపక్ష రాజకీయాలు అధికార రాజకీయాల కంటే భిన్నమైనవి. అధికారంలో ఉన్నప్పుడు నిర్ణయాలు తీసుకోవాలి. ప్రతిపక్షంలో ఉన్నప్పుడు ప్రజా అసంతృప్తిని రాజకీయ శక్తిగా మార్చాలి. ప్రస్తుతం బీఆర్ఎస్ ఎదుర్కొంటున్న ప్రధాన సవాలు ఇదే.

ఇక్కడ బీఆర్ఎస్ పరిస్థితి కూడా తెలంగాణ రాజకీయ పరిశోధనలో ప్రత్యేకంగా అధ్యయనం చేయాల్సిన అంశం. ఒకప్పుడు అధికారంలో ఉన్న పార్టీ ఇప్పుడు ప్రతిపక్షంలో తన రాజకీయ స్థలాన్ని తిరిగి నిర్మించుకోవాల్సిన పరిస్థితిని ఎదుర్కొంటోంది. అధికారంలో ఉన్నప్పుడు పాలన, అభివృద్ధి, సంక్షేమం గురించి మాట్లాడిన పార్టీ ఇప్పుడు ప్రజా సమస్యలపై ఉద్యమాలు చేసి ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాల్సి వస్తోంది. బీఆర్ఎస్‌కు ప్రస్తుతం ప్రధాన సవాలు ప్రజలతో కొత్త రాజకీయ అనుబంధాన్ని ఏర్పరచుకోవడం. తెలంగాణ ఉద్యమం సమయంలో పార్టీకి తెలంగాణ భావోద్వేగం ఒక పెద్ద రాజకీయ బలం. ఇప్పుడు యువతలో కొత్త తరం ఓటర్లు పెరిగారు. తెలంగాణ ఉద్యమాన్ని ప్రత్యక్షంగా అనుభవించని యువ ఓటర్లు ఉద్యోగాలు, జీవన వ్యయం, విద్య, ఉపాధి, సాంకేతిక అవకాశాలు, భవిష్యత్తు అవకాశాల ఆధారంగా రాజకీయ నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉంది. అందువల్ల ప్రాంతీయ భావోద్వేగం మాత్రమే భవిష్యత్తు ఎన్నికల్లో సరిపోదు. కొత్త రాజకీయ కథనం అవసరం.

ఇదే సమయంలో బీజేపీ తెలంగాణ రాజకీయాల్లో తన స్థలాన్ని విస్తరించడానికి ప్రయత్నిస్తోంది. కాంగ్రెస్ ప్రభుత్వంపై ఉన్న అసంతృప్తిని, కేంద్ర–రాష్ట్ర రాజకీయ విభేదాలను, జాతీయ రాజకీయ కథనాన్ని ఉపయోగించుకోవాలని ప్రయత్నిస్తోంది. దీంతో తెలంగాణ రాజకీయాలు రెండు పార్టీల పోటీ నుంచి మూడు ప్రధాన రాజకీయ శక్తుల మధ్య పోటీగా మారుతున్నాయి. ఈ త్రిముఖ రాజకీయ పోటీ రాష్ట్ర ప్రజాస్వామ్యానికి ఒకవైపు బలమైన ప్రత్యామ్నాయాలను అందించవచ్చు. మరోవైపు ఓట్ల విభజన, రాజకీయ ధ్రువీకరణ, అస్థిరమైన ఎన్నికల సమీకరణలకు దారితీయవచ్చు.




ప్రస్తుతం తెలంగాణ రాజకీయాల్లో ఎన్నికల ప్రక్రియలపై కూడా రాజకీయ చర్చ పెరుగుతోంది. ఓటరు జాబితాల సవరణ, ఎన్నికల నిర్వహణ, ఓటర్ల నమోదు వంటి అంశాలు రాజకీయ పోటీకి కొత్త కోణాన్ని జోడిస్తున్నాయి. ఎన్నికల వ్యవస్థపై ప్రజల విశ్వాసం ప్రజాస్వామ్యానికి అత్యంత ముఖ్యమైన అంశం. రాజకీయ పార్టీలు ఎన్నికల ప్రక్రియలపై ఆరోపణలు చేయడం, ప్రత్యర్థి పార్టీలపై విమర్శలు చేయడం రాజకీయ పోటీలో సహజమే. అయితే ఎన్నికల సంస్థలపై ప్రజల విశ్వాసాన్ని కాపాడుకోవడం అన్ని రాజకీయ శక్తుల బాధ్యత.

తెలంగాణ రాజకీయాల్లో కాంగ్రెస్ పార్టీ అంతర్గత పరిస్థితి కూడా చర్చనీయాంశంగా మారుతోంది. అధికారంలోకి వచ్చిన తరువాత వివిధ ప్రాంతాల నుంచి, వివిధ రాజకీయ నేపథ్యాల నుంచి వచ్చిన నాయకులను సమన్వయం చేయడం కాంగ్రెస్‌కు ఒక పెద్ద సవాలు. అధికారంలో ఉన్న రాజకీయ పార్టీలో పదవులు, రాజకీయ ప్రాతినిధ్యం, నియోజకవర్గ ఆధిపత్యం, నాయకత్వ ప్రభావం వంటి అంశాలపై విభేదాలు సహజం. కాంగ్రెస్ పార్టీ విస్తృత నాయకత్వం కలిగిన పార్టీ కావడంతో ప్రాంతీయ నాయకుల ఆశయాలను, సామాజిక వర్గాల ప్రాతినిధ్యాన్ని, ప్రభుత్వ నిర్ణయాలను సమన్వయం చేయడం ప్రభుత్వ స్థిరత్వానికి అత్యంత అవసరం. ఇది తెలంగాణ రాజకీయ వ్యవస్థలో ఒక ముఖ్యమైన సత్యాన్ని తెలియజేస్తోంది. ఎన్నికల్లో గెలవడం ఒక దశ మాత్రమే. అధికారాన్ని సమర్థవంతంగా నిర్వహించడం మరో దశ. ఎన్నికల విజయం రాజకీయ పార్టీకి అధికారాన్ని ఇస్తుంది. అయితే సమర్థవంతమైన పాలన మాత్రమే దీర్ఘకాలిక రాజకీయ విశ్వాసాన్ని ఇస్తుంది. ప్రజలు ప్రభుత్వం చేసిన ప్రకటనలను మాత్రమే చూడరు. తమ జీవితాల్లో వచ్చిన మార్పును కూడా గమనిస్తారు. ధరలు తగ్గాయా? ఉద్యోగాలు పెరిగాయా? ప్రభుత్వ సేవలు మెరుగుపడ్డాయా? రైతుల సమస్యలు పరిష్కారమయ్యాయా? విద్యా రంగం బలపడిందా? ఆరోగ్య సేవలు అందుబాటులోకి వచ్చాయా? వంటి అంశాల ఆధారంగా ప్రభుత్వాలను అంచనా వేయడం ఇప్పుడు పెరుగుతోంది.

ఇక తెలంగాణ రాజకీయాల్లో కుల రాజకీయాలు మరింత ప్రాధాన్యత పొందుతున్నాయి. గతంలో తెలంగాణ రాజకీయ చర్చ ప్రధానంగా ప్రాంతీయ అస్తిత్వం చుట్టూ తిరిగింది. ఇప్పుడు ప్రాంతీయ అస్తిత్వంతో పాటు సామాజిక అస్తిత్వం కూడా రాజకీయంగా బలపడుతోంది. వెనుకబడిన వర్గాలు, ఎస్సీలు, ఎస్టీలు, మైనారిటీలు, మహిళల రాజకీయ ప్రాతినిధ్యం ప్రధాన అంశాలుగా మారుతున్నాయి. కుల గణన వంటి చర్యలు కేవలం పరిపాలనా కార్యక్రమాలు మాత్రమే కావు. అవి రాజకీయ ప్రాతినిధ్యం, సంక్షేమ పంపిణీ, అధికార భాగస్వామ్యంపై ప్రభావం చూపగలవు.

సామాజిక న్యాయం అనే అంశం తెలంగాణ రాజకీయాల్లో రాబోయే సంవత్సరాల్లో మరింత ప్రధాన పాత్ర పోషించే అవకాశం ఉంది. జనాభాలో ఉన్న వివిధ సామాజిక వర్గాలకు రాజకీయ వ్యవస్థలో ఎంత ప్రాతినిధ్యం లభిస్తోంది? ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు ఎవరికి ఎంతవరకు చేరుతున్నాయి? విద్య, ఉద్యోగాలు, స్థానిక సంస్థల్లో అవకాశాల పంపిణీ ఎలా ఉంది? వంటి ప్రశ్నలు రాజకీయ చర్చను ప్రభావితం చేస్తాయి. ఈ పరిస్థితి రాజకీయ పార్టీలను కేవలం అభివృద్ధి వాగ్దానాలతో కాకుండా సామాజిక సమతుల్యతపై కూడా స్పష్టమైన విధానాలను రూపొందించేలా చేస్తోంది.

స్థానిక సంస్థల రాజకీయాలు కూడా తెలంగాణ భవిష్యత్ రాజకీయాలను ప్రభావితం చేసే ప్రధాన రంగంగా మారుతున్నాయి. గ్రామ పంచాయతీలు, మండల పరిషత్తులు, జిల్లా పరిషత్తులు, పురపాలక సంస్థలు, నగర పాలక సంస్థలు కేవలం స్థానిక పరిపాలనా వ్యవస్థలు మాత్రమే కావు. అవే భవిష్యత్ రాజకీయ నాయకత్వానికి పునాది. స్థానిక సంస్థల ఎన్నికల్లో వెనుకబడిన వర్గాల రిజర్వేషన్లు, మహిళల ప్రాతినిధ్యం, ఎస్సీ––ఎస్టీ రిజర్వేషన్లు వంటి అంశాలు రాజకీయ పోటీని ప్రత్యక్షంగా ప్రభావితం చేస్తాయి.

స్థానిక రాజకీయాల్లో మరో ముఖ్యమైన అంశం ఏమిటంటే ప్రాతినిధ్యం ఉండటం, వాస్తవ అధికారాన్ని వినియోగించగలగడం ఒకే విషయం కాదు. రిజర్వేషన్ ద్వారా పదవి రావడం మాత్రమే రాజకీయ సాధికారతకు సరిపోదు. నిర్ణయాధికారాన్ని స్వతంత్రంగా వినియోగించే పరిస్థితులు కూడా అవసరం.


మిగితా తరువాయి సంచికలో..



**డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి**
కాకతీయ విశ్వవిద్యాలయం

# మొండిగౌరెల్లి వాసికి అరుదైన గౌరవం

- రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకున్న డా. బండి జ్యోతి




**యాచారం, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** యాచారం మండలం మొండి గౌరెల్లి గ్రామానికి చెందిన రసాయన శాస్త్ర అధ్యాపకురాలు డా. బండి జ్యోతికి అరుదైన గౌరవం దక్కింది. 2026 సంవత్సరానికి గాను రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారానికి ఆమె ఎంపికయ్యారు. ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని కొడంగల్ పట్టణంలో నిర్వహించిన రాష్ట్రస్థాయి వేడుకల్లో ముఖ్యమంత్రి లిఎ. రేవంత్ రెడ్డిలి సమక్షంలో విద్యాశాఖ కార్యదర్శి లియోగితా రానాలి, కళాశాల విద్యాశాఖ కమిషనర్ లిదేవసేనలి, శాసనమండలి సభ్యుడు లిశ్రీపాల్ రెడ్డి చేతుల మీదుగా ఆమె ఈ ప్రతిష్టాత్మక పురస్కారాన్ని అందుకున్నారు. ప్రస్తుతం డా. బండి జ్యోతి నాయాపూల్ ప్రభుత్వ నగర కళాశాలలో రసాయన శాస్త్ర విభాగం సహాయ ఆచార్యురాలిగా సేవలందిస్తూ, కళాశాలలో జాతీయ విద్యార్థి దళం సంరక్షణ అధికారిణిగా అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు.

### విద్యాభ్యాసం నుంచి అధ్యాపక వృత్తి వరకు...

డా. బండి జ్యోతి నవోదయ విద్యాలయంలో ఇంటర్మీడియట్ వరకు విద్యాభ్యాసం పూర్తి చేసి, రెడ్డి కళాశాలలో డిగ్రీ చదివారు. 2010లో రసాయన శాస్త్రంలో స్నాతకోత్తర విద్యను పూర్తి చేయడంతో పాటు అదే సంవత్సరంలో జూ×= – జీ=ఖీ అర్హత పరీక్షలో ఉత్తీర్ణత సాధించారు. 2011లో అప్పటి ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించిన ఉపాధ్యాయ నియామక పరీక్ష ద్వారా అధ్యాపక వృత్తిలోకి ప్రవేశించి, 14 ఏళ్లుగా నాణ్యమైన విద్యను అందిస్తున్నారు.

### బోధనతో పాటు సామాజిక సేవలోనూ...

తన 14 ఏళ్ల సేవా ప్రస్థానంలో ఐదేళ్ల పాటు జాతీయ సేవా పథకం కార్యక్రమ అధికారిణిగా, ఆరు నెలల పాటు పూర్తి అదనపు బాధ్యతలతో కళాశాల ప్రిన్సిపాల్‌గా సేవలందించారు. విద్యార్థుల్లో ప్రతిభను వెలికితీసేందుకు నిర్వహించిన రాష్ట్రస్థాయి రసాయన శాస్త్ర పరిశోధనా ప్రాజెక్టు ప్రదర్శనలో రెండుసార్లు విజేతగా నిలిచారు. 2024లో జరిగిన జాతీయ యువజనోత్సవాల్లో తెలంగాణ రాష్ట్ర ఎన్ ఎస్ ఎస్ బృందానికి నాయకురాలిగా వ్యవహరించారు.

### పరిశోధన రంగంలోనూ ప్రత్యేక గుర్తింపు

గణనాత్మక రసాయన శాస్త్రంలో ఉస్మానియా విశ్వవిద్యాలయం నుంచి పీహెచ్‌డీ పూర్తి చేసిన డా. జ్యోతి, తన సేవా కాలంలో నాలుగు పుస్తకాలు, రెండు పుస్తక అధ్యాయాలు రచించారు. అంతర్జాతీయ శాస్త్ర పత్రికల్లో ఆరు పరిశోధనా వ్యాసాలను ప్రచురించడంతో పాటు రెండు పరిశోధనా హక్కులు సాధించారు. జాతీయ, అంతర్జాతీయ స్థాయి శాస్త్ర సదస్సుల్లో సమన్వయకర్తగా వ్యవహరిస్తూ తనదైన ముద్ర వేశారు.

### భర్త, పిల్లలకు పురస్కారం అంకితం

తనకు ఈ పురస్కారం దక్కడంలో భర్త ఏడేల్లి శ్రావణ్ కుమార్‌లిఅందించిన ప్రోత్సాహం, సహకారం ఎంతో ఉందని డా. జ్యోతి తెలిపారు. తాను చేపట్టిన ప్రతి కార్యక్రమం వెనుక భర్త అండగా నిలిచారని, ఆయన సహకారం వల్లే ఈ స్థాయికి చేరుకోగలిగానని పేర్కొన్నారు. ఈ పురస్కారాన్ని భర్త శ్రావణ్ కుమార్, కుమార్తె మనస్విని, కుమారుడు అయాన్ష్‌కు అంకితం చేస్తున్నట్లు తెలిపారు. తన తల్లిదండ్రులకు, గురువులకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని అన్నారు. మొండి గౌరెల్లి గ్రామానికి చెందిన డా. బండి జ్యోతి రాష్ట్ర ఉత్తమ అధ్యాపక పురస్కారం అందుకోవడంతో గ్రామంలో హర్షాతిరేకాలు వ్యక్తమయ్యాయి. ఆమె భర్త శ్రావణ్ కుమార్, కుమార్తె మనస్విని, కుమారుడు అయాన్ష్, అత్తమామలు సత్తయ్య–శారదమ్మ, తల్లి సత్తెమ్మ, కుటుంబ సభ్యులు, బంధుమిత్రులు, గ్రామ పెద్దలు, నాయకులు ఆమెకు అభినందనలు తెలిపారు. గ్రామీణ ప్రాంతం నుంచి విద్యా ప్రస్థానాన్ని ప్రారంభించి రాష్ట్రస్థాయి ఉత్తమ పురస్కారం అందుకునే స్థాయికి ఎదిగిన డా. జ్యోతి విజయ ప్రస్థానం యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

## సబితా ఇంద్రారెడ్డి అరెస్టుకు నిరసనగా చేవెళ్లలో బీఆర్ఎస్ ధర్నా

- బీజాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు



**చేవెళ్ల, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** తెలంగాణ శాసనసభ ప్రాంగణంలో మాజీ మంత్రులు కె.టి.రామారావు, తన్నీరు హరీష్‌రావు, సబితా ఇంద్రారెడ్డిలను పోలీసులు అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ చేవెళ్లలో బీఆర్ఎస్ శ్రేణులు మెరుపు ధర్నా నిర్వహించారు. ముఖ్యంగా మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని పోలీసులు అరెస్టు చేసిన తీరుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. బీఆర్ఎస్ చేవెళ్ల మండల అధ్యక్షుడు పెద్దోళ్ల ప్రభాకర్, మాజీ డీసీఎంఎస్ చైర్మన్ పి.కృష్ణా రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం బీజాపూర్ ప్రధాన రహదారిపై బైఠాయించి కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. ప్రతిపక్ష నాయకులను అరెస్టు చేయడం ప్రజాస్వామ్య స్ఫూర్తికి విరుద్ధమని నాయకులు అన్నారు. ప్రజల తరపున ప్రభుత్వాన్ని ప్రశ్నించే ప్రతిపక్ష నాయకుల గొంతులను అణిచివేయడం సరికాదని వారు మండిపడ్డారు. రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడకుండా ప్రజాస్వామ్య పద్ధతిలో ప్రతిపక్షాల ఆందోళనలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో బీఆర్ఎస్ దేశమల్ల ఆంజనేయులు, వంగ శ్రీధర్ రెడ్డి, గోనె కరుణాకర్ రెడ్డి, కౌన్సిలర్లు శ్రీనివాస్ రెడ్డి, దూత మల్లేష్, దప్పు సువర్ణ, మంగమ్మ మల్లేష్, సర్పంచులు మల్లా రెడ్డి, నరహరి రెడ్డి, మాజీ సర్పంచులు జంగా రెడ్డి, ఎండి.జావేద్, హన్మంత్ రెడ్డి, మాధవ్ రెడ్డి, అనంత్ రెడ్డి, నత్తి క్రిష్టా రెడ్డి, క్రిష్టా, బి.నర్సింహులు, పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## ప్రజా సమస్యల పరిష్కారానికి బీఆర్ఎస్ పోరాటం

- ప్రజావాణిలో నాయకుల వినతి



**మల్కాజిగిరి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** ప్రజా సమస్యల పరిష్కారం కోసమే బీఆర్ఎస్ నిరంతరం ప్రజల పక్షాన నిలిచి పోరాడుతుందని ఆ పార్టీ స్థానిక నాయకులు స్పష్టం చేశారు. పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపు మేరకు, మల్కాజిగిరి ఎమ్మెల్యే మర్రి రాజశేఖర్‌రెడ్డి ఆదేశాలతో సోమవారం మల్కాజిగిరి సర్కిల్ కార్యాలయంలో నిరసన చేపట్టారు. కాంగ్రెస్ ప్రభుత్వ వైఫల్యాలను ఎండగడుతూ, ఎన్నికల సమయంలో ఇచ్చిన 420 హామీలను తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం మల్కాజిగిరి సర్కిల్ ప్రజావాణి కార్యక్రమంలో జోనల్ కమిషనర్ సంచిత్ గంగ్వార్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ. నియోజకవర్గంలో తాగునీటి ఎద్దడి, వీధి దీపాల నిర్వహణ లేకపోవడం వంటి సమస్యలతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. నిలిచిపోయిన పింఛన్లను మంజూరు చేయాలని, బస్తీ దవాఖానలను అందుబాటులోకి తెచ్చి మౌలిక వసతులు కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్లు జగదీశ్‌గౌడ్, మేకల సునీతారాము యాదవ్, నాయకులు జేఏసీ వెంకన్న, రాము యాదవ్, చిన్న యాదవ్, టీఆర్ఎస్వీ నర్సింగ్, ప్రభాకర్ గౌడ్, కేబుల్ రమేశ్, కిట్టు, ఉపేందర్, అనితలక్ష్మి ఆనంద్‌తో పాటు పెద్ద సంఖ్యలో పార్టీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఆశా వర్కర్లపై ముందస్తు అరెస్టులు



**గద్వాల, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** హైదరాబాద్ ఇందిరాపార్క్ వద్ద చేపట్టనున్న ధర్నాకు ఆశా వర్కర్లు వెళ్లకుండా ముందస్తు అరెస్టులు చేస్తున్నారని తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ సీఐటీయూ జిల్లా కార్యదర్శి సునీత ఆరోపించారు. విధుల్లో ఉన్న ఆశా వర్కర్లను సైతం మధ్యలోనే అరెస్టు చేసి విధులకు దూరం చేశారని తెలిపారు. ఆశా వర్కర్ల న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాల్సిన ప్రభుత్వం అరెస్టులు,నిర్బంధాలకు పాల్పడటం సరికాదన్నారు. ఉద్యమాన్ని అణచివేసే ప్రయత్నాలను తిప్పికొట్టి,హక్కుల సాధన కోసం పోరాటాన్ని కొనసాగిస్తామని సునీత స్పష్టం చేశారు.

# పశు వైద్యశాలలకు మధ్యాహ్నమే తాళం

**మర్పల్లి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** వికారాబాద్ జిల్లా మర్పల్లి మండల కేంద్రంలో ఉన్న పశు వైద్యశాలకు మధ్యాహ్నమే తాళం వేసి వెళ్లిపోయిన సిబ్బంది. పాడి పశువులు గొర్రెలు మేకలు తదితర మూగజీవులు అనారోగ్యం తలెత్తుతే సకాలంలో వైద్యం అందించవలసిన పశు వైద్య డాక్టర్లు అందుబాటులో లేకపోవడంతో రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మర్పల్లి మండల కేంద్రంలో ఉన్న పశువైద్యశాలకు పశు వైద్యాధికారులు సిబ్బంది సకాలంలో హాజీరు కారు. ఈ టైం లో వస్తారు ఏ టైం లో వెళ్తాలో తెలియని పరిస్థితి మధ్యాహ్నం తరువాత పూర్తిగా ఆసుపత్రికి తాళం వేసి వెళ్లిపోవడమే వారి పని, పశువుల వైద్యం నిమిత్తం ఆసుపత్రికి వస్తే వారు వెనిదిరిగి వెళ్లవలసిన పరిస్థితి రైతులకు ఎదుర్కొంటున్నారు. పశు వైద్య సిబ్బంది ఇష్టానుసారంగా ఆసుపత్రికి వచ్చి వెళ్ళు తున్నారని కొందరు డబ్బున్న వారు. డబ్బులు ఇచ్చి వారి షెడ్యూల వద్దలకు తీసుకువెళ్లి వారి పశువులకు వైద్యం అందిస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పశువైద్యశాలలో సేవలు అందించాల్సిన సిబ్బంది అందుబాటులో లేకపోవడంతో అనారోగ్యానికి గురైన పశువులు సకాలంలో చికిత్స పొందలేక మృత్యువాత పడుతున్నాయని రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. మర్పల్లి మండల కేంద్రంలోని పశువైద్యశాల ఎప్పుడు తెరిచి ఉంటుందో.. ఎప్పుడు తాళం వేసి ఉంటుందో తెలియని పరిస్థితి నెలకొందని రైతులు ఆరోపిస్తున్నారు. మండల కేంద్రంలోని పశువైద్యశాల నిత్యం తాళంతోనే దర్శనమిస్తోందని, సోమవారం మధ్యాహ్నం సుమారు 1 గంటల సమయంలోనూ ఆస్పత్రికి తాళం వేసి ఉండటంతో వైద్యం కోసం వచ్చిన రైతులు నిరాశతో వెనుదిరిగినట్లు తెలిపారు. అత్యవసర సమయంలో పశువులను ఆస్పత్రికి తీసుకొచ్చినా సిబ్బంది అందుబాటులో ఉండటం లేదని వాపోతున్నారు. మర్పల్లి పశువైద్యశాలలో సిబ్బంది విధులకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవడంతో పాటు, రైతులకు అందుబాటులో ఉండేలా వైద్య సేవలను పర్యవేక్షించాలని పశుపోషకులు కోరుతున్నారు. మూగజీవాలకు సకాలంలో నాణ్యమైన వైద్యం అందించి పశు సంపదను కాపాడాలని, నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్న సిబ్బందిపై ఉన్నతాధికారులు విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తున్నారు.




# సిద్దిక్‌నగర్‌లో అక్రమ నిర్మాణాలను తొలగించండి

- ప్రజావాణిలో సిఎంసి కమిషనర్‌కు ఫిర్యాదు



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** శేరిలింగంపల్లి నియోజకవర్గం మాదాపూర్ సర్కిల్ పరిధి అంజయ్య నగర్ లో, సిద్దిక్ నగర్ లో కొనసాగుతున్న అక్రమ నిర్మాణాలను జిహెచ్ఎంసి పట్టణ ప్రణాళిక విభాగం అధికారులు తక్షణమే తనిఖీలను నిర్వహించి వాటిపై కఠినమైన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందని సిద్ధిక్ నగర్ వాసులు డిమాండ్ చేస్తున్నారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణి కార్యక్రమాన్ని పురస్కరించుకొని సర్కిల్ కార్యాలయంలో ఫిర్యాదును అందజేశారు. ఫిర్యాదుదారుల కథనం ప్రకారం మాదాపూర్ సర్కిల్ పరిధి అంజయ్య నగర్, సిద్దిక్ నగర్ లో భారీ స్థాయిలో అక్రమ నిర్మాణాలు కొనసాగుతున్నాయని, కేవలం 50 గజాల పరిధిలో ఏడు నుంచి 8 అంతస్తుల వరకు నిర్మాణాలను చేపట్టి ఇష్టానుసారంగా భవనాలను ఏర్పాటు చేస్తుండడంతో అవి మృత్యు కుహరంగామారి మనుషుల ప్రాణాలను మింగేస్తున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ మధ్యకాలంలో అంజయ్య నగర్ లో కూలిన ఏడంతస్తుల భవనం వల్ల ఇద్దరు దుర్మరణం చెందగా మరికొన్ని కుటుంబాలు అన్ని రకాలుగా చిద్రమైపోయాయని, అలాంటి కుటుంబాలకు ఏ వ్యవస్థ తగిన న్యాయం చేయలేదని వారు ఆగ్రహం వ్యక్తం చేశారు. అయినప్పటికీ అధికారులు అంజయ్య నగర్ లో, సిద్దిక్ నగర్ లో ఆశించిన మేర చర్యలకు పూనుకోవడం లేదని, చూసి చూడనట్లు వ్యవహరిస్తుండడంతో భవిష్యత్తులో మరిన్ని అంజయ్య నగర్ ఘటనలు చోటు చేసుకునే అవకాశం స్పష్టంగా గోచరిస్తుందని వారు ఆందోళన వ్యక్తం చేశారు. సిద్దిక్ నగర్ లోని రోడ్ నెంబర్ 9 లో గల ప్లాట్ నెంబర్ 1166 లో నిర్మిస్తున్న బహులంతస్తుల అక్రమ నిర్మాణం అప్పుడే పగుళ్లతో కనిపిస్తుందని, త్వరలోనే ఇది కూలిపోయిన పెద్దగా ఆశ్చర్యం అక్కర్లేదని వారు దుయ్యబట్టారు. ఎలాంటి లోపాయికారి ఒప్పందాలకు, రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా మాదాపూర్ సర్కిల్ టౌన్ ప్లానింగ్ అధికారులు తక్షణమే సిద్ధిక్ నగర్ అక్రమ నిర్మాణాలను తొలగించాలని వారు డిమాండ్ చేశారు.

## పేదల సొంతింటి కల కాంగ్రెస్ పార్టీకే సాధ్యం

**కొడంగల్, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** కొడంగల్ నియోజకవర్గం దౌల్తాబాద్ మండలం నర్సాపూర్ గ్రామంలో ర్యాలపాటి సుగుణమ్మ కందూరు చిట్టెమ్మ ఇందిరమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ జిల్లా నాయకులు బోడి వెంకట్ రెడ్డి, మండల అధ్యక్షులు వెంకట్ రావు మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కల నెరవేరుతోందని పేర్కొన్నారు. అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందేలా కృషి చేస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కో–ఆప్షన్ సభ్యులు సయ్యద్ జాకీర్ అలీ, గ్రామ అధ్యక్షుడు కొందూరు నర్సింహులు, ఆర్.నర్సిములు, గ్రామ మాజీ సర్పంచ్ హేమలత , నర్సిములు తదితరులు పాల్గొన్నారు.



## బెజ్జంకిలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల ఏర్పాటు చేయాలి

- ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను



**బెజ్జంకి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** బెజ్జంకి మండల కేంద్రంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాలను తక్షణమే ఏర్పాటు చేయాలని ఎస్ఎఫ్ఐ సిద్దిపేట జిల్లా అధ్యక్షుడు బత్తుల అభిషేక్ భాను ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. సోమవారం బెజ్జంకిలో నిర్వహించిన ఎస్ఎఫ్ఐ మండల మహాసభలో ఆయన మాట్లాడుతూ మండలంలో ప్రభుత్వ డిగ్రీ కళాశాల లేకపోవడంతో పేద,గ్రామీణ విద్యార్థులు డిగ్రీ విద్య కోసం సిద్దిపేట,కరీంనగర్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వస్తోందని,ఆర్థిక ఇబ్బందులతో పలువురు ఉన్నత విద్యను కొనసాగించలేకపోతున్నారని తెలిపారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని డిగ్రీ కళాశాలను మంజూరు చేయడంతో పాటు ప్రభుత్వ పాఠశాలలు,హాస్టళ్లలో నాణ్యమైన భోజనం,తాగునీరు,పారిశుధ్యం,విద్యా సామగ్రి వంటి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరారు. జిల్లా సహాయ కార్యదర్శి చెప్యాల సంతోష్ పాల్గొన్నారు. మహాసభలో నూతన 18 మందితో కూడినా మండల ఎస్ఎఫ్ఐ కమిటీని ఏర్పాటు చేశారు. మండల అధ్యక్షుడిగా బి.ప్రేమ్,మండల కార్యదర్శిగా బి.ప్రజ్వేష్,ఉపాధ్యక్షులుగా ఏ.ధనలక్ష్మి,కె.అనూష,జె.భావని,ఎం.రేవతి,ఏ.కిరణ్‌తేజ,టీ.ఓంకార్ సహాయ కార్యదర్శులుగా ఎన్నికయ్యారు. నూతన కమిటీ ఆధ్వర్యంలో విద్యార్థుల సమస్యలపై నిరంతరం పోరాడి,ప్రభుత్వ విద్యాసంస్థల పరిరక్షణకు,బలోపేతానికి కృషి చేస్తామని ఎస్ఎఫ్ఐ నాయకులు తెలిపారు.

# ప్రజాస్వామ్యంపై దాడిని సహించేది లేదు

- మెదక్ బస్సు డిపో రోడ్డుపై బీఆర్ఎస్ శ్రేణుల భారీ రాస్తారోకో
- ప్రతిపక్ష గొంతు నొక్కే ప్రయత్నం మానుకోవాలి
- ప్రజల ప్రశ్నలకు సమాధానం చెప్పాలి
- బీఆర్ఎస్ ఎమ్మెల్యేల అరెస్టుపై పద్మ దేవేందర్‌రెడ్డి తీవ్ర ఆగ్రహం



**మెదక్ బ్యూరో, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** ప్రజల తరపున అసెంబ్లీలో ప్రశ్నించేందుకు వెళ్తున్న బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అడ్డుకుని అరెస్టు చేయడాన్ని నిరసిస్తూ మెదక్‌లో బీఆర్ఎస్ శ్రేణులు భగ్గుమన్నాయి. మాజీ డిప్యూటీ స్పీకర్ ఎం. పద్మ దేవేందర్‌రెడ్డి,మాజీ ఎమ్మెల్సీ శేరి. సుభాష్‌రెడ్డి, బీఆర్ఎస్ నాయకులు కంఠారెడ్డి తిరుపతిరెడ్డి,మాజీ మున్సిపల్ చైర్మన్ మల్లికార్జున్ గౌడ్, పట్టణ పార్టీ కన్వీనర్ మామిళ్ల ఆంజనేయులు, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తల కలిసి మెదక్ బస్సు డిపో రోడ్డుపై బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు బైఠాయించి భారీ రాస్తారోకో నిర్వహించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేస్తూ ప్రభుత్వ తీరుపై తీవ్ర నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా పద్మ దేవేందర్‌రెడ్డి మాట్లాడుతూ..ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని డిమాండ్ చేస్తే బీఆర్ఎస్ నాయకులను అరెస్టు చేస్తారా? అని కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. ప్రజలకు ఇచ్చిన హామీలను గుర్తు చేయడం, వాటి అమలుపై ప్రభుత్వాన్ని నిలదీయడం ప్రతిపక్షం బాధ్యత అని అన్నారు. ఆ బాధ్యతను నిర్వర్తించేందుకు అసెంబ్లీకి వెళ్తున్న ఎమ్మెల్యేలను గేటు వద్దే అడ్డుకోవడం ప్రజాస్వామ్యాన్ని అపహాస్యం చేయడమేనని మండిపడ్డారు. మాజీ మంత్రి హరీశ్‌రావు, కేటీఆర్, ఎమ్మెల్యేలు సునీత లక్ష్మారెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, జగదీశ్‌రెడ్డి తదితర బీఆర్ఎస్ ప్రజాప్రతినిధులను అసెంబ్లీ ప్రధాన గేటు వద్ద పోలీసులు అడ్డుకుని అరెస్టు చేసి తెలంగాణ భవన్‌కు తరలించడాన్ని తీవ్రంగా ఖండించారు. ప్రజా సమస్యలపై గళం వినిపించాల్సిన ప్రతిపక్ష ఎమ్మెల్యేలనే అసెంబ్లీలోకి రానివ్వకపోవడం ద్వారా ప్రభుత్వం ప్రజాస్వామ్య వ్యవస్థను అవమానిస్తోందని విమర్శించారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు తీవ్ర అభ్యంతరకరమని ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి సునీత లక్ష్మారెడ్డి పట్ల పోలీసులు దురుసుగా వ్యవహరించారని, మాజీ మంత్రి సబితా ఇంద్రారెడ్డిని కూడా అడ్డుకున్న తీరును ఆమె తీవ్రంగా తప్పుబట్టారు. మహిళా ప్రజాప్రతినిధుల పట్ల గౌరవం లేకుండా వ్యవహరించడం ప్రజాస్వామ్య విలువలకు విరుద్ధమన్నారు. ప్రతిపక్ష నాయకుల అరెస్టులతో ప్రజల గొంతును నొక్కలేరని స్పష్టం చేశారు. ప్రభుత్వం ఇచ్చిన హామీల అమలుపై ప్రజల తరపున ప్రశ్నిస్తూనే ఉంటామని, అరెస్టులు, నిర్బంధాలతో ఉద్యమాన్ని అడ్డుకోలేరని తేల్చిచెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఇకనైనా రాజకీయ కక్ష సాధింపు చర్యలను పక్కనపెట్టి ప్రజలకు ఇచ్చిన హామీల అమలుపై దృష్టి పెట్టాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీని సజావుగా నడపాల్సిన ప్రభుత్వం ప్రతిపక్షాన్ని అడ్డుకోవడం మానుకోవాలని, ప్రజా సమస్యలపై చర్చకు అవకాశం కల్పించాలని సూచించారు. రాష్ట్రంలో మళ్లీ బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. కేసీఆర్ నాయకత్వంలో బీఆర్ఎస్ మరింత బలంగా ప్రజల పక్షాన నిలబడి పోరాడుతుందని అన్నారు. ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు ప్రతి కార్యకర్త సిద్ధంగా ఉండాలని పిలుపునిచ్చారు.

# కోహెడలో యూరియా దోపిడీని అరికట్టాలి

- ఎఐవైఎఫ్ మండల కార్యదర్శి కందుకూరి మహేష్
- ఏఐఎస్ఎఫ్ మండల కార్యదర్శి రసూరి యుగేందర్

**కోహెడ, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** మండలంలో యూరియాను అధిక ధరలకు విక్రయిస్తూ రైతులను దోచుకుంటున్నారనే ఆరోపణలపై ఎఐవైఫ్ కోహెడ మండల కార్యదర్శి కందుకూరి మహేష్, ఎఐఎస్ఎఫ్ కోహెడ మండల కార్యదర్శి రాసూరి యుగేందర్ లు సోమవారం ప్రజావాణిలో ఎంపీడీవో కృష్ణయ్య కు ఫిర్యాదు చేశారు. దేశానికి వెన్నెముక రైతు అంటారు, కానీ అదే రైతు అవసరాన్ని ఆసరాగా చేసుకుని యూరియా పేరుతో రైతుల జేబులను పలువురు కొల్లగొడుతున్నారని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ వ్యవహారం వెనుక కొంతమంది యూరియా డీలర్లు, సంబంధిత వ్యవసాయ శాఖ అధికారుల మధ్య కుమ్మక్కు ఉందనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని వారు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు.మండలంలో రూ.266.50 ఎం.ఆర్.పి ఉన్న యూరియా బస్తాను 310 రూపాయలకి విక్రయిస్తున్నారనే ఫిర్యాదులు వస్తున్నాయని, ఒక్కో బస్తాపై 43.50 అదనంగా




వసూలు చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయని వారు ప్రజావాణి పిర్యాదు లో పేర్కొన్నారు. " ధర 266.50 ఉన్న బస్తాను రూ.310కి ఎలా అమ్ముతున్నారు. రైతుల నుంచి అదనంగా వసూలు చేస్తున్న 43.50 ఎవరి జేబులోకి వెళ్తోందని వారు పిర్యాదు లో ప్రశ్నించారు. ఈ వ్యవహారంపై ఫిర్యాదులు వస్తున్నప్పటికీ అధికారులు ఎందుకు కఠినంగా స్పందించడం లేదు" అని వారన్నారు. డీలర్లు అధిక ధరలకు యూరియా విక్రయిస్తున్నారనే ఆరోపణలు ఒకవైపు ఉంటే, మరోవైపు సంబంధిత వ్యవసాయ అధికారులు చూసీచూడనట్లు వ్యవహరిస్తున్నారనే ఆరోపణలు రావడం పలు అనుమానాలకు తావిస్తోంది అని అన్నారు. "డీలర్లు రైతులను దోచుకుంటుంటే అధికారులు ఎందుకు మౌనంగా ఉన్నారని వారు అన్నారు.డీలర్ల అక్రమ వసూళ్లకు అధికారుల నిర్లక్ష్యం అండగా మారిందా లేక డీలర్లు--అధికారుల మధ్య ఏదైనా కుమ్మక్కు ఉందా అని అధికారులు ప్రజలకు సమాధానం చెప్పాలి" అని వారు డిమాండ్ చేశారు. బిల్లులు ఇవ్వకుండా యూరియా విక్రయిస్తున్నారనే ఫిర్యాదులపై కూడా వెంటనే విచారణ చేపట్టాలని, మండలంలోని యూరియా విక్రయ కేంద్రాలపై ఆకస్మిక తనిఖీలు నిర్వహించి, రైతుల నుంచి నేరుగా వివరాలు సేకరించాలని కోరారు. ఈ విషయంపై ఇప్పటికే సంబంధిత వ్యవసాయ శాఖ అధికారులకు సమాచారం అందించినప్పటికీ, ఇప్పటివరకు స్పష్టమైన చర్యలు కనిపించకపోవడం పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేశారు.
"రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని యూరియా దందా నడిపితే చూస్తూ ఊరుకోమని వారు హెచ్చరించారు. డీలర్లు- అధికారుల కుమ్మక్కు ఉందనే అనుమానాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత అధికారులదేనని వారన్నారు.రైతులకు న్యాయం జరిగే వరకు మా పోరాటం కొనసాగుతుంది" అని కందుకూరి మహేష్, రాసూరి యుగేందర్‌లు హెచ్చరించారు.

## ఎర్రకుంట చెరువుకు వెంటనే నీళ్లు విడుదల చేయాలి

- కలెక్టరేట్‌లో రైతుల వినతి



**గద్వాల, ఆగస్టు 7 (జనం సాక్షి) :** గద్వాల మండలం మెల్లచెరువు గ్రామంలోని ఎర్రకుంట చెరువుకు 99 డి కాల్వ నుండి వెంటనే నీరు విడుదల చేయాలని కోరుతూ గ్రామ రైతులు భారీ సంఖ్యలో కలెక్టరేట్ కార్యాలయంలో కలెక్టర్, గద్వాల శాసనసభ్యులు, సంబంధిత అధికారులకు వినతిపత్రం సమర్పించారు. గ్రామ శివారులో 100 ఎకరాల పై చిలుకు రైతులకు ఈ చెరువుకు నీళ్లు రావడం ద్వారా భూగర్భ జలాలు పెరిగి బావులు, బోర్లలో నీళ్లు పెరుగుతాయని రైతులు తెలిపారు. ప్రస్తుతం పంట చేతికి వచ్చిందని, వర్షాలు కురవడం లేదని, ఇదే పరిస్థితి కొనసాగితే పంట నష్టపోయి పెట్టుబడులు కూడా రాక అప్పుల భారంతో రైతులు ఆత్మహత్యలకు పాల్పడే ప్రమాదం ఉందని ఆవేదన వ్యక్తం చేశారు. కనుక తక్షణమే 99 డి కాల్వ నుండి మెల్లచెరువు ఎర్రకుంట చెరువుకు నీళ్లు విడుదల చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ కె. రాములు, ఉప సర్పంచ్ దాసు, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు మెల్లచెరువు వర్షిత్, తిమ్మన్న, ఆనంద్, ఏసేపు, హరి తదితరులు పాల్గొన్నారు.

## 20 ఏళ్ల నిరీక్షణకు నేటితో తెర

- పెద్దపోర్లకు బస్సు సౌకర్యం



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** ఎన్నో ఏళ్లుగా విద్యార్థు లు, గ్రామ ప్రజలు ఎదు ర్కొంటున్న రవాణా ఇబ్బం దులను దృష్టిలో పెట్టుకొని, గ్రామ సర్పంచ్ బోయిన్ పల్లి కాశమ్మ ఆధ్వర్యంలో, పాలమూరు పార్లమెంటు సభ్యురాలు డి కే అరుణమ్మ ,రాష్ట్ర మంత్రి వాకిటి శ్రీహరి సహకారంతో పెద్దపోర్ల గ్రామానికి సోమ వారం నూతన బస్సు సౌకర్యం ప్రారంభమైంది. నూతనంగా గ్రామానికి చేరుకున్న బస్సుకు గ్రామ సర్పంచ్ బోయిన్ పల్లి కాశమ్మ పూజా కార్యక్రమం నిర్వహించి, గ్రామ ప్రజల సమక్షంలో బస్సు సౌకర్యా న్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు, విద్యార్థులు హర్షం వ్యక్తం చేస్తూ సంతోషం తెలిపారు.ఈ బస్సు సౌకర్యంతో విద్యార్థులు విద్యాసంస్థ లకు, ప్రజలు నారాయ ణపేట తదితర ప్రాంతాలకు రాకపోకలు సాగించేందుకు ఎంతో సౌలభ్యం కలగ నుంది. 20 ఏళ్లుగా ఎదు రుచూస్తున్న గ్రామ ప్రజల కల నేడు సాకారం కావడం పెద్దపోర్ల గ్రామ చరిత్రలో ఒక సువర్ణ అధ్యాయంగా నిలిచింది.బస్సు సౌకర్యం కల్పించిన ఆర్టీసీ అధికా రులకు కృతజ్ఞతలు తెలిపారు.ఈకార్యక్రమంలో నారాయణపేట డిపో మేనే జర్ రామ్మోహన్, పంచాయ తీ కార్యదర్శి రాఖీ, మాజీ సర్పంచ్ రవికుమార్, మాజీ ఎంపిటిసి పాతపల్లి శివప్ప, ఉట్కూర్ యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు కోరం మహేశ్, ఉపసర్పంచ్ కొల్లూ ర్ మాధవి నాగేష్, గ్రామ పెద్దలు సాయిలు, చిన్న వెంకటయ్య, నర్వ భీమ య్య, గాల్ల నర్సిము లు, వడ్ల సత్యప్ప, జీర్ణల్లి కృష్ణ య్య, సాలె లక్ష్మయ్య, యువ నాయకులు బోయి న్ పల్లి నరేష్, సంటి రాము, సత్యం అంజి, వెంకటేష్, సంటి రవి తదితరులు పాల్గొన్నారు.

## సైబర్ భద్రతపై అవగాహన పోస్టర్‌ను ఆవిష్కరించిన ఎస్పీ వినీత్

**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** తెలంగాణ సైబర్ సెక్యూ రిటీ బ్యూరో ఆధ్వర్యంలో వినాయక చవితి సందర్భం గా రూపొందించిన సైబర్ భద్రత అవగాహన వాల్ పోస్టర్‌ను సోమవారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో ఎస్పీ డాక్టర్ వినీత్ ఆవిష్కరిం చారు.వినాయకుడి నుంచి సైబర్ భద్రత పాఠాలు అనే సందేశంతో రూపొందించిన పోస్టర్‌లో సైబర్ మోసాల పట్ల ప్రజలు తీసుకోవాల్సిన జాగ్రత్తలను వినూత్నంగా వివరించారు. వినాయకుడి పెద్ద చెవులు ప్రతి విషయా న్ని జాగ్రత్తగా వినాలని, చిన్న కళ్లతో నిశితంగా గమ నించాలని, పెద్ద తలతో ఆలోచించి నిర్ణయం తీసుకోవాలని సూచిస్తున్న ట్లుగా పోస్టర్‌లో అవగాహన కల్పించారు. అత్యాశ, భయం, తొందరపాటు వంటి భావోద్వేగాలను సైబర్ నేరగాళ్లు తమకు అనుకూలంగా మలుచుకుం టారని, ప్రతి గణేష్ మండ పం దగ్గర ఈ అవగాహన వాల్‌పోస్టర్ ఏర్పాటు చేయా లని అందుకు మండప యజమానులు ఏర్పాటు చేసి ప్రజలకు అప్రమత్తం చేయాలని ఎస్పీ సూచించా రు.తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్‌కాల్స్, మెసేజ్‌లు, ఈ-మెయిల్స్ విషయంలో జాగ్రత్తగా ఉండాలని తెలిపారు. అనుమానాస్పద లింకు లను క్లిక్ చేయడం, గుర్తు తెలియని యాప్‌లను డౌన్‌లోడ్ చేయడం చేయవ ద్దన్నారు. బ్యాంకు ఖాతా వివరాలు, ఏటీఎం/డెబిట్ కార్డు సమాచారం, పాస్‌వ ర్డ్‌లు, ఓటీపీ, పిన్ వంటి రహస్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని స్పష్టం చేశారు.ఆన్‌లైన్ ఉద్యోగా లు, పెట్టుబడులు, రుణా లు, బహుమతులు, లాట రీల



పేరుతో వచ్చే ఆకర్షణీ యమైన ప్రకటనలను నమ్మి మోసపోవద్దని సూచించారు. సోషల్ మీడియాలో అపరిచితుల తో వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోవద్దన్నారు. ఖాతా ల భద్రత కోసం బలమైన పాస్‌వర్డ్‌లు ఏర్పాటు చేసుకుని టూ-ఫ్యాక్టర్ అథెంటికేషన్ వినియోగిం చాలని తెలిపారు. ఎవరైనా సైబర్ మోసానికి గురైతే వెంటనే ఆలస్యం చేయకుండా 1930 హెల్ప్ లైన్‌కు ఫోన్ చేయాలని ఎస్పీ సూచించారు. మోసం జరిగిన వెంటనే స్పందిస్తే డబ్బును తిరిగి పొందే అవ కాశాలు మెరుగుపడతా యని తెలిపారు. ప్రజల్లో సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించేందుకు పోలీస్ శాఖ ఆధ్వర్యంలో నిరంత రం అవగాహన కార్యక్రమా లు నిర్వహిస్తున్నామని ఎస్పీ పేర్కొన్నారు.ఈ కార్య క్రమంలో పేట ఇంచార్జి సైబర్ క్రైం డీఎస్పీ కాజల్ జస్వాల్,ఆర్ ఐ విజయ భాస్కర్, జిల్లా సైబర్ టీం పోలీసులు రమేష్, పవన్ తది తరులు పాల్గొన్నారు.

## హామీల కోసం ప్రజావాణిని ఆశ్రయించిన బీఆర్ఎస్

**బెజ్జంకి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు,420 హామీలను 100 రోజుల్లో అమలు చేస్తామని ప్రకటించిన కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తయినా హామీలను అమలు చేయడంలో విఫలమైందని బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు పాకాల మహిపాల్‌రెడ్డి విమర్శించారు. హామీలను అమలు చేయాలని కోరుతూ సోమవారం బెజ్జంకి మండల



ప్రజావాణిలో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో అధికారులకు దరఖాస్తులు అందజేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లింగాల లక్ష్మణ్,కనగండ్ల తిరుపతి,మాజీ ఎంపీటీసీ దుంబాల రాజా మహేందర్‌రెడ్డి,బెజ్జంకి ఉపసర్పంచ్ దుమాల మహేష్,సోషల్ మీడియా ఇన్‌చార్జి ఎలా శేఖర్‌బాబు,పీఏసీఎస్ మాజీ వైస్ చైర్మన్ బండి రమేష్,వార్డు సభ్యులు తిప్పారపు మహేష్,కల్లూరి రమేష్,వంగల నరేశ్,తాడిచెట్టు భూమయ్య,రామంచ పరశు రాములు,కల్లూరి అజయ్‌యాదవ్,కనగండ్ల సతీష్,ఏసీక కిషన్,కనగండ్ల శంకర్,మాశం బాబు తదితరులు పాల్గొన్నారు.

## ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ దుర్మార్గ పాలన



**సంగారెడ్డి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** బిఆర్ఎస్ ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం కాంగ్రెస్ పార్టీ దుర్మార్గ పాలన గా వివరిస్తుందని బిఆర్ఎస్ శ్రేణులు కాంగ్రెస్ పార్టీ పై తీవ్ర విమర్శించారు. సోమవారం బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో సంగారెడ్డి కొత్త బస్టాండ్ ఎదుట రోడ్డుపై బైఠాయించి బిఆర్ఎస్ శ్రేణులు సీఎం డౌన్ డౌన్ అంటూ నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. సీఎం దిష్టిబొమ్మ దహనం చేసేందుకు ప్రయత్నించిన బిఆర్ఎస్ శ్రేణులను అడ్డుకున్న పోలీసులు బిఆర్ఎస్ శ్రేణులను అరెస్టు చేసి పోలీస్ స్టేషన్కు తరలింపు ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం వైఫల్యాలను పూర్తిస్థాయిలో ఎండగాడుతుంటే ప్రజలకు ఇచ్చిన హామీల పై ప్రశ్నిస్తే ఎమ్మెల్యేలను అరెస్టు చేయడం అన్యాయమని అన్నారు. రాజకీయం ఎవరికీ శాశ్వతం కాదని గెలుపు ఓటములు సాధ్యమేనని ప్రభుత్వం అధికారంలో ఉందని సీఎం రేవంత్ రెడ్డి చేస్తున్న దుర్మార్గ పాలన అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం పోలీసులను పెట్టి బిఆర్ఎస్ నాయకులను అరెస్టులు చేయించడం సరికాదని వారన్నారు. ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని వారు డిమాండ్ చేశారు.

## రాజాపూర్‌లో సర్వేనం.7, 8, 9లో అక్రమ వెంచర్‌పై ఫిర్యాదు




**రాజాపూర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** రాజాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని సర్వే నంబర్ 7,8,9 లలో అక్రమ లేఅవుట్ ఏర్పాటు చేసి, ప్లాట్లు కొనుగోలు చేసే కొనుగోలు దారులను మోసం చేస్తున్నారని రాజాపూర్ గ్రామానికి చెందిన బుగ్గయ్య ప్రజావాణి లో పిర్యాదు చేశాడు. 7 ,8,9 సర్వే నంబర్ వ్యవసాయ భూమి లో కొందరూ రియల్ ఎస్టేట్ వ్యాపారస్తులు, నివాస స్థలాలు (ప్లాట్లు)గా చేసి ప్రజలకు విక్రయిస్తున్నారని, కానీ ఈ వ్యవసాయ భూమిని నాన్‌అగ్రికల్చర్ భూమి గా మార్పుచేయలేదని, తెలంగాణ ఐపాస్, డీటీసీపీ అనుమతులు లేకుండా, పంచాయతీ లే-అవుట్ పై రోడ్లు వేసి అమాయక ప్రజలకు ప్లాట్లు అమ్మి మోసం చేస్తున్నారని, వెంచర్ లో 10% పార్క్ స్థలం, ఆటల స్థలం కూడా లేకుండా ప్లాట్లు విక్రయించారని , దీని వలన ప్లాట్లు కొనుగోలు చేసిన వారికి రిజిస్ట్రేషన్ కు, ఇల్లు నిర్మాణానికి అనుమతులు రావడం లేదని, ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతుందని, ఈ వెంచర్ పై విచారణ జరిపించాలని బుగ్గయ్య పిర్యాదు లో పేర్కొన్నారు. ఈ పిర్యాదు ను తహసీల్దార్ రాధాకృష్ణ కు అందించారు.

# స్పీకర్‌పై అనుచిత వ్యాఖ్యలు ఖండిస్తూ దిష్టిబొమ్మల దహనం

- తాతా మధుసూదన్ క్షమాపణ చెప్పాలి
- కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్

**బెజ్జంకి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** తెలంగాణ శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ బెజ్జంకి మండల కేంద్రంలో కాంగ్రెస్ నాయకులు సోమవారం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్,బీఆర్ఎస్ ఎమ్మెల్సీ తాతా మధుసూదన్ దిష్టిబొమ్మలను దహనం చేశారు.ఈ సందర్భంగా కాంగ్రెస్ మండల అధ్యక్షుడు లింగాల శ్రీనివాస్ మాట్లాడుతూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు నల్లరంగు టీషర్టులు ధరించి,వాటిపై అభ్యంతరకర వ్యాఖ్యలు రాసుకుని అసెంబ్లీలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసులు అడ్డుకునే ప్రయత్నం చేశారని తెలిపారు.ఈ క్రమంలో కేటీఆర్,పాడి కౌశిక్‌రెడ్డి పోలీసు సిబ్బందిపై విరుచుకుపడ్డారని ఆరోపించారు.శాసనసభ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌పై తాతా మధుసూదన్ చేసిన అనుచిత వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము అనీ అన్నారు.తాతా మధుసూదన్ వెంటనే స్పీకర్‌కు క్షమాపణ చెప్పాలని,లేదంటే ఎమ్మెల్సీ పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు.ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ ఒగ్గు దామోదర్,మాజీ మండల అధ్యక్షుడు ముక్కిస రత్నాకర్‌రెడ్డి,సర్పంచుల ఫోరం అధ్యక్షుడు గూడెల్లి శ్రీకాంత్,జెట్టి రమేష్,బైరా సంతోష్,గుర్రాల బాల



నరసింహారెడ్డి,గాజ శ్రీనివాస్,తిరుపతి,గండికోట సురేష్,మాజీ సర్పంచ్ రావుల నర్సయ్య,ఉపసర్పంచ్ మచ్చ కుమార్,వార్డు సభ్యులు ఎలిగే సతీష్,బోనగం రమేష్,కుంట శ్రీనివాస్,యూత్ అధ్యక్షుడు కర్రావుల సందీప్,జెల్ల ప్రభాకర్,బోనగిరి శ్రీనివాస్,శ్రీహరి,కుసుంబ శ్రీనివాస్,సోషల్ మీడియా కన్వీనర్ కుంట హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## కంబాళాపూర్ బాయిలర్ రైస్‌మిల్ కాలుష్యంపై ఆందోళన

- సంయుక్త తనిఖీకి అశోక్ డిమాండ్



**శ్రీరంగాపూర్, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** శ్రీరంగాపూర్ మండలం కంబాళాపూర్ గ్రామ పరిధిలోని సర్వే నం. 74లోని శ్రీ లక్ష్మీ వారాహి బాయిలర్ రైస్‌మిల్ వల్ల తీవ్ర కాలుష్యం ఏర్పడుతోందని వనపర్తి జిల్లా కాంగ్రెస్ నాయకులు మేకల అశోక్ ఆందోళన వ్యక్తం చేశారు. రైస్‌మిల్ నుంచి వెలువడుతున్న వ్యర్థజలం సమీప వాగులో కలుస్తోందని, ఆ వాగుపై సుమారు 100 ఎకరాల సాగు ఆధారపడి ఉందని, కలుషిత నీటితో పంటలు దెబ్బతిని రైతులు నష్టపోతున్నారని తెలిపారు. బాయిలర్ బూడిద, పొగ, దుమ్ముతో గాలి కలుషితమై ప్రజలు శ్వాసకోశ సమస్యలు ఎదుర్కొంటున్నారని, గ్రామ బోరు నీటి నాణ్యత కూడా దెబ్బతింటోందని పేర్కొన్నారు. ఈ సమస్యపై సోమవారం తహసీల్దార్, ఎంపీడీవో, ఎంపీఓలకు వినతిపత్రాలు ఇచ్చి, మండల ప్రజావాణిలో ఫిర్యాదు చేశానని, లిగ్రీవెన్స్ ఐడీ: DWANP07092600038గా నమోదైందని తెలిపారు. ప్రజల ఆరోగ్యం, రైతుల జీవనాధారంతో ముడిపడిన అంశాన్ని సాధారణ ఫిర్యాదుగా చూడొద్దు. రెవెన్యూ, పంచాయతీ, వ్యవసాయ, వైద్య, భూగర్భజల, కాలుష్య నియంత్రణ అధికారులు సంయుక్త తనిఖీ చేసి నమూనాలు పరీక్షించాలి. నిబంధనల ఉల్లంఘన ఉంటే చర్యలు తీసుకోవాలి. లేకుంటే ప్రజలతో కలిసి ఉద్యమిస్తాం అని మేకల అశోక్ తెలియజేశారు.

# ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలికంగా అధిక ఆదాయం

- మొక్కలు, డ్రిప్ పరికరాలకు 90 శాతం వరకు సబ్సిడీ

**కొల్చారం, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** రైతులను ఆయిల్‌పామ్ సాగు వైపు ప్రోత్సహించేందుకు తెలంగాణ ప్రభుత్వం అందిస్తున్న రాయితీలు, పంట సాగు ప్రయోజనాలపై రైతులకు అవగాహన కల్పించేందుకు కొల్చారం మండలం తుక్కాపూర్ గ్రామంలో సోమవారం మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామ సర్పంచ్ దొడ్ల ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో అధికారులు, ప్రజాప్రతినిధులు, ఆయిల్‌పామ్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. జిల్లాలోని వివిధ మండలాల్లో ఈ వారంలో మెగా ఆయిల్‌పామ్ ప్లాంటేషన్ కార్యక్రమాలు నిర్వహిస్తుండగా, అందులో భాగంగా కొల్చారం మండలంలో ఇప్పటివరకు 31 ఎకరాల విస్తీర్ణంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటినట్లు అధికారులు తెలిపారు. ఆయిల్‌పామ్ సాగుపై రైతులు ఆసక్తి చూపుతూ మెగా ప్లాంటేషన్ కార్యక్రమాల్లో ఉత్సాహంగా పాల్గొంటున్నారు. ఈ సందర్భంగా డీహెచ్‌ఎస్‌ఓ ప్రతాప్‌సింగ్ మాట్లాడుతూ ఆయిల్‌పామ్ సాగు విధానం, పంట ద్వారా లభించే ప్రయోజనాలు, ప్రభుత్వం అందిస్తున్న సబ్సిడీలు,



డ్రిప్ పరికరాలపై రాయితీలను రైతులకు వివరించారు. మొక్కలు, డ్రిప్ పరికరాలకు ప్రభుత్వం 90 శాతం వరకు రాయితీలు అందిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటే రైతులకు మొదటి సంవత్సరంలో రూ.11,001 రాయితీ, అనంతరం నిర్వహణకు ప్రతి సంవత్సరం రూ.4,200 చొప్పున, మొత్తంగా రూ.16,800 వరకు రాయితీ రైతుల ఖాతాల్లో జమ చేస్తామని వివరించారు. అలాగే ఒక్కో రైతుకు గరిష్టంగా 12.50 ఎకరాల వరకు డ్రిప్ పరికరాలపై సబ్సిడీ కల్పిస్తున్నట్లు తెలిపారు. ఆయిల్‌పామ్ మొక్కలు నాటిన నాలుగు సంవత్సరాల అనంతరం ఎకరానికి 10 నుంచి 12 టన్నుల వరకు దిగుబడి పొందే అవకాశం ఉందన్నారు. ప్రస్తుతం ఒక టన్ను ఆయిల్‌పామ్ గెల ధర సుమారు రూ.24,025 ఉండటంతో ఎకరానికి సంవత్సరానికి సుమారు రూ.2.05 లక్షల వరకు ఆదాయం పొందే అవకాశం ఉందని, ఇతర ఖర్చులు పోను సుమారు రూ.1.50 లక్షల వరకు నికర ఆదాయం లభించే అవకాశం ఉందని అధికారులు వివరించారు. కార్యక్రమంలో భాగంగా రైతు అడకులపల్లి దుర్గారాణి పొలంలో ఆయిల్‌పామ్ మొక్కలు నాటారు. ఆమె ఆయిల్‌పామ్ సాగుపై ఆసక్తి వ్యక్తం చేశారు. ఆయిల్‌పామ్ సాగుతో దీర్ఘకాలికంగా మంచి ఆదాయం పొందే అవకాశం ఉన్నందున ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను రైతులు సద్వినియోగం చేసుకుని సాగు చేపట్టాలని అధికారులు సూచించారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ శ్రీనివాస్ చారి, మండల వ్యవసాయ అధికారి శ్వేత కుమారి, మేనేజర్ కృష్ణారావు, మాజీ సర్పంచ్ శ్రీశైలం, ఉపసర్పంచ్ అరె రవీందర్, గ్రామ కార్యదర్శి ప్రశాంత్, అసిస్టెంట్ మేనేజర్ సూర్య, ఫీల్డ్ ఆఫీసర్లు మణిప్రకాష్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# కరెంట్ కోతలతో రోడ్డెక్కిన రైతాంగం

- కళ్లముందే ఎండిపోతున్న పంటలు
- సబ్‌స్టేషన్‌ను ముట్టడించిన రైతులు



**కుబీర్, సెప్టెంబర్ 7, (జనంసాక్షి):** ఆకాశం వైపు చూస్తే వర్షం లేదు.. భూమి వైపు చూస్తే బోర్లలో నీళ్లున్నా పోసేందుకు కరెంట్ లేదు.. చేతికొచ్చిన పంట కళ్లముందే ఎండిపోతుంటే తట్టుకోలేక నిర్మల్ జిల్లా కుబీర్ మండల రైతాంగం రోడ్డెక్కింది. ముందస్తు సమాచారం లేకుండా విధిస్తున్న అప్రకటిత విద్యుత్ కోతలను నిరసిస్తూ సోమవారం మండల కేంద్రంలోని సబ్‌స్టేషన్‌ను రైతులు ముట్టడించారు. అనంతరం భైంసా-కుబీర్ ప్రధాన రహదారిపై బైఠాయించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా రైతులు మాట్లాడుతూ.. ప్రభుత్వం వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇస్తున్నామని ఆర్భాటంగా ప్రకటనలు గుప్పిస్తోందే తప్ప, క్షేత్రస్థాయిలో పరిస్థితి దారుణంగా ఉందని మండిపడ్డారు. అసలు కరెంట్ ఎప్పుడు వస్తుందో, ఎప్పుడు పోతుందో తెలియక రాత్రింబవళ్లు బావుల వద్ద కాపలా కాయాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. కరెంట్ కోతలపై కనీస సమాచారం కూడా ఇవ్వకుండా అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. వేలాది రూపాయలు పెట్టుబడి పెట్టి సాగు చేసిన పంటలు కళ్లముందే ఎండిపోతుంటే కన్నీళ్లు పెట్టుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని ఆవేదన వ్యక్తం చేశారు. రైతుల నిరసనతో విద్యుత్ శాఖ ఏఈ ఆదిత్య, ఏడీఈ చాట్ల మోహన్‌కుమార్ రైతులతో చర్చలు జరిపారు. వ్యవసాయానికి రోజుకు 15 గంటల పాటు నిరంతరాయంగా విద్యుత్ సరఫరా ఇస్తామని స్పష్టమైన హామీ ఇచ్చే వరకు కదిలేదే లేదని రైతులు భీష్మించుకు కూర్చున్నారు. పరిస్థితి తీవ్రతను గమనించిన అధికారులు ఉన్నతాధికారులతో ఫోన్‌లో మాట్లాడి, తక్షణమే విద్యుత్ సమస్యను పరిష్కరిస్తామని, పంటలు ఎండిపోకుండా నిరంతర సరఫరాకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. అధికారుల హామీతో రైతులు తమ ఆందోళనను శాంతింపజేశారు. ఎస్ఐ కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో పోలీసులు ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా బందోబస్తు నిర్వహించి, ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

# సింగిల్ లైన్ అడ్మినిస్ట్రేషన్‌లో ఏజెన్సీ ఏరియా పరిపాలన జరగాలి

- షెడ్యూల్ ప్రాంత 29 శాఖల జీవోలను చట్టం చేయాలి
- ఎస్టీ జాబితా నుండి లంబాడీలను తొలగించాలి
- ఆదివాసీలపై అటవీ శాఖ దాడులు నియంత్రించాలి
- 5వ షెడ్యూల్ ప్రాంతంలో కంపెనీల పేరిట విధ్వంసం ఆపాలి
- సింగరేణిలో ఆదివాసీలకు ఉద్యోగ అవకాశాలు కల్పించాలి
- ఇసుక మాఫియా విష కోరల్లో గోదావరి నది భూగర్భ జలాల విధ్వంసం నియంత్రించాలి
- 1/70 చట్టాన్ని అమలు చేయాలి
- ఆదివాసీ హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షుడు మై పతి అరుణ్ కుమార్




**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 07 (జనంసాక్షి) :** ఆదివాసీల హక్కులు, భూములు, విద్య, ఉద్యోగాలు, రాజ్యాంగ రక్షణలను కాపాడాలని డిమాండ్ చేస్తూ ఆదివాసీ హక్కుల పోరాట సమితి (తుడుం దెబ్బ) ఆధ్వర్యంలో సోమవారం ఏటూర్ నాగారం మండల కేంద్రం లోని బస్టాండు నుండి ఐటిడిఏ వరకు ప్లే కార్డ్స్ చేద్దామని ర్యాలీ నిర్వహించారు. అనంతరం ప్రధాన రహదారిపై బైఠాయించి ధర్నా నిర్వహించారు. ప్రభుత్వానికి 17 అంశాలతో కూడిన వినతిపత్రాన్ని ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారికి, రాష్ట్ర అధ్యక్షుడు డా మైపతి అరుణ్ కుమార్ ఆధ్వర్యంలో పలు డిమాండ్లను ముందుకు తీసుకువచ్చి వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా రాష్ట్ర అధ్యక్షుడు అరుణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలోని 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల రాజ్యాంగ హక్కులను పటిష్టంగా అమలు చేయాలని, భూహక్కుల పరిరక్షణకు చర్యలు తీసుకోవాలని సమితి కోరింది. ఆర్టికల్ 244(1), ఆర్టికల్ 342, ఆర్టికల్ 19(వ), ఐటిడిఏ బైలాస్, పీసా చట్టం, సంబంధిత ప్రభుత్వ ఉత్తర్వులు అమలు చేయాలని డిమాండ్ చేసింది. ఆదివాసీ ప్రాంతాల్లో ఉన్నత విద్యకు మరిన్ని అవకాశాలు కల్పించాలని, స్థానిక యువతకు విద్య, ఉద్యోగాల్లో తగిన ప్రాధాన్యత ఇవ్వాలని సమితి కోరింది. వైద్య, ఇంజినీరింగ్, న్యాయ, బీఈడీ, పీజీ తదితర ఉన్నత విద్యా కోర్సులకు ఆదివాసీ విద్యార్థులకు మెరుగైన అవకాశాలు కల్పించాలని విజ్ఞప్తి చేసింది. ఆదివాసీల భూములను అన్యాక్రాంతం కాకుండా కాపాడాలని, చట్టవిరుద్ధంగా జరిగిన భూకబ్జాలు, బదలాయింపులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. 5వ షెడ్యూల్ ప్రాంతాల్లో ఆదివాసీల భూముల పరిరక్షణకు ప్రత్యేక యంత్రాంగాన్ని బలోపేతం చేయాలని కోరారు. అలాగే గిరిజన ప్రాంతాల్లో గ్రామసభల అధికారాలను గౌరవించి, పీసా చట్టాన్ని సమర్థవంతంగా అమలు చేయాలని పేర్కొన్నారు. ఆదివాసీ ప్రాంతాల్లో ఏర్పడుతున్న ప్రభుత్వ ఉద్యోగాలు, ప్రాజెక్టులు, ఇతర ఉపాధి అవకాశాల్లో స్థానిక ఆదివాసీ యువతకు ప్రాధాన్యత కల్పించాలని సమితి డిమాండ్ చేసింది. గిరిజన ప్రాంతాల్లో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను భర్తీ చేసి నిరుద్యోగ సమస్యను పరిష్కరించాలని కోరింది. 17 డిమాండ్లపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించాలని, ఆదివాసీల హక్కులకు సంబంధించిన చట్టాలు, ప్రభుత్వ ఉత్తర్వులను క్షేత్రస్థాయిలో అమలు చేయడంతో పాటు విద్య, ఉద్యోగాలు, భూమి, ఉపాధి, స్థానిక పరిపాలన తదితర అంశాల్లో న్యాయం చేయాలని తుడుం దెబ్బ నాయకులు ప్రభుత్వాన్ని కోరారు. ఆదివాసీల సమస్యల పరిష్కారానికి ప్రభుత్వం వెంటనే చర్యలు చేపట్టి, తమ 17 డిమాండ్లను అమలు చేయాలని వారు విజ్ఞప్తి చేశారు. పలువురు ఆదివాసీ నాయకులు, ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు కొప్పుల రవి, జాతీయ అధ్యక్షులు కొట్నాక విజయ్, ప్రధాన కార్యదర్శి ఈసం సుధాకర్, జాతీయ ఉపాధ్యక్షులు పోదేశీ బాబు, జాతీయ ప్రధాన కార్యదర్శి సిద్దబోయిన లక్ష్మీనారాయణ, రాష్ట్ర ఉపాధ్యక్షులు పులుష బాలకృష్ణ, పడిగ నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి కోరగట్ల లక్ష్మణరావు, రాష్ట్ర ప్రచార కార్యదర్శి రేఖ గణేష్, ములుగు జిల్లా అధ్యక్షులు నల్లబోయిన లక్ష్మణరావు, ప్రధాన కార్యదర్శి కోరినబెల్లి గణేష్, రాష్ట్ర కార్యదర్శి సిద్దబోయిన కార్తీక్, ఉపాధ్యక్షులు కబ్బాక లక్ష్మణ్, జిల్లా అధ్యక్షులు దబ్బకట్ల శ్రీకాంత్, ఆదివాసి మహిళా సంఘం అధ్యక్షురాలు వట్టం సుభద్ర, జిల్లా ప్రధాన కార్యదర్శి పాయం కోటేశ్వరరావు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పూనం చంటి, డివిజన్ అధ్యక్షులు పోవడం శోభన్, మహబూబాద్ జిల్లా అధ్యక్షులు కుంజ నరసింహారావు, రాష్ట్ర కార్యదర్శి కుడిమేత సమ్మయ్య, భూపాలపల్లి అధ్యక్షులు గొరిగ కిరణ్, భూపాలపల్లి ప్రధాన కార్యదర్శి మట్టి కృష్ణ, భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు ధారబోయిన రమేష్, స్థానిక నాయకులు వంక నరేష్ తదితరులు పాల్గొన్నారు.

## జనంసాక్షి కథనానికి స్పందించి..
# మరమ్మతులు చేపించి..


కూలిన గోడలు.. అస్తవ్యస్తంగా డ్రైనేజీ!
జనంసాక్షి 05 Sep 2026 - Page 5



**దస్తురాబాద్, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** మండల కేంద్రంలో ఇటీవల జనంసాక్షి పత్రికలో వచ్చిన కథనానికి స్పందించిన అధికారులు కూలిన గోడల శిథిలాలు డ్రైనేజీ నుండి తీపించి మరమ్మతులు చేపించారు. వివరాల్లోకి వెళితే ఇటీవల మండల కేంద్రంలోని ఓ ఇంటి వద్ద ఇంటి గోడ కూలి డ్రైనేజీ, రోడ్డు పైన పడడం వల్ల అటుగా రోడ్డు పైన వచ్చే వారికి ఇబ్బంది కలిగింది, విషయాన్నీ జనంసాక్షి పత్రికలో రాసిన కథనానికి అధికారులు వెంటనే స్పందించి మరమ్మతులు చేపించి మట్టిని, బండలను తీపించడం చేశారు. డ్రైనేజీ శుభ్రం చేపించి ప్రజలకు ఇబ్బంది కలగకుండా చేశారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజలు జనంసాక్షి పత్రికను మెచ్చుకుని, ప్రజలకు ఉపయోగే పడే వార్తలను రాయాలని కోరారు.

# డ్రోన్‌తో నానో ఎరువుల పిచికారీ

- కొండైల్‌పల్లిలో క్షేత్ర ప్రదర్శన.. రైతులకు అవగాహన



**నల్లబెల్లి, సెప్టెంబరు 7 (జనంసాక్షి):** వరిలో డ్రోన్ సాంకేతికతతో నానో ఎరువుల పిచికారీపై రైతులకు అవగాహన కల్పించే దుకు నల్లబెల్లి మండలం కొండైల్‌పల్లి గ్రామంలో సోమవారం క్షేత్ర ప్రదర్శన నిర్వహించారు. వ్యవసాయ శాఖ, ఆత్మ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో డ్రోన్ ద్వారా నానో యూరియా, నానో డీఏపీ పిచికారీ చేసే విధానాన్ని రైతులకు ప్రత్యక్షంగా వివరించారు. ఈ సందర్భంగా వ్యవసాయ అధికారి బన్న రజిత మాట్లా డుతూ.. డ్రోన్ సాంకేతికతతో తక్కువ సమయంలో ఎక్కువ విస్తీర్ణంలో పిచికారీ చేయడంతోపాటు కూలీల కొరతను అధిగ మించవచ్చన్నారు. నానో ఎరువులను సిఫార్సు చేసిన మోతాదులో, పంట దశకు అనుగుణంగా వినియోగించాలని సూచిం చారు. తక్కువ మోతాదులో సమర్థ వంతమైన పోషకాలు పంటకు అందడంతో ఎరువుల వినియోగ సామర్థ్యం పెరుగుతుందని తెలిపారు. డ్రోన్ విధానంతో పిచికారీ పనుల్లో సమయం, శ్రమ ఆదా అవుతాయని పేర్కొన్నారు. రైతులు ఆధునిక సాంకేతికతను వినియోగించుకుని అధిక దిగుబడులు సాధించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఈఓ రంజిత్‌కుమార్, ఆత్మ ఏటీఎం జ్యోతి, రైతులు మెడిద చంద్రారెడ్డి, నరేష్, వీరారెడ్డి, కుమార్ తదితరులు పాల్గొన్నారు.



## కాంగ్రెస్‌లో చేరిన మాజీ ఎంపీపీ

**గుడిహత్నూర్ సెప్టెంబర్ 7( జనం సాక్షి) :** గుడిహత్నూర్ మండలంలో బీఆర్ఎస్ పార్టీకి మరో ఎదురుదెబ్బ తగిలింది. మండల మాజీ ఎంపీపీ కేంద్రే జ్ఞానోబా కాంగ్రెస్ పార్టీలో చేరారు. సోమవారం హైదరాబాద్‌లో ఆదిలాబాద్ జిల్లా ఇంచార్జ్ మంత్రి జూపల్లి కృష్ణారావు సమక్షంలో, డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ ఆధ్వర్యంలో ఆయన కాంగ్రెస్ కండువా కప్పుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ నాయకులు కేంద్రే జ్ఞానోబాకు ఘన స్వాగతం పలికారు. ఆయన చేరికతో గుడిహత్నూర్ మండలంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం కానుందని నాయకులు పేర్కొన్నారు. డీసీసీ అధ్యక్షుడు డా. నరేష్ జాదవ్ మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజా సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యతనిస్తూ ముందుకు సాగుతోందన్నారు. ప్రభుత్వ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలకు ఆకర్షితులై వివిధ పార్టీలకు చెందిన నాయకులు, కార్యకర్తలు కాంగ్రెస్‌లో చేరుతున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో బోథ్ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు ప్రఫుల్ రెడ్డి, గుడిహత్నూర్ మాజీ మండల అధ్యక్షుడు అంకత్ రవి, ఇచ్చోడ మాజీ అధ్యక్షుడు కుంట ప్రవీణ్ రెడ్డి, నేరడిగొండ మాజీ అధ్యక్షుడు చంద్రశేఖర్, రాజు గౌడ్ పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తుల పరిష్కారంపై
# ప్రత్యేక దృష్టి పెట్టాలి

- పెండింగ్ దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి పరిష్కరించాలి
- దరఖాస్తులను స్వీకరించిన జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి, అదనపు కలెక్టర్ రవి



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** ప్రజావాణి కార్యక్రమంలో ప్రజల నుంచి స్వీకరించిన గ్రీవెన్స్ దరఖాస్తుల పరిష్కారంపై అన్ని శాఖల అధికారులు ప్రత్యేక దృష్టి సారించాలని హనుమకొండ జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్‌పాయి ఆదేశించారు.సోమవారం హనుమకొండ జిల్లా కలెక్టరేట్‌లోని కాన్ఫరెన్స్ హాలులో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల సమస్యలపై ఫిర్యాదులను కలెక్టర్, అదనపు కలెక్టర్ ఎన్. రవి స్వయంగా స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ చాహత్ బాజ్ పాయి మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న ప్రజావాణి దరఖాస్తులను శాఖల వారీగా పరిశీలించి, సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు. దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిబంధనల మేరకు పరిష్కరించాలని సూచించారు. ప్రజలు తమ సమస్యల పరిష్కారం కోసం ప్రజావాణి కార్యక్రమంలో సమర్పించిన దరఖాస్తులు పెండింగ్‌లో ఉండకుండా నిర్ణీత గడువులోగా పరిష్కరించాలని పేర్కొన్నారుప్రజావాణి కార్యక్రమంలో ప్రజలు వివిధ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ జిల్లాస్థాయిలో 123, డివిజన్ 23, మండల ఆఫీసర్స్ స్థాయిలో 123దరఖాస్తులను అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా ఇన్చార్జి అడిషనల్ కలెక్టర్ శేషాద్రి, డిఆర్ఓ శ్రీనివాస్, డి ఆర్ డి ఓ మేన శ్రీను, సిపిఓ సత్యనారాయణరెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రజాపాలన కాదిది ప్రజా వంచన పాలన

- ఆరు గ్యారంటీలకు మంగళం.. రైతులకు పంగనామం
- జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి



**చెన్నారావుపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** ప్రజాపాలన కాదిది ప్రజా వంచన పాలన అని ఆరు గ్యారంటీలకు మంగళం పాడి రైతులకు పంగనామం పెట్టారని కాంగ్రెస్ ప్రభుత్వం పై జనగామ మాజీ ఎమ్మెల్యే ముత్తిరెడ్డి యాదగిరి రెడ్డి ధ్వజమెత్తారు. సోమవారం చెన్నారావుపేట మండల కేంద్రంలో కాంగ్రెస్ వెయ్యి రోజుల వైఫల్య పాలన పై నిరసిస్తూ బిఆర్ఎస్ నాయకులతో కలిసి చెన్నారావుపేట-నెక్కొండ ప్రధాన రహదారిపై ధర్నా, రాస్తారోకో నిర్వహించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి వెళ్లి మండల ప్రజా పరిషత్ కార్యాలయం ముందు నిరసనను వ్యక్తం చేశారు. తదనంతరం ప్రజావాణి కార్యక్రమంలో ఎంపీడీవో వెంకట సాయి శివా నంద్ కు ఆర్జీలను అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చి 1000 రోజులు పూర్తవుతున్నా ఎన్నికల సమయంలో ప్రజలకు ఇచ్చిన హామీలను తుంగలో తొక్కిందన్నారు. అలాగే నర్సంపేట నియోజకవర్గంలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను స్థానిక ఎమ్మెల్యే దొంతి మాధవరెడ్డి పట్టించుకోవడం లేదని విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని రానున్న రోజుల్లో ప్రజలే తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ మండల అధ్యక్షులు బాల్నె వెంకన్న, మండల ఎన్నికల కన్వీనర్ జక్క అశోక్, మండల వర్కింగ్ ప్రెసిడెంట్లు అమ్మ రాజేష్, కొండవీటి ప్రదీప్ కుమార్, చెన్నారావుపేట, అమీనాబాద్ సొసైటీ మాజీ చైర్మన్ లు చింతకింది వంశీ, మురహరి రవి, ఉపాధ్యక్షులు కుసుమ నరేందర్, ములుక సాంబయ్య కవి, యూత్ మండల అధ్యక్షులు మంచోజు మనోజ్ కుమార్, చెరుకుపల్లి విజేందర్ రెడ్డి, మాదారపు శ్రీనివాస్, అంగోతు వీరాసింగ్, గుర్రం రవి, కదారి సాయిలు, తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యం

- ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్



**జయశంకర్ భూపాలపల్లి బ్యూరో, (జనంసాక్షి):** ప్రజల సమస్యలకు తక్షణ పరిష్కారమే లక్ష్యమని జిల్లా ఎస్పీ సిరిశెట్టి సంకీర్త్ అన్నారు. జిల్లా పోలీస్ ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజాదివాస్ కార్యక్రమంలో ఆయన ప్రజల నుండి నేరుగా ఫిర్యాదులు స్వీకరించి, వాటి పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. జిల్లా వ్యాప్తంగా వచ్చిన మొత్తం 18 ఫిర్యాదులు స్వీకరించారు. ప్రతి ఫిర్యాదును ఎస్పీ శ్రద్ధగా విని, సంబంధిత పోలీస్ స్టేషన్ సీఐలు, ఎస్ఐలతో నేరుగా మాట్లాడి సమస్యల పరిష్కారానికి అవసరమైన సూచనలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ప్రజలు ఎలాంటి పైరవీలు లేదా మూడో వ్యక్తి ప్రమేయం లేకుండా నిర్భయంగా పోలీస్ సేవలను వినియోగించుకోవాలని సూచించారు. చట్టబద్ధమైన విధానంలో ప్రతి ఒక్కరికీ న్యాయం జరిగేలా పోలీస్ శాఖ కట్టుబడి ఉందని, ప్రజలకు మరింత చేరువగా ఉండి శాంతి భద్రతలను పరిరక్షించడం పోలీసుల ప్రధాన బాధ్యత అని తెలిపారు. అధికారుల సమన్వయంతో త్వరితగతిన పరిష్కరిస్తున్నామని, ప్రజలకు సత్వర, పారదర్శకమైన సేవలు అందించేందుకు భూపాలపల్లి జిల్లా పోలీస్ శాఖ ఎల్లప్పుడూ కృషి చేస్తుందని ఎస్పీ తెలిపారు.

# ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్‌లో దారుణమైన పరిస్థితులు

- ఐటిడిఏ ఎదుట ఆదివాసీ విద్యార్థుల ధర్నా
- మద్దతు తెలిపిన ఆదివాసీ సంఘం నాయకులు



**ఏటూరునాగారం, సెప్టెంబర్ 07 (జనంసాక్షి) :** మండల కేంద్రంలోని ట్రైబల్ వెల్ఫేర్ బాలికల హాస్టల్ లో దారుణమైన పరిస్థితి నీటి సౌకర్యం లేక విద్యార్థుల అవస్థలు బాత్రూంలో మరుగుదొడ్లు అధ్వానంగా ఉన్నాయని ప్రశ్నిస్తే విద్యార్థులపై వార్డెన్ బూతులు తిడుతూ వేధిస్తున్నారని విద్యార్థులు రోడ్డెక్కారు. విద్యార్థులు కంటతడి పెట్టి మీడియా ముందు బోరున విలపించారు. విద్యార్థినిలు మీడియాతో మాట్లాడకుండా గదిలో బంధించి మీడియాను అడ్డుకున్న టీచర్లు, నీటి సౌకర్యం లేక 3వ అంతస్తు వరకు బకెట్లలో నీరు మోసుకు వెళు న్నామని ప్రశ్నిస్తే తమపై దాడి చేస్తుందని వాపోయారు. వాజేడు బాలికల ఆశ్రమ పాఠశాలలో సరైన సౌకర్యాలు లేక ఏటూరునాగారం హాస్టల్ కు తరలించారు. ఇక్కడ కూడా 250 మంది విద్యార్థులకు 5వ తరగతి నుండి 12వ తరగతి వరకు విద్యార్థులు ఉన్న ఇట్టి భవనంలో సరైన మూత్ర శాలలు, మరియు మరుగుదొడ్లు లేకపోవడంతో విద్యార్థులు అనేక ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తుంది. అధ్వానమైన పరిస్థితులు నెలకొనడంతో విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేశారు. పోలీసులు సంఘం నాయకుల హామీతో విద్యార్థులు ఆందోళన విరమించి తిరిగి హాస్టల్ కి వెళ్ళారు. విద్యార్థులకు వెంటనే సరైన మౌలిక సదుపాయాలు కల్పించాలని ఆదివాసీ సంఘం నాయకులు డిమాండ్ చేశారు.

## ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును
# బాధ్యతగా పరిష్కరించాలి

- జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు



**ములుగు ప్రతినిధి, సెప్టెంబర్ 07(జనంసాక్షి) :** ప్రజావాణిలో అందిన ప్రతి దరఖాస్తును అధికారులు బాధ్యతతో పరిశీలించి సత్వరమే పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయం లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ ప్రజల నుంచి నేరుగా దరఖాస్తులను స్వీకరించారు. అర్జీదారుల సమస్యలను అడిగి తెలుసుకొని, వాటి పరిష్కారానికి చర్యలు చేపట్టాలని సంబంధిత శాఖల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ప్రజావాణి కార్యక్రమంలో భూ సమస్యలు 9, ఇందిరమ్మ ఇండ్లు 1, పింఛన్లు 1, ఉద్యోగాలు 15, ఇతర శాఖలకు సంబంధించినవి 10 కలిపి మొత్తం 36 దరఖాస్తులు అందాయి. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ బోర్ఖడే హేమంత్ సహదేవరావు మాట్లాడుతూ, ప్రజావాణి దరఖాస్తులను క్షుణ్ణంగా పరిశీలించి నిర్ణీత గడువులో పరిష్కరించాలని సూచించారు. పరిష్కారానికి అవకాశం ఉన్న సమస్యలపై జాప్యం చేయకుండా చర్యలు తీసుకోవాలని, దరఖాస్తుల పరిష్కార స్థితిని ఎప్పటికప్పుడు అర్జీదారులకు తెలియజేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ స్థానిక సంస్థలు సంపత్ రావు, ఆర్డీఓ కృష్ణవేణి, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

# విశేష కృషి చేసిన ఎంఈఓలకు ప్రశంసా పత్రాలు



**హనుమకొండ ప్రతినిధి సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** హనుమకొండ జిల్లాలో రోడ్డు భద్రత కార్యక్రమాలను పాఠశాల స్థాయిలో సమర్థవంతంగా అమలు చేయడంలో విశేష కృషి చేసిన మండల విద్యాధికారులకు ప్రశంసా పత్రాలను జిల్లా రవాణాశాఖ మరియు విద్యాశాఖ అధికారులు సంయుక్తంగా జిల్లా రవాణా కార్యాలయంలో అందజేసి అభినందించారు.ఈ సందర్భంగా ఉప రవాణా కమిషనర్ అఫ్రిన్ సిద్ధిఖీ, మాట్లాడుతూ, విద్యార్థుల్లో చిన్ననాటి నుంచే రోడ్డు భద్రతపై అవగాహన కల్పించడం ద్వారా రోడ్డు ప్రమాదాలను గణనీయంగా తగ్గించవచ్చని తెలిపారు. పాఠశాలల్లో రోడ్డు భద్రతా క్లబ్‌ల నిర్వహణ, ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమాలు, హెల్మెట్ మరియు సీట్‌బెల్ట్ వినియోగంపై విద్యార్థులు, తల్లిదండ్రులకు అవగాహన కల్పించడంలో ఎంఈఓలు చూపిన చొరవ అభినందనీయమని పేర్కొన్నారు.ఉప రవాణా కమిషనర్ సురేష్ రెడ్డి మాట్లాడుతూ రోడ్డు భద్రత ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యత అని అన్నారు. విద్యార్థులను బాధ్యతాయుత పౌరులుగా తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులు మరియు మండల విద్యాధికారుల పాత్ర ఎంతో కీలకమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమం లో.వి. గిరిరాజ్ గౌడ్, జిల్లా విద్యాధికారి, హనుమకొండ, జనార్ధన్ రెడ్డి, జిల్లా రవాణా అధికారి, హనుమకొండ, ఎంవీఐలు, ఏఎంవీఐలు, హనుమకొండ జిల్లా పరిధిలోని అన్ని మండల విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు.

## నిమజ్జనాలకు సర్వం సిద్ధం చేయాలి



**బోడుప్పల్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** బోడుప్పల్‌లోని రా చెరువు ముందు ఏర్పాటు చేస్తున్న బేబీపాండ్ వద్ద బతుకమ్మ,గణేష్ నిమజ్జనాల కోసం చేపడుతున్న ఏర్పాట్లు, అభివృద్ధి పనులను మాజీ మేయర్ తోటకూర అజయ్ యాదవ్ పరిశీలించారు.పండుగల సందర్భంగా భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా అన్ని ఏర్పాట్లు పూర్తి చేయాలని అధికారులకు సూచించారు.పర్యావరణహితంగా నిమజ్జనాలను నిర్వహించేందుకు మల్కాజ్‌గిరి మున్సిపల్ కార్పొరేషన్ నగరవ్యాప్తంగా కృత్రిమ బేబీపాండ్లు,పోర్టబుల్ వాటర్ ట్యాంకులను ఏర్పాటు చేస్తోంది.ఈ నేపథ్యంలో రా చెరువు వద్ద నిర్మిస్తున్న బేబీపాండ్ పనుల పురోగతిని అజయ్ యాదవ్ పరిశీలించి,పారిశుధ్యం,విద్యుత్ వెలుగులు,భద్రతా చర్యలు,తాగునీటి సౌకర్యాలు తదితర అంశాలపై అధికారులతో చర్చించారు.గణేష్ నిమజ్జనాల కోసం బేబీపాండ్లు,భద్రత,పారిశుద్ధ్య ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్లు ఇటీవల సమీక్షల్లో వెల్లడైంది.పనులను త్వరితగతిన పూర్తి చేసి బతుకమ్మ,గణేష్ నిమజ్జనాలు ప్రశాంతంగా,సురక్షితంగా జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు.ఈ కార్యక్రమంలో డివిజన్ అధ్యక్షుడు బొమ్మక కళ్యాణ్, కాంగ్రెస్ నాయకుడు పులకండ్ల జంగారెడ్డి, ఏఈ తదితరులు పాల్గొన్నారు.

# ఉద్యోగాల పేరుతో రూ.8 కోట్ల మోసం

- **నిందితుడి అరెస్ట్, రిమాండ్**

**భద్రాచలం, సెప్టెంబరు 7 (జనంసాక్షి) :** ఉద్యోగాలు ఇప్పిస్తామని నిరుద్యోగులను నమ్మించి సుమారు రూ.8 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసి మోసానికి పాల్పడిన రెవెన్యూ శాఖ సీనియర్ అసిస్టెంట్ కోర్ల కళ్యాణ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు భద్రాచలం డి.ఎస్.పి అరుణ్ కుమార్ పేర్కొన్నారు. నిందితుడిని ఆదివారం సాయంత్రం భద్రాచలంలో అదుపులోకి తీసుకున్న పోలీసులు విచారించిన అనంతరం సోమవారం మేజిస్ట్రేట్ ఎదుట హాజరుపరిచారు. మేజిస్ట్రేట్ ఆదేశాల మేరకు రిమాండ్‌కు తరలించారు.

**పోలీసుల వివరాల ప్రకారం..**

మణుగూరు మండలం సమితి సింగారం గ్రామానికి చెందిన కోర్ల కళ్యాణ్ గత కొంతకాలంగా భద్రాచలం, మణుగూరు, పాల్వంచ, ఇల్లందు, చర్ల, దుమ్ముగూడెం, వాజేడు, బూర్గంపహాడ్ తదితర ప్రాంతాల్లోని నిరుద్యోగులను లక్ష్యంగా చేసుకున్నాడు. మణుగూరులోని బీటీపీఎస్, సారపాకలోని ఐటీసీ సంస్థల్లో ఉద్యోగాలు ఇప్పిస్తానంటూ 54 మందిని నమ్మించి వారి నుంచి సుమారు రూ.8 కోట్ల వరకు డబ్బులు వసూలు చేసినట్లు పోలీసులు తెలిపారు. అయితే ఎవరికీ ఉద్యోగాలు ఇప్పించకుండా



మోసం చేసినట్లు పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై భద్రాచలానికి చెందిన రాయల శ్రీను ఫిర్యాదు చేయడంతో భద్రాచలం టౌన్ పోలీస్ స్టేషన్‌లో పది రోజుల క్రితం కేసు నమోదు చేశారు. అప్పటి నుంచి నిందితుడి కోసం పోలీసులు గాలిస్తుండగా ఆదివారం అతడిని అదుపులోకి తీసుకున్నారు.

విచారణలో కోర్ల కళ్యాణ్ కొంతకాలంగా ఆన్‌లైన్ క్రికెట్ బెట్టింగ్‌కు అలవాటుపడి భారీగా డబ్బులు పోగొట్టుకున్నట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు. బెట్టింగ్‌లో నష్టపోయిన డబ్బును భర్తీ చేసుకునేందుకు తెలిసిన వ్యక్తులను ఉద్యోగాల పేరుతో నమ్మించి డబ్బులు వసూలు చేసి, ఆ మొత్తాన్ని ఆన్‌లైన్ బెట్టింగ్‌లో కోల్పోయినట్లు నిందితుడు అంగీకరించినట్లు పేర్కొన్నారు. నిందితుడిపై వివిధ ప్రాంతాల్లోనూ కేసులు నమోదై ఉండగా, అవన్నీ విచారణలో ఉన్నాయని పోలీసులు తెలిపారు. ఈ సందర్భంగా భద్రాచలం డీఎస్పీ ఎం. అరుణ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగాలు ఇప్పిస్తామంటూ నిరుద్యోగుల నుంచి డబ్బులు వసూలు చేసే వ్యక్తుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఇలాంటి మోసాలకు సంబంధించిన సమాచారం తెలిస్తే వెంటనే పోలీసులకు తెలియజేయాలని కోరారు. అలాగే ఆన్‌లైన్ బెట్టింగ్‌లు, బెట్టింగ్ యాప్‌లు, అక్రమ ఆన్‌లైన్ గేమింగ్ ప్లాట్‌ఫారమ్‌లకు దూరంగా ఉండాలని హెచ్చరించారు. తక్కువ సమయంలో ఎక్కువ డబ్బు సంపాదించవచ్చనే ఆశతో బెట్టింగ్‌లకు ఆకర్షితులై కష్టార్జితాన్ని కోల్పోవద్దని, నష్టపోయిన మొత్తాన్ని తిరిగి సంపాదించాలనే ఉద్దేశంతో మరింత డబ్బు పెట్టి ఆర్థికంగా నష్టపోయే ప్రమాదం ఉందన్నారు. గుర్తుతెలియని వ్యక్తులు పంపే లింకులు, యాప్‌లు, సోషల్ మీడియా ప్రకటనలను నమ్మవద్దని, అనుమానాస్పద లింకులు లేదా యాప్‌ల ద్వారా డబ్బులు డిపాజిట్ చేయమని ఎవరైనా కోరితే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు.ఈ కేసు దర్యాప్తులో సీఐ నాగరాజు, ఎస్ ఐ సతీష్ తోపాటు భద్రాచలం టౌన్ పోలీసులు పాల్గొన్నారు.

# ఈవీఎంల గోడౌన్‌ను తనిఖీ చేసిన జిల్లా కలెక్టర్ అంకిత్

- ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతపై ప్రత్యేక దృష్టి
- గోడౌన్ భవనం, భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన కలెక్టర్
- సీసీ కెమెరాలు, ఫైర్ ఎక్స్‌టింగ్విషర్ల పనితీరుపై ఆరా
- గోడౌన్ భద్రత విషయంలో అప్రమత్తంగా ఉండాలి
- జిల్లా కలెక్టర్ అంకిత్



**కొత్తగూడెం క్రైమ్, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** ఎన్నికల నిర్వహణలో అత్యంత కీలకమైన ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాలు (ఈవీఎంలు), వీవీప్యాట్ల భద్రత విషయంలో అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని జిల్లా కలెక్టర్ అంకిత్ సూచించారు. త్రైమాసిక తనిఖీలలో భాగంగా సోమవారం కొత్తగూడెం ఆర్డీఓ కార్యాలయం సమీపంలోని ఈవీఎం గోడౌన్‌ను జిల్లా కలెక్టర్ సోమవారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ముందుగా గోడౌన్‌కు ఉన్న సీల్‌ను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం రాజకీయ పార్టీల ప్రతినిధులు, సంబంధిత ఎన్నికల అధికారుల సమక్షంలో గోడౌన్‌ను తెరిపించి లోపలికి వెళ్లి ఈవీఎంలు, వీవీప్యాట్లు భద్రపరిచిన గదులను క్షుణ్ణంగా పరిశీలించారు. యంత్రాల భద్రత, గోడౌన్‌లో చేపడుతున్న భద్రతా ఏర్పాట్లను పరిశీలించిన అనంతరం గోడౌన్‌ను తిరిగి సీల్ చేయించారు. గోడౌన్ భవనాన్ని కూడా జిల్లా కలెక్టర్ క్షుణ్ణంగా పరిశీలించారు. భవనంలో ఎక్కడైనా లీకేజీలు ఉన్నాయా, భవనం పరిస్థితి సక్రమంగా ఉందా అనే అంశాలను పరిశీలించారు. అలాగే అగ్నిప్రమాదాల నివారణ కోసం ఏర్పాటు చేసిన ఫైర్ ఎక్స్‌టింగ్విషర్లు అందుబాటులో ఉన్నాయా, అవి సక్రమంగా పనిచేస్తున్నాయా అనే విషయాలను పరిశీలించారు. అత్యవసర పరిస్థితుల్లో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అవసరమైన ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. అనంతరం గోడౌన్‌లో ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల నియంత్రణ గదిని జిల్లా కలెక్టర్ పరిశీలించారు. సీసీ కెమెరాలు నిరంతరం పనిచేస్తున్నాయా, గోడౌన్ పరిసర ప్రాంతాల్లో పూర్తి స్థాయిలో నిఘా కొనసాగుతున్నదా అనే విషయాలను పరిశీలించారు. గోడౌన్ భద్రత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యానికి తావులేకుండా నిరంతరం అప్రమత్తంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. అనుమతి లేకుండా ఎవరూ గోడౌన్‌లోకి ప్రవేశించకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, గోడౌన్ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని కలెక్టర్ సూచించారు. ఈవీఎంలు, వీవీప్యాట్ల భద్రతకు సంబంధించి నిర్దేశిత నిబంధనలను తప్పనిసరిగా పాటించాలని, భద్రతా సిబ్బంది నిరంతరం అప్రమత్తంగా విధులు నిర్వహించాలని తెలిపారు. గోడౌన్ తనిఖీకి సంబంధించిన వివరాలను జిల్లా కలెక్టర్ తనిఖీ రిజిస్టర్‌లో నమోదు చేసి సంతకం చేశారు. ఈ తనిఖీ లో కొత్తగూడెం ఆర్డీవో మధు,ఎన్నికల సూపరింటెండెంట్ రంగ ప్రసాద్, కాంగ్రెస్ పార్టీ ప్రతినిధి లక్ష్మణ్ అగర్వాల్, ఆమ్ ఆద్మీ పార్టీ రాంబాబు, బి ఆర్ ఎస్ పార్టీ అనుదీప్, సి పి ఎం పార్టీ సలీం వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు, ఎన్నికల సిబ్బంది నవీన్, భద్రతా సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## ఫీజు బకాయిల విడుదలకు బీజేపీ పోరుబాట



**తెలకపల్లి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** విద్యార్థుల పెండింగ్ ఫీజు బకాయిలను వెంటనే విడుదల చేసి వారికి న్యాయం చేయాలని డిమాండ్ చేస్తూ బీజేపీ రాష్ట్ర శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన అసెంబ్లీ ముట్టడి కార్యక్రమం నేపథ్యంలో సోమవారం తెలకపల్లి మండల బీజేపీ నాయకులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమంలో పాల్గొనేందుకు నాయకులు సిద్ధమవుతున్న నేపథ్యంలో పోలీసులు వారిని అదుపులోకి తీసుకున్నారు. మండల అధ్యక్షుడు చిన్నారెడ్డి, మాజీ అధ్యక్షులు నరేందర్ చారి, సీనియర్ నాయకులు బాబు సాగర్, మండల ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాస్, మండల ప్రధాన కార్యదర్శి వెంకటేష్, నాయకులు రాజు, రాము, భాను, భాస్కర్ గౌడ్ తదితరులను పోలీసులు ముందస్తుగా అరెస్టు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ మండల ఉపాధ్యక్షుడు ఈర్లపల్లి శ్రీనివాస్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను తక్షణమే విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఫీజు బకాయిలు పేరుకుపోవడంతో పేద, మధ్యతరగతి కుటుంబాలకు చెందిన విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. విద్యార్థుల చదువులకు ఆటంకం కలగకుండా ప్రభుత్వం ఫీజు బకాయిలను వెంటనే చెల్లించాలని కోరారు. విద్యార్థుల సమస్యల పరిష్కారం కోసం బీజేపీ నిరంతరం ప్రజా పోరాటాలు కొనసాగిస్తుందని స్పష్టం చేశారు. అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా బీజేపీ నాయకులను ముందస్తుగా అరెస్టు చేయడం ప్రజాస్వామ్య హక్కులను హరించడమేనని ఆయన అన్నారు. విద్యార్థులకు న్యాయం జరిగే వరకు బీజేపీ ఆధ్వర్యంలో పోరాటం కొనసాగుతుందని ఈర్లపల్లి శ్రీనివాస్ తెలిపారు.

## రైతు కుటుంబానికి స్థిరమైన ఆదాయం కల్పించేలా ప్రణాళికలు రూపొందించాలి

- జిల్లా కలెక్టర్ ప్రియాంక



**నారాయణపేట జిల్లా బ్యూరో, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** గ్రామీణ ప్రాంతాల్లో ప్రతి రైతు కుటుంబానికి ప్రత్య క్షంగా ప్రయోజనం చేకూరేలా, స్థిరమైన ఆదాయ వన రులను కల్పించే విధంగా సమగ్ర ప్రణాళికలను రూపొందించాలని జిల్లా కలెక్టర్ ప్రియాంక అధికారు లను ఆదేశించారు.సోమ వారం జిల్లా కలెక్టరేట్ లోని వీసీ హాల్ లో కరువు నివా రణ పై జిల్లా కలెక్టర్ ప్రియాంక అధ్యక్షతన సమావేశం నిర్వహించారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల సంయుక్త ఆధ్వర్యంలో డ్రాట్ మిటిగేషన్ కార్యక్ర మంలో భాగంగా నారాయ ణపేట జిల్లా లోని ఉట్కూర్ మండలాన్ని ఎంపిక చేయ గా దానిని అమలు చేసే బాధ్యతను వాసన్ సంస్థ చేపట్టగా సోమవారం కలె క్టర్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో వాసన్ సంస్థ ప్రతినిధులు డీపీఆర్‌ను పవర్ పాయింట్ ప్రజంటే షన్ ద్వారా జిల్లా కలెక్టర్ కు వివరించారు.అనంతరం జిల్లా కలెక్టర్ ప్రియాంక మాట్లాడుతూ గ్రామీణ కుటుంబాల అవసరాలు, స్థానిక వనరులు, రైతుల సామర్థ్యాలను పరిగణన లోకి తీసుకుని ఒకే సమగ్ర ప్రణాళిక కింద వివిధ కార్య క్రమాలను అనుసంధానం చేయాలని సూచించారు. ముఖ్యంగా పౌల్ట్రీ, లైవ్‌స్టాక్ రంగాల్లో ఉన్న అవకాశాలను గుర్తించి, రైతులకు అవసరమైన ఇన్ పుట్స్, సాంకేతిక సహా యం,శిక్షణ, వెటర్నరీ సేవలు, మార్కెట్ లింకేజీ అందేలా సమగ్ర వ్యవస్థను రూపొందించాలని ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా వ్యవసాయ శాఖ అధికారి/ కార్యక్రమ నోడల్ అధికారి సక్రియా నాయక్, ఉద్యాన శాఖ అధికారి సాయిబాబా, జిల్లా మత్స్య శాఖ అధికారి రెహమాన్, వాసన్ సంస్థ ప్రతినిధులు అనిల్ ఉప్పల పాటి, బక్కా రెడ్డి, లక్ష్మణ్, మండల వ్యవ సాయ శాఖ అధికారి, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## సమస్యల పరిష్కారానికే ప్రజావాణి

- జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్



**రాజన్న సిరిసిల్ల బ్యూరో, సెప్టెంబర్ 7 (జనం సాక్షి) :** సమస్యల పరిష్కారానికే ప్రజావాణి కార్యక్రమం నిర్వహిస్తున్నామని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ తెలిపారు.సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ఆడిటోరియంలో సోమవారం నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ పాల్గొని ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.అధికారులు ప్రజావాణి దరఖాస్తులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు.కాగా ఐడీఓసీలో ప్రజావాణికి మొత్తం 190 దరఖాస్తులు వచ్చాయి.వాటిని సంబంధిత శాఖల అధికారులకు అందజేసి.. పరిష్కరించాలని ఆదేశించారు.సిరిసిల్ల ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 06 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి,పరిష్కరించాలని ఆదేశించారు.అలాగే వేములవాడ ఆర్డీఓ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో 04 దరఖాస్తులు రాగా, ఆయా శాఖల అధికారులకు అందజేసి పరిష్కరించాలని ఆదేశించారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాలకు అనుగుణంగా జిల్లాలోని అన్ని మండలాల్లోని ఎంపీడీఓ కార్యాలయాల్లో సోమవారం ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 01 గంట వరకు ప్రజావాణి ఎంపీడీఓలు నిర్వహించి, ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరించారు.మండలాల వారీగా దరఖాస్తులు వివరాలు,బోయినపల్లి ఎంపీడీఓ కార్యాలయానికి 24,చందుర్తి మండలం 02, ఇల్లంతకుంట మండలం 09,గంభీరావుపేట మండలం 08, కోనరావుపేట మండలం 05,ముస్తాబాద్ 12,రుద్రంగి మండలం 0,తంగళ్లపల్లి మండలం 32,వీర్నపల్లి మండలం 09,వేములవాడ అర్బన్ మండలం 02, వేములవాడ రూరల్ మండలం 11,ఎల్లారెడ్డిపేట ఎంపీడీఓ కార్యాలయానికి 12 చొప్పున వచ్చాయి.

**ప్రజావాణి కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలి**

జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంతోపాటు సిరిసిల్ల, వేములవాడ ఆర్డీవో కార్యాలయాలు, అన్ని ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజావాణిని ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ గరిమ అగ్రవాల్ పిలుపునిచ్చారు.రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ఆయా రెవెన్యూ డివిజన్ల కార్యాలయాలు,ఎంపీడీఓ కార్యాలయాల్లో ప్రజావాణి కొనసాగుతుందని,స్థానిక ప్రజలు తమ అర్జీలు అందించాలని జిల్లా కలెక్టర్ సూచించారు.అన్ని చోట్ల అప్లికేషన్లు ఆన్లైన్ చేస్తారని పేర్కొన్నారు.ఐడీఓసీ ప్రజావాణిలో అదనపు కలెక్టర్ గడ్డం నగేష్, జడ్పీ సీఈవో వెంకట మాధవరావు, ప్రొబేషనరీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత తదితరులు పాల్గొన్నారు.

## ప్రజావాణి దరఖాస్తులను సత్వరమే పరిష్కరించాలి



**సూర్యాపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** ప్రజల సమస్యల పరిష్కారమే వేదికగా సాగుతున్న ప్రజావాణి కార్యక్రమానికి అత్యంత ప్రాధాన్యత ఇవ్వాలని జిల్లా కలెక్టర్ తేజస్ నంద్ లాల్ పవార్ అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్ లో నిర్వహించిన ప్రజావాణి అనంతరం జిల్లా అధికారులతో నిర్వహించిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రతి సోమవారం జరిగే ప్రజావాణికి జిల్లా స్థాయి అధికారులు తప్పనిసరిగా హాజరు కావాలని అన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లా, మండల స్థాయి ప్రజావాణి దరఖాస్తులను తప్పనిసరిగా ఆన్‌లైన్ పోర్టల్‌లో నమోదు చేయాలని స్పష్టం చేశారు.ప్రజావాణి పోర్టల్‌లో ఇంకా పరిష్కారం కాకుండా ఉన్న దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని ఆదేశించారు.కొత్తగా అందుతున్న దరఖాస్తులను ఎప్పటికప్పుడు పోర్టల్‌లో నమోదు చేయాలని సూచించారు. మండల స్థాయి సమస్యలు స్థానికంగానే పరిష్కారమైతే ప్రజలకు ఇబ్బందులు తప్పుతాయని ఆయన పేర్కొన్నారు.భూ సమస్యలకు సంబందించి 35 దరఖాస్తులు, హౌజింగ్ 12, డిపిఓ 3 , డిఎంహెచ్‌ఓకు 3, మిగిలిన 13 దరఖాస్తులు వివిధ శాఖలకి చెందినవని, మొత్తం 66 దరఖాస్తులు వచ్చాయని తెలిపారు.వాటిని పరిష్కరించేందుకు శాఖల వారీగా పంపించటం జరిగిందని అన్నారు.ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ బి.హరిసింగ్, డిఆర్‌ఓ ప్రేమ్ రాజ్, జిల్లా పరిషత్ సీఈఓ శిరీష, డిఆర్డిఓ పిడి సన్యాసయ్య, డిఎంహెచ్వో వెంకటరమణ, డిపిఓ శ్రీధర్ రెడ్డి, డిఎస్‌ఓ మోహన్ బాబు, డిడబ్ల్యూఓ నరసింహారావు, మున్సిపల్ కమిషనర్ హనుమంత్ రెడ్డి, జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జిని నిర్మించండి

**శివ్వంపేట, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ వల్ల ఎన్నో ఏండ్లుగా నర్సాపూర్ – గజ్వేల్ నియోజకవర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని బ్రాహ్మణపల్లి రైల్వే గేట్ వద్ద ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణాన్ని చేపట్టాలని మెదక్ ఎంపీ రఘునందన్ రావు విజ్ఞప్తి మేరకు భారతీయ జనతా పార్టీ మెదక్ జిల్లా అధ్యక్షులు వాల్దాస్ రాధా మల్లేష్ గౌడ్ ఆధ్వర్యంలో బీజేపీ ముఖ్య నాయకులు సోమవారం దక్షిణ మధ్య రైల్వే, రైల్ నిలయం సికింద్రాబాద్ లో రైల్వే జనరల్ మేనేజర్ కే. కిరణ్ కుమార్ ను నేరుగా కలిసి సమస్యను వివరించి మెదక్ పార్లమెంట్ సభ్యులు మాధవనేని రఘునందన్ రావు ఇచ్చిన రిక్వెస్ట్ లెటర్ ను ఆయనకు అందజేయడం జరిగింది. అనంతరం రైల్వే జనరల్ మేనేజర్ మాట్లాడుతూ త్వరలోనే ఆ ప్రదేశాన్ని పరిశీలించి, బ్రిడ్జి నిర్మాణాన్ని ప్రారంభిస్తామని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో భారతీయ జనతాపార్టీ జిల్లా కార్యదర్శి సాధుల్లా అశోక్, ఎరుకల భిక్షపతి, అల్లీపూర్ సర్పంచ్ చింతకాయల కుమార్, మండల ఉపాధ్యక్షులు అయ్యగారి షాదుల్లా తదితరులు ఉన్నారు.



# తాళం వేసిన ఇళ్లే లక్ష్యంగా చోరీలు

- **అంతర్‌జిల్లా దొంగ అరెస్ట్**

**గంగాధర, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** జల్సాలు వ్యసనాలకు బానిసై తాళం వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకుని చోరీలకు పాల్పడుతున్న అంతర్ జిల్లా దొంగను గంగాధర పోలీసులు సోమవారం అరెస్ట్ చేశారు.అతని వద్ద నుంచి చోరీ చేసిన బంగారు ఆభరణాలతో పాటు నేరానికి ఉపయోగించిన ద్విచక్ర వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. గంగాధర ఎస్సై బి.వంశీకృష్ణ తెలిపిన వివరాల ప్రకారం ములుగు జిల్లా గోవిందరావుపేట మండలం చల్వాయి గ్రామానికి చెందిన కొండ శశికాంత్ (24) ప్రస్తుతం కరీంనగర్‌లోని కమాన్ సమీపంలో నివాసముంటున్నాడు.గతంలో చిట్‌ఫండ్ ఏజెంట్‌గా, అనంతరం రేకుర్తిలోని హీరో షోరూంలో సేల్స్‌మ్యాన్‌గా పనిచేశాడు. మద్యపానం, గంజాయి వంటి దురలవాట్లకు బానిసై అప్పులు తీర్చుకునేందుకు తన స్నేహితులైన సిహెచ్. సంతోష్ (గోవిందరావుపేట), గనవెల్లి వంశీ (కిసాన్‌నగర్, కరీంనగర్)తో కలిసి ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడినట్లు తెలిపారు. నిందితుల చోరీల వివరాలు ఆగస్టు 28: ముగ్గురూ కలిసి టూ 37 1211 నంబర్ గల స్కూటీపై గంగాధరకు చేరుకుని, ఓ ఇంట్లోని పై పోర్షన్ లో తాళం వేసిన ఫ్లాట్ డోర్‌ను పగులగొట్టి లోపలికి ప్రవేశించారు. అక్కడి నుంచి బంగారు కమ్మలు, మెట్టెలు, పట్టీలు తదితర ఆభరణాలను అపహరించారు. మరియు మరో రెండు చోరీలు కురికియాల , మధురానగర్ గ్రామాల లో ఇంట్లో కి చొరబడి దొంగతనశీ , చేసినట్టుగా తెలిపారు.

**ఆభరణాల స్వాధీనం**

సోమవారం 07-09-2026 నాడు నిందితుడు కొండ శశికాంత్ చోరీ చేసిన బంగారు ఆభరణాలను తాకట్టు పెట్టేందుకు తన ద్విచక్ర వాహనంపై మధురానగర్ పరిసరాల్లో తిరుగుతుండగా పోలీసులు అనుమానంతో అదుపులోకి తీసుకున్నారు. విచారణలో గతంలో చేసిన చోరీలకు సంబంధించి నేరాలను అంగీకరించాడు.

నిందితుడి వద్ద నుంచి చోరీ చేసిన 2 బంగారు చెవుల మాటీలు సుమారు 5 గ్రాములు,2 బంగారు చెవుల కమ్మలు సుమారు 4 గ్రాములు,సుమారు6 తులాల 2 వెండి పట్టీలు నేరానికి ఉపయోగించిన టూ 37 1211 అను నెంబర్ గల స్కూటీని



పోలీసులు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశారు. పరారీలో ఉన్న మరో ఇద్దరు నిందితులు సిహెచ్. సంతోష్, గనవెల్లి వంశీ కోసం గాలింపు చర్యలు కొనసాగుతున్నాయని ఎస్సై బి. వంశీకృష్ణ తెలిపారు.

**ప్రజలకు ఎస్ఐ సూచనలు చేస్తూ..**

ఇళ్లకు తాళం వేసి బయట ప్రాంతాలకు వెళ్లే సమయంలో స్థానిక పోలీసులకు లేదా స్థానిక నిఘా వ్యవస్థకు సమాచారం అందించాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు, వాహనాలు కనిపించినప్పుడు వెంటనే పోలీసులకు సమాచారం అందించి నేరాల నియంత్రణకు సహకరించాలని ఆయన కోరారు.




మారుతీ సుజుకీ షాక్..

# మళ్లీ ధరల పెంపు



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**ప్రముఖ కార్ల తయారీ సంస్థ మారుతీ సుజుకీ తన వినియోగదారులకు మళ్లీ ధరల షాక్ ఇచ్చింది ఎంపిక చేసిన కొన్ని మోడళ్లపై రూ.20 వేల వరకు ధరలను పెంచుతున్నట్లు కంపెనీ ప్రకటించింది. సవరించిన ధరలు సెప్టెంబర్ నుంచే అమల్లోకి వస్తాయని కంపెనీ తన రెగ్యులేటరీ ఫైలింగ్‌లో వెల్లడించింది. ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ముడిసరుకుల ధరలు పెరగడమే ఇందుకు ప్రధాన కారణమని తెలిపింది. కాగా.. ఈ ఏడాది మే నెల నుంచి మారుతీ సుజుకీ కార్ల ధరలు పెరగడం ఇది మూడోసారి కావడం గమనార్హం."గత కొన్ని నెలలుగా వ్యయాన్ని నియంత్రించి ధరలను అందుబాటులోనే ఉంచేందుకు ప్రయత్నించాం. కానీ ద్రవ్యోల్బణ ఒత్తిళ్లు, ప్రతికూల ఆర్థిక పరిస్థితుల వల్ల అనివార్యంగా ధరలు పెంచాల్సి వస్తోంది. ఎంపిక చేసిన మోడళ్ల ధరలను రూ.20 వేల వరకు పెంచాం" అని కంపెనీ వెల్లడించింది. వినియోగదారులపై ఈ భారం సాధ్యమైనంత తక్కువగా ఉండేలా చూసుకుంటామని తెలిపింది. మారుతీ సుజుకీ ప్రస్తుతం ఎస్-ప్రెస్సో వంటి ఎంట్రీలెవల్ మోడళ్ల నుంచి ప్రీమియం యుటిలిటీ వెహికల్ అయిన ఇన్విక్టో వరకు పలు మోడళ్లను విక్రయిస్తోంది.


## బొగ్గు వాణిజ్య ఉత్పత్తి డిసెంబరులోపే

**ఎన్‌ఎండీసీ ఛైర్మన్ అమితవ ముఖర్జీ**

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**బొగ్గు తవ్వకంలోకి కొత్తగా ప్రవేశించిన ప్రభుత్వరంగ గనుల సంస్థ ఎన్‌ఎండీసీ, ఈ ఏడాది అక్టోబరు-డిసెంబరులోనే వాణిజ్య ఉత్పత్తి చేయగలమనే విశ్వాసంతో ఉంది. 2027 మార్చిలోపే 10 లక్షల టన్నుల బొగ్గును విద్యుదుత్పత్తి కోసం విక్రయించగలమని ఎన్‌ఎండీసీ ఛైర్మన్ అమితవ ముఖర్జీ చెప్పారు. ఉక్కు మంత్రిత్వ శాఖ పరిధిలోని ఈ సంస్థ, దేశీయ ఇనుప ఖనిజం అవసరాల్లో 20 శాతాన్ని తీరుస్తున్న సంగతి విదితమే. 'ప్రస్తుతం మా కార్యకలాపాల్లో ఇనుప ఖనిజం తవ్వకం వాటాయే 99.9%. 2047కు వికసిత్ భారత్ లక్ష్యంగా సాగుతున్న ప్రభుత్వానికి సహకరించేందుకు, 2030కి భిన్న ఖనిజాల తవ్వకంలోకి ప్రవేశించే ప్రణాళికతో ముందుకెళ్తున్నాం.

# ఐటీ స్టాక్స్‌లో ఒత్తిడి..

## 23,800 దిగువకు నిఫ్టీ




**న్యూఢిల్లీ(జనంసాక్షి):**దేశీయ స్టాక్ మార్కెట్ సూచీలు సోమవారం భారీ నష్టా ల్లో ముగిశాయి అంతర్జాతీయ ప్రతికూల పరిస్థితులు, చమురు ధరలు పెరగడం మార్కెట్‌పై ప్రభావం చూపింది. అమెరికా వడ్డీ రేట్లను పెంచుతుందనే భయాలతో ఇన్వెస్టర్లు అప్రమత్తంగా వ్యవహరించారు. ఐటీ, మెటల్, పీఎస్‌యూ బ్యాంకు షేర్లలో అమ్మకాల ఒత్తిడి ఎదురైంది. ఇన్ఫోసిస్ షేర్లు 3 శాతానికి పైగా కుంగాయి. టాటా స్టీల్, టెక్ మహీంద్రా షేర్లు 2 శాతం మేర పడ్డాయి. దీంతో సూచీలకు నష్టాలు తప్పలేదు. సెన్సెక్స్ ఉదయం 76,446.05 పాయింట్ల వద్ద (క్రితం ముగింపు 76,515.43) నష్టాల్లో ప్రారంభమైన సూచీ.. రోజంతా నష్టాల్లోనే కదలాడింది. ఇంట్రాడేలో 75,970.52 వద్ద కనిష్ఠానికి పడిపోయి.. చివరికి 382.62 పాయింట్లు పతనమై 76,132.81 వద్ద ముగిసింది. నిఫ్టీ 118.55 పాయింట్లు కోల్పోయి 23,779.15 వద్ద స్థిరపడింది. డాలరుతో పోలిస్తే రూపాయి మారకం విలువ 94.48గా ఉంది. సెన్సెక్స్ 30 సూచీలో ఇన్ఫోసిస్, టెక్‌మహీంద్రా, టాటాస్టీల్, బజాజ్‌ఫిన్‌సర్వ్, అల్ట్రా సిమెంట్, టీసీఎస్ షేర్లు ప్రధానంగా నష్టపోయాయి. ఎల్‌అండ్‌టీ, భారతీ ఎయిర్‌టెల్, మారుతీ, పవర్‌గ్రిడ్, ఐసీఐసీఐ, ఇండిగో షేర్లు లాభపడ్డాయి. అంతర్జాతీయ విపణిలో బ్రెంట్ క్రూడ్ ధర 96.64 డాలర్ల వద్ద ట్రేడవుతోంది. బంగారం ఔన్స్ ధర 4,402.79 వద్ద కొనసాగుతోంది.

# ఐ ఫోన్ రూటు.. అంతా సపరేటు..

**విలన్లకు నో ఐఫోన్..**
**యాడ్‌లో ఎప్పుడూ 9.41**
**యాపిల్ విశేషాలు..**

యాపిల్ క్రేజే వేరు. ఇక ఐఫోన్ల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు కొత్త వెర్షన్ మార్కెట్‌లోకి వస్తోందంటే ఉండే హడావుడి అంతా ఇంతా కాదు. లాంచ్ రోజున క్యూ లైన్లలో నిలబడి మరీ వాటిని కొనేస్తారు. ఈ వారం ఐఫోన్ 18 సిరీస్ రాబోతుంది. ఈ వెర్షన్‌పై ఇప్పటికే టెక్‌ప్రియుల్లో ఆసక్తి నెలకొంది. మరి ఇంత క్రేజ్ ఉన్న యాపిల్ గురించి కొన్ని ఆసక్తికర విషయాలు చూద్దామా..!యాపిల్ అనగానే మనకు గుర్తొచ్చేది సగం కొరికిన యాపిల్ పండే. కానీ, ఈ సంస్థ మొదటి లోగో ఇది కాదు. యాపిల్ చెట్టు కింద కూర్చున్న ఐజాక్ న్యూటన్ బొమ్మను లోగోగా రానాల్డ్ వేన్ డిజైన్ చేశారు. ఆ తర్వాత దాన్ని మార్చారు. ప్రస్తుతం ఉన్న లోగోను రాబ్ జానోఫ్ రూపొందించారు. దూరం నుంచి చూసినా, పరిమాణం తగ్గించినా చెర్రీ పండులా కనిపించకుండా.. స్పష్టంగా యాపిల్ అని గుర్తు పట్టడానికి వీలుగా ఒక వైపు కొరికినట్లు పెట్టారు.ఐఫోన్‌లో 'ఐ' అనేది కేవలం ఒక అక్షరం మాత్రమే కాదు.. ఐదు వేర్వేరు అంశాలకు ప్రతీక. ఎనిబివతీనివబి, ఎనిటతిలతిటబీజీశ్రీ, ఎనిబబితీబీఇఃబి, ఎనిటనీతీఎ, ఎనిబజూతితీవ అని కంపెనీ సహ వ్యవస్థాపకుడు స్టీవ్ జాబ్స్ 1998లో వివరించారు.

మూడో వ్యక్తీ ఉన్నారు..

స్టీవ్ జాబ్స్, స్టీవ్ వోజ్నియాక్‌లతో పాటు రానాల్డ్ వేన్ కలిసి యాపిల్ సంస్థను స్థాపించారు. అయితే, కంపెనీ ప్రారంభించిన 12 రోజులకే ఆయన తన 10 శాతం వాటాను 800 డాలర్లకు అమ్మేసి బయటకు వెళ్లిపోయారు.

ఎక్స్ ఖాతాకో ప్రత్యేకం..

తన ఉత్పత్తులు, ఈవెంట్లను ఈ కంపెనీ తన ఎక్స్ ఖాతాలో ప్రచారం చేస్తుంది. కానీ ఆ పోస్టులు యాపిల్ ప్రొఫైల్‌లో కనిపించవు. వాటిని డార్క్ ట్వీట్ల రూపంలో పోస్ట్ చేస్తుంది. టైమ్‌లైన్‌లో ప్రకటనలుగా మాత్రమే కనిపిస్తాయే తప్ప యాపిల్ ప్రొఫైల్‌లో ఉండవు. కస్టమర్ సేవల కోసం ఏంజూజూశ్రీమాబీజూజూనీతీబి ఖాతాను నడుపుతోంది.

యాడ్‌లలో 9:41 ఎందుకంటే?

కంపెనీ విడుదల చేసే ఐఫోన్, ఐప్యాడ్, మ్యాక్‌బుక్‌లలో సమయం ఎప్పుడూ ఉదయం 9:41 గంటలనే సూచిస్తుంటుంది. 2007లో జరిగిన మొదటి ఐఫోన్ లాంచ్ ఈవెంట్ ఉదయం 9 గంటలకు ప్రారంభమైంది. దానికి సంబంధించిన విషయాలను చర్చించడానికి 42 నిమిషాలు పడుతుందని భావించారు. ఐఫోన్‌ను రివీల్ చేసే సమయానికి వినియోగదారుల గడియారాల్లో ఉన్న సమయమే ఫోన్‌లోనూ చూపించాలని ప్లాన్ చేశారు. అందుకే మొదట ఫోన్ స్క్రీన్‌పై సమయం ఉదయం 9:42 గంటలుగా సెట్ చేశారు. అయితే, దీనికి ఒక నిమిషం ముందే ఐఫోన్‌ను ఆవిష్కరించడంతో స్క్రీన్‌పై ఆ సమయాన్ని 9:41కి మార్చారు. అప్పటి నుంచి ప్రతి మోడల్‌కు సంబంధించిన యాడ్‌లో ఇదే టైం కన్పిస్తోంది. కాగా.. యాపిల్ వాచ్‌కు మాత్రం దీని నుంచి మినహాయింపు ఉంది.

కొనేసి..

ాతితీతిని ఆన్ చేసినప్పుడు కింద కనిపించేవి రంగుల బబుల్ గ్రాఫిక్స్ మాత్రమే కాదు.. మీరు మాట్లాడేటప్పుడు మీ వాయిస్ ఫ్రీక్వెన్సీ, పిచ్ ఆధారంగా ఆ రంగుల తరంగాలు కదులుతాయి. ఇక, ాతితీతి అనే వాయిస్ అసిస్టెంట్‌ను యాపిల్ సొంతంగా తయారుచేసింది కాదు. 2010లో ఒక స్వతంత్ర యాప్‌గా ఉన్న సిరిని ఈ సంస్థ కొనుగోలు చేసింది. ఐఫోన్ 4ఎ నుంచి తమ ఫోన్లలో అంతర్భాగంగా మార్చింది.

విలన్లకు ఐఫోన్లు ఉండవు

## హెచ్‌డీఎఫ్‌సీ రుణగ్రహీతలకు గుడ్‌న్యూస్..

**తగ్గిన ఓఅబఖీ రేట్లు**

హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంక్ రుణగ్రహీతలకు శుభవార్త చెప్పింది. నిధుల ఆధారిత రుణ రేట్లను 10 బేసిస్ పాయింట్ల వరకు తగ్గిస్తున్నట్లు ఓ ప్రకటనలో పేర్కొంది. ఎంపిక చేసిన రుణ కాలపరిమితులకు ఇవి వర్తిస్తాయని తెలిపింది. దీంతో ఓఅబఖీ రేట్లతో ముడిపడి ఉన్న రుణగ్రహీతలకు కొంత ఊరట లభిస్తుంది. సవరించిన ఈ మార్పులు నేటి నుంచే అమల్లోకి రానున్నాయి. గతంలో బ్యాంక్ 8 శాతం నుంచి 8.65 శాతం వరకు ఎంసీఎల్ఆర్ రేట్లను వసూలు చేయగా.. ప్రస్తుతం చేసిన మార్పుల ఆధారంగా వడ్డీ రేట్లు 7.90 శాతం - 8.60 శాతానికి తగ్గాయి.ఓవర్‌నైట్, నెల కాలపరిమితి గల రుణాలపై 10 బేసిస్ పాయింట్ల మేర తగ్గించింది. దీంతో 8 శాతం నుంచి 7.90 శాతానికి ఎంసీఎల్ఆర్ రేటు తగ్గింది. 3 నెలల కాలపరిమితి రుణాలపై కూడా 10 బేసిస్ పాయింట్లు సవరించింది. వడ్డీ రేటు 8.15 శాతం నుంచి 8.05 శాతానికి చేరింది.6 నెలల కాలపరిమితి రుణాలపై 5 బేసిస్ పాయింట్లు తగ్గడంతో.. వడ్డీ రేటు 8.30 శాతం నుంచి 8.25 శాతానికి మారింది.ఏడాది రుణాలపై కూడా 5 బేసిస్ పాయింట్లు తగ్గించగా.. 8.40 శాతం నుంచి 8.35 శాతానికి ఎంసీఎల్ఆర్ రేటు తగ్గింది.




**గుడ్ల ధరలు**

| హైదరాబాద్ | వరంగల్ |
|---|---|
| ₹ 5.40 | ₹ 5.42 |

**బంగారం ధరలు (10 గ్రాములు)**
**హైదరాబాద్**

| ₹ 1,63,004 (22 క్యారెట్లు) | ₹ 1,77,827 (24 క్యారెట్లు) |
|---|---|

**వెండి ధరలు (కేజీ)**
**హైదరాబాద్**
₹ 2,55,000

# చమురు ధరలపైనే ఆందోళన

**ఎఫ్‌ఎమ్‌సీజీ, సిమెంటు షేర్లు ఒత్తిడిలో**

**లోహ, టెలికాం సూచీలకు సానుకూలతలు**



**న్యూఢిల్లీ(జనంసాక్షి):**పశ్చిమాసియా యుద్ధ పరిణామాలు, ముడి చమురు ధరల పెరుగుదల నేపథ్యంలో మదుపర్లు అప్రమత్తతతో వ్యవహరిస్తున్నారు. సమీప కాలంలో ప్రామాణిక సూచీల్లో విక్రయాల ఒత్తిడి కనిపించొచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. అమెరికా ఫెడరల్ రిజర్వ్ రేట్ల పెంపు అంచనాలు కాస్త పెరిగాయి. నిఫ్టీ-50 సూచీ సమీప కాలంలో బలహీనంగా కనిపిస్తోందని సాంకేతిక నిపుణులు అంటున్నారు. 24,000-24,200 శ్రేణి దిగువన ట్రేడయినంత కాలం, పెరిగినపుడల్లా విక్రయించే ధోరణి ఉంటుందని, 23,800-23,830 వద్ద మద్దతు పొందొచ్చని చెబుతున్నారు. విదేశీ పోర్టుఫోలియో మదుపర్లు (ఎఫ్‌పీఐ) జులైలో రూ.20,200 కోట్లు, ఆగస్టులో రూ.29,600 కోట్లు నికర కొనుగోళ్లు జరిపినా, ఈ నెల తొలి వారంలో రూ.7,443 కోట్ల విక్రయాలు జరిపారు. వీటితో కలిపి 2026లో ఇప్పటివరకు ఎఫ్‌పీఐల ఉపసంహరణలు రూ.2.32 లక్షల కోట్లుగా ఉన్నాయి. వీరి ధోరణి, రూపాయి కదలికల వంటివీ ప్రభావం చూపుతాయి.వివిధ రంగాలపై విశ్లేషకుల అంచనాలు ఇలా..ముడి చమురు అధిక ధరలు, బలహీన గిరాకీ వల్ల ఎఫ్‌ఎమ్‌సీజీ షేర్లు ఒత్తిడిలో కనిపించొచ్చు. వర్షాభావం నేపథ్యంలో గ్రామీణ గిరాకీ తగ్గొచ్చు. ముడిపదార్థాల ధరలు ముఖ్యంగా పామాయిల్ ధరల వల్ల, ఈ కంపెనీల లాభాల మార్జిన్లు తగ్గొచ్చు.

ఔషధ షేర్లు ఒక శ్రేణికి లోబడి చలించొచ్చు. కొన్ని లార్జ్ క్యాప్ షేర్లలో బలహీనతలు, సమీప కాల సాంకేతిక ఒత్తిళ్ల వల్ల లాభాలు పరిమితంగా ఉండొచ్చు. ఈ రంగ సూచీ 26,000-26,700 మధ్య చలించొచ్చు. సాంకేతిక చార్టుల్లో గ్రాన్యూల్స్ సానుకూలంగా, సిప్లా బలహీనంగా కనిపిస్తోంది. నిఫ్టీ బ్యాంక్ సూచీ కాస్త తెరపినపడొచ్చు. అమెరికా ఫెడ్ రేట్ల పెంపు అంచనాలు ఇందుకు దోహదం చేయొచ్చు. ఈ సూచీకి 57,809.70 వద్ద తక్షణ నిరోధం, 57,104.50 వద్ద మద్దతు కనిపిస్తోంది. ఐటీ షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. ఆరు వారాల తరహాలోనే 30,500-32,000 శ్రేణిలోనే కొనసాగొచ్చు. అంచనాల కంటే బలంగా అమెరికా ఉద్యోగ గణాంకాలు వెలువడడంతో, ఈ షేర్లకు సెంటిమెంటు ప్రతికూలంగా మారింది.నిఫ్టీ లోహ సూచీ క్రమంగా సానుకూలతలు సంతరించుకుంటోంది. ఇటీవలి ఉక్కు ధరల రికవరీ వల్ల ఫెర్రస్ కంపెనీలకు మధ్యకాలంలో మద్దతు లభించొచ్చు. తక్షణ నిరోధం 13,600 వద్ద, ఆ తర్వాత 13,931 వద్ద ఎదురుకావొచ్చు. మద్దతు తొలుత 13,000 వద్ద, ఆ తర్వాత 12,680 వద్ద లభించొచ్చు.ప్రభావం చూపే వార్తలు లేనందున చమురు-గ్యాస్ కంపెనీల షేర్లు స్థిరీకరణకు గురికావొచ్చు. చమురు అధిక ధరల కారణంగా చమురు మార్కెటింగ్ కంపెనీల మార్జిన్లపై భారం పడొచ్చు. 10,950-11,400 శ్రేణి బయటకు వస్తేనే దిశ తెలుస్తుంది.యంత్రపరికరాల కంపెనీల షేర్లకు విక్రయాల ఒత్తిడి ఎదురుకావొచ్చు. ఇప్పటికే ఎక్కువ విలువకు చేరడంతో పాటు, చమురు బ్యారెల్ ధర మళ్లీ 90 డాలర్లను అధిగమించడంతో, మార్జిన్లపై ప్రభావం పడుతుందన్న అంచనాలు ఇందుకు నేపథ్యం. బీఎస్ఈ టెలికాం సూచీలో సాంకేతికతంగా సానుకూలతలున్నాయి. కొద్ది నెలలుగా విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపర్లు ఈ షేర్లను విక్రయిస్తూ ఉండడం ఆందోళన కలిగించే అంశం. 2026లో ఇప్పటిదాకా వీరు రూ.29,513 కోట్ల విక్రయాలు చేపట్టారు. వరుసగా నాలుగు వారాలుగా నష్టపోతున్న నిఫ్టీ వాహన సూచీ, అదే ధోరణిలో కొనసాగొచ్చు. స్వల్ప, మధ్య కాలానికి సెంటిమెంటు బేరిష్‌గా ఉండనుంది.సిమెంటు కంపెనీల షేర్లు అమ్మకాల ఒత్తిడికి గురికావొచ్చు. అధిక వ్యయాలు కాస్తా రాబోయే త్రైమాసికాల్లో మార్జిన్లపై ప్రభావం చూపుతాయన్న ఆందోళనలున్నాయి. కొన్ని ప్రాంతాల్లో వర్షాల కారణంగా సెప్టెంబరు త్రైమాసికంలో గిరాకీ స్తబ్దుగా ఉంది.

## ప్రత్యామ్నాయ ఇంధన వాహనాల జోరు

**పెట్రోల్ బండ్ల విక్రయాలను దాటేసి ముందుకు**

ఇండియన్ ఆటో రిటైల్ మార్కెట్‌లో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఆగస్టులో సీఎన్‌జీ, హైబ్రిడ్, ఈవీ వంటి ప్రత్యామ్నాయ ఇంధన వాహనాలు విక్రయాలు తొలిసారిగా.. పెట్రోల్ వాహనాల అమ్మకాల సంఖ్యను అధిగమించాయి. ఈ మూడు రకాల వాహనాలు.. ప్యాసింజర్ వెహికల్స్ విక్రయాల్లో 41.95 శాతం వాటాను దక్కించుకున్నాయి. అదే సమయంలో పెట్రోల్ వాహనాల వాటా 40.85% శాతానికి పరిమితమైంది.గతేడాది ఆగస్టు నెలలో పెట్రోల్ వాహనాల వాటా 46 శాతంగా ఉండటం గమనార్హం. ఈ20 పెట్రోల్ వినియోగంపై నెలకొన్న సందేహాలు, ఇంధన వ్యయాన్ని తగ్గించుకోవాలనే ఆలోచనతో కొనుగోలుదారులు ప్రత్యామ్నాయ ఇంధనాల వైపు మొగ్గుచూపుతున్నారని పరిశ్రమ వర్గాలు చెబుతున్నాయి.ఫెడరేషన్ ఆఫ్ ఆటోమొబైల్ డీలర్స్ అసోసియేషన్స్ గణాంకాల ప్రకారం.. 2025-26 ఆర్థిక సంవత్సరంలో దేశీయ ఆటోమొబైల్ రిటైల్ రంగం 2,96,71,064 యూనిట్ల విక్రయాలతో సరికొత్త రికార్డు సృష్టించింది. అంతక్రితం ఆర్థిక సంవత్సరంతో పోలిస్తే 13.30 శాతం వృద్ధిని నమోదు చేసింది. ఈ ఏడాది ఆగస్టులో దేశవ్యాప్తంగా రిటైల్ వాహనాల విక్రయాలు 24,23,201 యూనిట్లుగా ఉన్నాయి. గతేడాది ఆగస్టుతో పోలిస్తే 17.51% వృద్ధి నమోదైంది.



## లింక్ క్లిక్ చేయగానే ఫోన్ ఫ్రీజ్ అయిందా..? జాగ్రత్త పడాల్సిందే..!

**న్యూఢిల్లీ(జనంసాక్షి):**డిజిటల్ అరెస్ట్, నకిలీ కస్టమర్ సర్వీస్ కాల్స్, అధిక రాబడి వస్తుందంటూ సోషల్ మీడియా లింక్స్ ఇలా.. సామాన్య పౌరుల్ని మోసగించడానికి డిజిటల్ దొంగలు వేసే ఎత్తులు ఎన్నో..! రెండువైపులా పదునున్న ఈ టెక్నాలజీతో క్షణాల్లో బ్యాంకు ఖాతాలను ఖాళీ చేస్తున్నారు సైబర్ నేరగాళ్లు ఇప్పుడు ఇలాంటిదే మరో మోసం వెలుగుచూసింది. ఇటీవల కోల్‌కతాకు చెందిన ఓ మహిళ ఇన్‌స్టాను స్క్రోల్ చేస్తుండగా.. అనుకోకుండా ఒక యాడ్‌పై క్లిక్ చేసి రూ.లక్ష పోగొట్టుకున్నారు. ప్రకటన లింక్‌పై ఆమె క్లిక్ చేయగానే.. ఫోన్ స్క్రీన్ వెంటనే ఫ్రీజ్ అయిపోయింది. ఏం చేసినా అది పనిచేయకపోయేసరికి.. సాయంత్రం మొబైల్ దుకాణానికి వెళ్లి దానిని రిపేర్ చేయించుకోవాల్సి వచ్చింది. అయితే, అప్పటికే ఆమె ఖాతా నుంచి డబ్బు బదిలీ అయిపోవడంతో షాక్‌కు గురైన ఆ కుటుంబం.. వెంటనే సైబర్ సెల్‌కు ఫిర్యాదు చేసింది.ఆకర్షించే, తెలియని ప్రకటన లింక్‌లపై క్లిక్ చేయగానే.. ఫోన్ పనిచేయడం ఆగిపోతే తేలిగ్గా తీసుకోవద్దని నిపుణులు చెప్తున్నారు ఈ దోపిడీని స్కామర్లు పక్కా ప్లాన్‌తో చేస్తున్నారు. తొలుత సోషల్ మీడియా యాడ్స్, లింక్స్‌తో యూజర్‌ను టార్గెట్ చేస్తారు. ఒక్కసారి లింక్ తెరవగానే.. ఒక ఎర్రర్ మెసేజ్ వస్తుంది లేదా ఫోన్ స్క్రీన్ తాత్కాలికంగా పనిచేయకుండా నిలిచిపోతుంది. తర్వాత బ్యాంక్ ఉద్యోగి/టెక్నికల్ సపోర్ట్ సర్వీస్ లేదా సర్వీస్ ప్రొవైడర్ పేరిట ఆ యూజర్‌ను నేరగాళ్లు సంప్రదిస్తారు. నకిలీ యాప్స్‌ను డౌన్‌లోడ్ చేయమని చెప్తారు. ఒకసారి ఆ యాప్‌ను డౌన్‌లోడ్ చేస్తే.. ఫోన్ కంట్రోల్ వారి చేతుల్లోకి వెళ్లిపోతుంది.మెసేజ్‌లు, నోటిఫికేషన్లు, కాల్స్‌ను యాక్సెస్ చేసుకోవడానికి ఆ యాప్స్ పర్మిషన్ అడుగుతుంటాయి. అనుమతి ఇచ్చే ముందు జాగ్రత్తగా పరిశీలించాలని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఒక్కోసారి స్క్రీన్ షేరింగ్ యాప్స్‌ను ఇన్‌స్టాల్ చేసుకోవాలని స్కామర్లు ఒప్పిస్తుంటారు కూడా. వాటికి ఓకే చెప్తే.. స్క్రీన్‌పై కనిపించే వివరాలను సైబర్ నేరగాళ్లు చూడటానికి వీలు కలుగుతుంది. అప్పుడు యూజర్ స్థానంలో ఫోన్‌ను కూడా వాడే అవకాశం కేటుగాళ్లకు లభిస్తుంది. అలాంటి సమయాల్లో బ్యాంకింగ్ సమాచారం వారి చేతిలో పడే ప్రమాదం ఉంటుంది ఇలాంటి ప్రయత్నాలతో యూపీఐ సెక్యూరిటీ వ్యవస్థలోకి చొరబడాల్సిన అవసరం లేకుండానే.. యూజర్ల వివరాలను వారు తెలుసుకోగలుగుతున్నారు. ఫోన్‌లో ఎర్రర్ సందేశాలు రావడం, స్క్రీన్ ఫ్రీజ్ అయిన సందర్భాల్లో బ్యాంక్ వివరాలు ఎంటర్ చేయకుండా చూడాలి.

వెంటనే మొబైల్, వైఫై డేటాను ఆఫ్ చేయాలి.

తెలియని వ్యక్తులు చెప్పిన యాప్స్ డౌన్‌లోడ్ చేయొద్దు. స్క్రీన్ షేరింగ్‌ను ఇన్‌స్టాల్ చేయొద్దు.అలాగే గతంలో ఏవైనా అనుమానిత యాప్స్ డౌన్‌లోడ్ చేసి ఉంటే.. వాటికిచ్చిన అనవసర అనుమతులను ఎప్పటికప్పుడు తొలగించుకోవడం మంచిది.మీ బ్యాంకింగ్ సమాచారం నేరగాళ్ల చేతుల్లో పడిందని అనుమానిస్తే.. వెంటనే సంబంధిత బ్యాంకులను సంప్రదించాలి. ఇటీవల లావాదేవీలను పరిశీలించుకోవాలి.ఇన్ని చేసినా డబ్బు పోయి ఉంటే.. నేషనల్ సైబర్‌క్రైమ్ హెల్ప్‌లైన్ (1930)కి కాల్ చేయాలి.ఈ డిజిటల్ యుగంలో యూపీఐ పిన్, ఓటీపీని ఎవరికీ చెప్పకుండా జాగ్రత్తగా ఉంటే మాత్రమే సరిపోదు. మొబైల్ డివైజ్ సెక్యూరిటీ, యాప్స్‌కు ఇచ్చే అనుమతులు, అనుమానిత కాల్స్, లింక్స్‌పై యూజర్ల అప్రమత్తతా అంతే కీలకమని నిపుణులు సూచిస్తున్నారు.




## ఇస్రో ప్రైవేటీకరణ ఉండదు

**ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలపై వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తాం: ఛైర్మన్ వి.నారాయణన్**

బెంగుళూరు(జనంసాక్షి):ఇస్రో ప్రైవేటీకరణపై ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలకు ఆ సంస్థ ఛైర్మన్ వి.నారాయణన్ తెరదించారు. ఇస్రోను ప్రైవేటీకరించే ప్రసక్తే లేదని చెప్పారు. ఉద్యోగుల్లో నెలకొన్న ఆందోళనలపై వారితో మాట్లాడి సమస్యలను పరిష్కరిస్తామన్నారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు సంస్థల భాగస్వామ్యం పెరిగినా.. ఇస్రోకు ముప్పు లేదని తెలిపారు. బెంగళూరు స్పేస్ ఎక్స్‌పోలో పాల్గొన్న ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. అంతరిక్ష రంగంలో ప్రైవేటు పరిశ్రమల పాత్ర కొత్తదేమీ కాదని నారాయణన్ పేర్కొన్నారు. విస్తృత బాధ్యతలు చేపట్టేలా ఇస్రో మరింత శక్తిమంతంగా మారుతుందన్నారు. ప్రస్తుతం సుమారు 450 పరిశ్రమలు ఇస్రోతో కలిసి పనిచేస్తున్నాయని చెప్పారు. దేశ అవసరాలకు ఏటా దాదాపు 50 లాంచ్ వెహికిల్స్ అవసరమని.. ఆ స్థాయిలో ప్రయోగ సామర్థ్యాన్ని పెంచాలంటే ఇస్రోతో పాటు మరింత విస్తృత వ్యవస్థ కీలకమన్నారు.

## రక్షణ రంగానికి ఊతం..

ఆమోదించిన ప్రతిపాదనల్లో భారత సైన్యం కోసం సీబీఆర్ఎన్ నిఘా వాహనాలు, మెకానికల్ మైన్ లేయర్లు, తేలికపాటి హెలికాప్టర్లు, ట్రాల్ ట్యాంకులు, 'సర్వత్ర' వంతెన వ్యవస్థ వంటివి ఉన్నాయి. నౌకాదళం కోసం ఆరుద్ర రాడార్లు, మెరైన్ గ్యాస్ టర్బైన్‌లు కొనుగోలు చేయనున్నారు. వైమానిక దళానికి సంబంధించి యుద్ధ, రవాణా విమానాలు, హెలికాప్టర్ల యుద్ధ సామర్థ్యాన్ని పెంపొందించే వివిధ ప్రతిపాదనలకు ఆమోదం లభించింది. అదేవిధంగా గ్రౌండ్ బేస్డ్ మల్టీపర్పస్ జామర్ కొనుగోలుకు, డిఫెన్స్ ఫోర్సెస్ సెక్యూర్ యాక్సెస్ కార్డ్ వ్యవస్థ ఏర్పాటుకు రక్షణశాఖ అనుమతి మంజూరు చేసింది.

## తెలంగాణలో 'సర్' గడువు మరోసారి పొడిగింపు

ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి కేంద్ర ఎన్నికల సంఘానికి వేర్వేరుగా లేఖలు రాశారు. వారి విజ్ఞప్తిని సానుకూలంగా పరిగణనలోకి తీసుకున్న ఎన్నికల సంఘం, గడువును మరోసారి పొడిగిస్తూ నిర్ణయం తీసుకుంది. కొత్త షెడ్యూల్ ప్రకారం అక్టోబర్ 7 వరకు అభ్యంతరాలను స్వీకరించి, వాటిని పరిష్కరించిన అనంతరం నవంబర్ 9వ తేదీన తుది ఓటర్ల జాబితాను ప్రచురించనున్నారు. ఈసీ నిర్ణయంతో కొత్తగా ఓటరుగా నమోదు చేసుకోవాలనుకునే వారికి, అలాగే జాబితాలో తప్పులను సరిదిద్దుకోవాలనుకునే వారికి అదనపు సమయం లభించినట్లయింది.

## కాళేశ్వరం ప్రాజెక్టుపై కేసీఆర్ ఇంకా మాట్లాడటం సిగ్గుచేటు

నీళ్ల సమస్యకు రెండు కారణాలు ఉన్నాయి.. ఒకటి ఎల్‌నినో, మరొకటి కేసీఆర్. నీటి పంపకాల విషయంలో కేసీఆర్ తెలంగాణకు అన్యాయం చేశారు. ఇరిగేషన్ శాఖను నాశనం చేశారు. ఇరిగేషన్ విషయంలో కేసీఆర్ చేసిన తప్పుల వల్లే ప్రస్తుత సమస్యలు ఎదురవుతున్నాయి. ఆయన మాట్లాడిన భాష వల్లే తెలంగాణ భాషకు చెడ్డ పేరు వచ్చింది" అని ఉత్తమ్ ఆరోపించారు.



# గడువులోగా సీఎంఆర్ బియ్యం డెలివరీ పూర్తి చేయాలి



- డిఫాల్ట్ మిల్లర్లు బకాయిలు చెల్లించకుంటే ఆస్తులపై చర్యలు
- 2 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం నిల్వకు గోదాముల గుర్తింపు
- ప్రజావాణి అర్జీలను పెండింగ్‌లో ఉంచొద్దు

**పెద్దపల్లి, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** 2025–26 ఖరీఫ్, రబీ సీజన్లకు సంబంధించిన కస్టమ్ మిల్లింగ్ రైస్ (సీఎంఆర్) డెలివరీని నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీహర్ష రైస్ మిల్లర్లను ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కలెక్టరేట్‌లో అదనపు కలెక్టర్ బి.శ్రీరాములుతో కలిసి సీఎంఆర్ డెలివరీ, బకాయిలు, డిఫాల్ట్ మిల్లర్లు, గోదాముల లభ్యతపై సమీక్ష నిర్వహించారు. బకాయిలు చెల్లించని డిఫాల్ట్ మిల్లర్లపై రెవెన్యూ రికవరీ యాక్ట్ ప్రకారం ఆస్తులపై చర్యలతో పాటు క్రిమినల్ కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. బకాయిలు పూర్తిగా చెల్లించిన మిల్లర్లకు తదుపరి సీజన్‌లో ధాన్యం కేటాయించే అవకాశం కల్పిస్తామని తెలిపారు. వానాకాలం ధాన్యం కొనుగోళ్లను దృష్టిలో ఉంచుకుని సుమారు 2 లక్షల మెట్రిక్ టన్నుల నిల్వ సామర్థ్యానికి సరిపడా గోదాములను ముందుగానే గుర్తించాలని అధికారులను ఆదేశించారు. ప్రభుత్వ గోదాములను అనుమతి లేకుండా ఎవరికీ కేటాయించరాదని స్పష్టం చేశారు. సీఎంఆర్ డెలివరీ, ధాన్యం నిల్వ, గోదాముల నిర్వహణపై నిరంతరం పర్యవేక్షణ చేపట్టాలని సూచించారు.
అదేరోజు కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణిలో అదనపు కలెక్టర్ శ్రీరాములుతో కలిసి కలెక్టర్ ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. ప్రజావాణి దరఖాస్తులను అత్యంత ప్రాధాన్యంతో పరిశీలించి సత్వరం పరిష్కరించాలని, పెండింగ్‌లో ఉంచరాదని అధికారులను ఆదేశించారు. కమాన్‌పూర్ మండలం నాగారం గ్రామానికి చెందిన స్వప్న ఇంటి నిర్మాణానికి అడ్డుపడుతున్న వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరగా తహసీల్దార్‌కు పంపించారు. ఉపాధి కల్పించాలని వడ్డేపల్లి చైతన్య చేసిన విజ్ఞప్తిని జిల్లా ఉపాధి అధికారికి, డబుల్ బెడ్‌రూమ్ ఇల్లు మంజూరు చేయాలని షాహిదా చేసిన దరఖాస్తును పీడీ హౌసింగ్‌కు పంపించారు. సర్వే నంబర్ 58లో అక్రమ నిర్మాణాలు జరగకుండా చర్యలు తీసుకోవాలని కోరిన దరఖాస్తుపై మున్సిపల్ కమిషనర్‌ను విచారణ చేసి చర్యలు చేపట్టాలని ఆదేశించారు. కార్యక్రమాల్లో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



## ఆలూర్‌లో భూసేకరణ, ఆర్అండ్ఆర్‌పై సమావేశం

- పారిశ్రామిక పార్కు ఏర్పాటుపై రైతులకు అవగాహన
- భూయజమానులు, రైతులు, గ్రామ ప్రజలతో చేవెళ్ల ఆర్డీఓ సమావేశం

**చేవెళ్ల, సెప్టెంబర్ 07 (జనంసాక్షి) :** తెలంగాణ స్టేట్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (టిజిఐఐసి) ఆధ్వర్యంలో ఆలూర్ గ్రామంలో ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు ఏర్పాటుకు సంబంధించిన భూసేకరణ, పునరావాసం–పునరుద్ధరణ (ఆర్‌డఆర్) అంశాలపై సోమవారం ఉదయం సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ఆర్డీవో పార్థసింహ రెడ్డి, ఆలూర్ గ్రామ సర్పంచ్ భాగ్యశేఖర్ గౌడ్ అధ్యక్షత వహించారు. సమావేశానికి సంబంధిత భూయజమానులు, రైతులు, గ్రామ ప్రజలు హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రతిపాదిత భూసేకరణ ఉద్దేశ్యం, భూసేకరణ ప్రక్రియ, భూయజమానులు, ప్రభావిత కుటుంబాలకు చట్టప్రకారం అందే పరిహారం, పునరావాసం, పునరుద్ధరణ (ఆర్‌డఆర్) ప్రయోజనాలపై అధికారులు వివరించారు. భూసేకరణ అనంతరం చేపట్టనున్న తదుపరి చర్యలపై కూడా రైతులకు అవగాహన కల్పించారు. అలాగే భూసేకరణ, పునరావాసం, పునరావాసంలో న్యాయమైన పరిహారం, పారదర్శకత హక్కు చట్టం, 2013 ప్రకారం అర్హత కలిగిన భూయజమానులు, ప్రభావిత కుటుంబాలకు లభించే హక్కులు, ప్రయోజనాలు, ఇతర సంబంధిత అంశాలను అధికారులు వివరించారు. ఈ సందర్భంగా రైతులు తమ సందేహాలు, అభిప్రాయాలను అధికారుల దృష్టికి తీసుకురాగా, వాటిపై అధికారులు వివరణలు ఇచ్చారు. ప్రతిపాదిత పారిశ్రామిక పార్కు ఏర్పాటు, భూసేకరణ ప్రక్రియకు సంబంధించి రైతులు సానుకూలంగా స్పందించారు. ప్రభుత్వ తదుపరి ప్రక్రియలో అవసరమైన సహకారం అందించేందుకు తమ సుముఖతను వ్యక్తం చేశారు. రైతులు, గ్రామ ప్రజల భాగస్వామ్యంతో సమావేశం ప్రశాంతమైన, సానుకూల వాతావరణంలో విజయవంతంగా ముగిసిందని ఆర్డిఓ పార్థసింహారెడ్డి తెలిపారు. ఈ సమావేశంలో తాసిల్దార్ కృష్ణయ్య, భూయజమానులు, గ్రామ ప్రజలు తదితరులు ఉన్నారు.

## ఏసీబీ వలలో మరో అవినీతి చేప

### రూ.10 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సబ్ జైలర్



**హుజురాబాద్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) :** ఏసీబీ అధికారుల వలలో మరో అవినీతి చేప చిక్కింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, అధికార దాహంతో లంచం డిమాండ్ చేసిన హుజరాబాద్ సబ్ జైలర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఒక బాధితుడి నుంచి రూ.10 వేల లంచం తీసుకుంటుండగా అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి...హుజరాబాద్ సబ్ జైలు పరిధిలోని ఒక పనికి సంబంధించి జైలర్ నాంపల్లి దేవేందర్ బాధితుడిని రూ.10 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ గట్ల మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలోని బృందం పక్కా ప్రణాళికతో వల పన్నింది. పథకం ప్రకారం బాధితుడు హుజరాబాద్ సబ్ జైలు ప్రాంగణంలోనే జైలర్ నాంపల్లి దేవేందర్ కు రూ. 10వేల నగదు అందజేస్తుండగా, అక్కడే కాపుకాసిన ఏసీబీ అధికారులు జైలర్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిందితుడి చేతుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదుకు కెమికల్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ అని తేలింది. అనంతరం సబ్ స్టేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి కీలక రికార్డులను పరిశీలించారు. లంచం తీసుకున్న సబ్ జైలర్ దేవేందర్ ను అదుపులోకి తీసుకున్నామని, ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే ప్రజలు నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.




## ఇంజినీరింగ్ పనులు సత్వరం పూర్తి చేయాలి

### పౌర సేవలకు తొలి ప్రాధాన్యం: జెడ్సీ నారాయణ్ అమిత్

**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** శేరిలింగంపల్లి జోనల్ పరిధిలో కొనసాగుతున్న ఇంజినీరింగ్ అభివృద్ధి పనులను నిర్దేశిత గడువులోగా పూర్తి చేయాలని జోనల్ కమిషనర్ డాక్టర్ నారాయణ్ అమిత్ అధికారులను ఆదేశించారు. సోమవారం జోనల్ కార్యాలయంలో ఇంజినీరింగ్, అర్బన్ బయోడైవర్సిటీ, పారిశుద్ధ్య విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. అభివృద్ధి పనుల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలని, అధికారులు క్షేత్రస్థాయిలో నిరంతరం పర్యవేక్షించాలని సూచించారు. నగర సుందరీకరణలో భాగంగా ప్లాంటేషన్, పార్కుల నిర్వహణ పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు. రాబోయే గణేష్ నవరాత్రి ఉత్సవాలను దృష్టిలో ఉంచుకుని జోన్ పరిధిలో పటిష్ట ఏర్పాట్లు చేపట్టాలని సూచించారు. విగ్రహాల నిమజ్జనం జరిగే చెరువుల వద్ద లైటింగ్, రహదారుల మరమ్మతులు, పారిశుద్ధ్యం, తాగునీటి సౌకర్యాలు కల్పించాలని ఆదేశించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా వివిధ శాఖలు సమన్వయంతో పనిచేయాలని తెలిపారు. ప్రజా సమస్యల పరిష్కారానికి ప్రాధాన్యం ఇస్తూ పౌర సేవలను మరింత మెరుగుపరచాలని అధికారులకు సూచించారు.

## డివైడర్‌ను ఢీకొన్న బైక్.. వ్యక్తి మృతి మరొకరికి తీవ్ర గాయాలు

**మొయినాబాద్, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** మొయినాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో సోమవారం సాయంత్రం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా, మరో వ్యక్తి తీవ్రంగా గాయపడ్డాడు. పోలీసుల వివరాల ప్రకారం.. కృష్ణ(50), నరసింహ(27) ద్విచక్ర వాహనంపై అప్పా జంక్షన్ నుంచి మొయినాబాద్ వైపు వెళ్తున్నారు. రాణి మద్రాస్ లిమిటెడ్ కంపెనీ సమీపంలో బైక్ అదుపుతప్పి రోడ్డు డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో కృష్ణ తీవ్రంగా గాయపడి ఘటనాస్థలంలోనే మృతి చెందాడు. నరసింహకు తీవ్ర గాయాలు కావడంతో ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. మృతుడు, గాయపడిన వ్యక్తి నారాయణపేట జిల్లా దామరగిద్ద మండలం అయ్యవారిపల్లి గ్రామానికి చెందినవారని పోలీసులు తెలిపారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని వివరాలు సేకరించి, మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి ప్రమాదానికి గల కారణాలపై దర్యాప్తు చేస్తున్నారు.

## మానసిక వైకల్యం కలిగిన యువతిపై లైంగిక దాడి కేసు నమోదు

**చిగురుమామిడిసెప్టెంబర్ 7(జనంసాక్షి):** ఉల్లంపల్లి గ్రామంలో మానసిక వైకల్యం కలిగిన యువతిపై లైంగిక దాడికి పాల్పడిన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై జగదీశ్వర్ తెలిపారు. పోలీసుల వివరాల ప్రకారం.. ఆదివారం సాయంత్రం ఓ ఇంట్లోకి అక్రమంగా ప్రవేశించిన బల్లు కృష్ణ(37), ఇంట్లో ఒంటరిగా ఉన్న 35 ఏళ్ల యువతిపై లైంగిక దాడికి పాల్పడినట్లు ఫిర్యాదు అందింది. బాధితురాలి అరుపులు విన్న కుటుంబ సభ్యులు అక్కడికి చేరుకోవడంతో నిందితుడు పరారయ్యాడు. బాధితురాలి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు నిందితుడిపై సంబంధిత చట్టపరమైన సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు. పరారీలో ఉన్న నిందితుడిని త్వరలో పట్టుకుని చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని స్పష్టం చేశారు.

## కనీస వేతన మండలిలో కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలి

### సీఐటీయూ ఆధ్వర్యంలో హయత్‌నగర్‌లో నిరసన

- కార్మికుల గొంతు నొక్కే ప్రయత్నాలు: చంద్రమోహన్
- హక్కుల పరిరక్షణకు ఐక్యంగా పోరాడాలి

**హయత్‌నగర్, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** కేంద్ర కనీస వేతన సలహా మండలిలో సీఐటీయూతో పాటు ఇతర ముఖ్య కేంద్ర కార్మిక సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించాలని సీఐటీయూ రంగారెడ్డి జిల్లా ప్రధాన కార్యదర్శి చంద్రమోహన్ డిమాండ్ చేశారు. సంఘాలకు ప్రాతినిధ్యం కల్పించకపోవడాన్ని నిరసిస్తూ సోమవారం హయత్‌నగర్ బస్‌స్టాండ్ సమీపంలోని అంబేద్కర్ విగ్రహం వద్ద సీఐటీయూ ఆధ్వర్యంలో నిరసన నిర్వహించారు. సీఐటీయూ హయత్‌నగర్ సర్కిల్ కన్వీనర్ చింతపల్లి కృష్ణయ్య అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో చంద్రమోహన్ మాట్లాడుతూ.. 29 కార్మిక చట్టాలను రద్దు చేసి నాలుగు లేబర్ కోడ్‌లను తీసుకురావడం ద్వారా కేంద్ర ప్రభుత్వం కార్మికుల హక్కులను దెబ్బతీసే ప్రయత్నం చేస్తోందని విమర్శించారు. కనీస వేతన సలహా మండలిలో ప్రధాన కార్మిక సంఘాలకు చోటు కల్పించకపోవడం అన్యాయమన్నారు. కార్మికుల హక్కుల పరిరక్షణకు ఈ విధానాలను ఐక్యంగా వ్యతిరేకించాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి ఆలేటి ఎల్లయ్య, మాజీ ఉపాధ్యక్షుడు కీసరి నర్సిరెడ్డి, కార్మిక నాయకులు బి.కనకయ్య, రామస్వామి, మూర్తి, కాశయ్య, రాధమ్మ, సుందర్‌రావు, దశరథ, లక్ష్మయ్య తదితరులు పాల్గొన్నారు.

## నిరుద్యోగ యువత ఉపాధి మార్గాలు ఎంచుకోవాలి

### మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్

**మోమిన్‌పేట, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** చదువుకున్న నిరుద్యోగ యువత ఉపాధి మార్గాలను ఎంచుకొని ఆర్థికంగా ఎదగాలని వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే డాక్టర్ మెతుకు ఆనంద్ సూచించారు. సోమవారం మోమిన్‌పేట మండల కేంద్రంలో రిషి కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. రాష్ట్రంలో చదువుకున్న నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించడంలో ప్రభుత్వం విఫలమైందని ఆరోపించారు. యువత ఉద్యోగాల కోసం ఎదురు చూడకుండా స్వయం ఉపాధి మార్గాలను ఎంచుకొని, ఇతరులకు కూడా ఉపాధి కల్పించే స్థాయికి ఎదగాలని సూచించారు. రిషి కంప్యూటర్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో అందిస్తున్న వివిధ శిక్షణలను యువత సద్వినియోగం చేసుకోవాలని కోరారు. శిక్షణ పూర్తి చేసిన విద్యార్థులకు సర్టిఫికెట్లు అందజేస్తామని తెలిపారు. కేంద్రం నిర్వాహకుడు రాములును అభినందించారు. కార్యక్రమంలో మాజీ బీసీ కమిషన్ సభ్యుడు శుభప్రద పటేల్, బీఆర్ఎస్ నాయకులు డి. వెంకట్ పాల్గొన్నారు.

## స్వచ్ఛమైన గాలితోనే ఆరోగ్యకర సమాజం

- స్వచ్ఛమైన గాలి ప్రజారోగ్యానికి కీలకం
- పరిశ్రమలు స్వచ్ఛమైన సాంకేతికతలో పెట్టుబడులు పెట్టాలి
- నెట్‌జీరో లక్ష్యానికి స్వచ్ఛ ఇంధనాల వినియోగం
- 'నీలాకాశం' సాధారణ దృశ్యంగా మారాలి



**అమీర్‌పేట్/సనత్‌నగర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** స్వచ్ఛమైన గాలి కేవలం పర్యావరణ లక్ష్యం మాత్రమే కాదని.. ప్రజారోగ్యం, ఆర్థిక వ్యవస్థ, అభివృద్ధికి అత్యంత కీలకమైన అంశమని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) జాయింట్ చీఫ్ ఎన్విరాన్‌మెంటల్ ఇంజినీర్ శ్రీనివాస్‌రెడ్డి అన్నారు. టీజీ పీసీబీ, టొరెంట్ గ్యాస్ సంయుక్తంగా నిర్వహించిన 'నీలాకాశం కోసం స్వచ్ఛ మైన గాలి అంతర్జాతీయ దినోత్సవం' కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వివిధ పరిశ్రమలకు చెందిన 100 మందికిపైగా ప్రతినిధులు పాల్గొన్నారు. పరిశ్రమలు స్వచ్ఛమైన సాంకేతిక పరిజ్ఞానం, ప్రజా రవాణా, ఇంధన సామర్థ్యం, మెరుగైన వ్యర్థాల నిర్వహణలో పెట్టుబడులను నిబంధనల అమలుగా కాకుండా అభివృద్ధికి చేసే పెట్టుబడులుగా చూడాలని సూచించారు. టీజీపీసీబీ ఎస్ఈ డాక్టర్ డి.ప్రసాద్ మాట్లాడుతూ వ్యక్తుల నుంచి సంస్థల వరకు స్వచ్ఛమైన గాలి కోసం నిబద్ధత అవసరమన్నారు. పరిశ్రమలు నెట్‌జీరో లక్ష్యం దిశగా స్వచ్ఛ ఇంధనాలకు మారాలని సూచించారు. అనుకూల వాతావరణంలో మాత్రమే నీలాకాశం కనిపించడం కాకుండా.. ఉద్గారాలపై నిరంతర శాస్త్రీయ నియంత్రణతో అది సాధారణ దృశ్యంగా మారాలని పేర్కొన్నారు. టొరెంట్ గ్యాస్ ప్రతినిధి రాంబాబు మాట్లాడుతూ పైప్డ్ నేచురల్ గ్యాస్ (పీఎన్‌జీ) వినియోగంతో వాయు కాలుష్యాన్ని తగ్గించి గాలి నాణ్యతను మెరుగుపరచవచ్చని తెలిపారు. కార్యక్రమంలో టీజీపీసీబీ, టీజీఐఐసీ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

### మట్టి వినాయక విగ్రహాలనే వినియోగించాలి

పర్యావరణ పరిరక్షణలో భాగంగా ప్లాస్టర్ ఆఫ్ పారిస్ (పీవోపీ) విగ్రహాలకు బదులుగా మట్టి వినాయక విగ్రహాలను వినియోగించాలని తెలంగాణ కాలుష్య నియంత్రణ మండలి (టీజీపీసీబీ) మెంబర్ సెక్రటరీ జి.రవి సూచించారు. వినాయక చవితిని పర్యావరణహితంగా నిర్వహించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని కోరారు. టీజీపీసీబీ ప్రధాన కార్యాలయంలో సోమవారం మట్టి వినాయక విగ్రహాల తయారీ, నిమజ్జనంపై అవగాహన వర్క్‌షాప్ నిర్వహించగా ఐదు పాఠశాలలకు చెందిన 108 మంది విద్యార్థులు పాల్గొన్నారు. జి.రవి మాట్లాడుతూ మట్టి విగ్రహాలు నీటిలో సహజంగా కరిగిపోవడం వల్ల కాలుష్యం తగ్గుతుందని తెలిపారు. విగ్రహాల నిమజ్జనాన్ని నిర్దేశించిన నీటి వనరులు, చెరువులు, సరస్సుల్లోనే నిర్వహించాలని సూచించారు. విద్యార్థులు తాము తెలుసుకున్న విషయాలను తల్లిదండ్రులు, కుటుంబ సభ్యులకు తెలియజేసి పర్యావరణహిత వినాయక చవితిపై అవగాహన పెంచాలని కోరారు. టీజీపీసీబీ ఆధ్వర్యంలో ఆటోలు, పోస్టర్ల ద్వారా ప్రచారం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. సెప్టెంబర్ 8 నుంచి క్యూఆర్ఈ ప్రాంతంలోని 19 పాఠశాలల్లో మట్టి వినాయక విగ్రహాల తయారీపై వర్క్‌షాపులు నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు. ఇందులో 10 ప్రభుత్వ పాఠశాలలు ఉన్నాయి. విద్యార్థులకు విగ్రహాల తయారీతో పాటు పర్యావరణహిత నిమజ్జనంపై ప్రాయోగిక అవగాహన కల్పించనున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ఇప్పటివరకు 3.26 లక్షలకు పైగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. కార్యక్రమంలో టీజీపీసీబీ అధికారులు పాల్గొని విద్యార్థులకు ధ్రువపత్రాలు అందజేశారు.

## 6 గ్యారెంటీలు.. 420 హామీలు.. అమలేది?

- తాండూర్‌లో ప్రతి ఇంటికీ 'బాకీ కార్డు'
- ఓటు అడిగితే ప్రజలే నిలదీస్తారు
- మిగిలింది 865 రోజులే.. పోరాటం ఉధృతం
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీశైల్‌రెడ్డి పంజుగుల



**తాండూర్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి):** కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఆరు గ్యారెంటీలు, 420 హామీలు, 13 డిక్లరేషన్లను అమలు చేయడంలో విఫలమైందని ఆరోపిస్తూ బీఆర్ఎస్ తాండూర్ నియోజకవర్గంలో నిరసనలు ఉధృతం చేసింది. నియోజకవర్గ ఇన్‌చార్జి శ్రీశైల్‌రెడ్డి పంజుగుల ఆధ్వర్యంలో తాండూర్ పట్టణం, రూరల్, యాలాల్, బషీరాబాద్, పెద్దేముల్, కోట్‌పల్లి మండలాల్లో నాయకులు, కార్యకర్తలు తహసీల్దార్, ఆర్డీవో కార్యాలయాల్లో వినతిపత్రాలు సమర్పించారు. మాజీ ఎమ్మెల్యే పైలెట్ రోహిత్ రెడ్డి నేతృత్వంలో వారం రోజులుగా నిర్వహించిన కార్యక్రమాల్లో భాగంగా 'తాండూర్ చార్జ్‌షీట్', 'బాకీ కార్డు' పేరుతో ప్రతి ఇంటికీ వెళ్లి కాంగ్రెస్ హామీలు, పెండింగ్ అభివృద్ధి పనులు, వివిధ వర్గాలకు ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలను ప్రజలకు వివరించినట్లు బీఆర్ఎస్ నేతలు తెలిపారు. ఎన్నికల సమయంలో 100 రోజుల్లో హామీలు అమలు చేస్తామని చెప్పిన కాంగ్రెస్.. వెయ్యి రోజులు పూర్తయినా వాటిని పూర్తిస్థాయిలో అమలు చేయలేదని శ్రీశైల్‌రెడ్డి విమర్శించారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ నేతలు ఓట్లు అడిగేందుకు వస్తే 'బాకీ కార్డు' చూపించి ప్రజలు నిలదీస్తారని అన్నారు. తాండూర్‌కు రావాల్సిన నీరు, ప్రభుత్వ ఆసుపత్రి విషయంలో అన్యాయం జరుగుతోందని ఆరోపిస్తూ స్థానిక ఎమ్మెల్యేపైనా విమర్శలు చేశారు. అసెంబ్లీలో ప్రతిపక్షం ప్రశ్నించే హక్కును ప్రభుత్వం కాలరాస్తోందని ఆరోపించారు. మహిళా నాయకులపై జరిగిన పరిణామాలకు సీఎం రేవంత్‌రెడ్డి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాళేశ్వరం అంశంతో పాటు వెయ్యి రోజుల పాలనలో రైతులు ఎదుర్కొన్న సమస్యలపై లెక్క తేల్చేందుకు కేసీఆర్ వస్తున్నారని తెలిపారు. కాంగ్రెస్‌కు ఓటేసిన ప్రజలు, ఆ పార్టీ కార్యకర్తల్లోనూ అసంతృప్తి ఉందని పేర్కొన్నారు. మిగిలిన 865 రోజుల్లో బీఆర్ఎస్ పోరాటాన్ని మరింత ఉధృతం చేస్తామని, హామీల అమలు జరిగే వరకు ప్రభుత్వాన్ని నిలదీస్తామని శ్రీశైల్‌రెడ్డి స్పష్టం చేశారు.

## ప్రజా సమస్యలను సత్వరమే పరిష్కరించాలి

### మట్టి గణపతులతో పర్యావరణ పరిరక్షణ: కలెక్టర్



**రంగారెడ్డి, సెప్టెంబర్ 7 (జనం సాక్షి):** ప్రజావాణికి అందుతున్న ప్రతి వినతిని సంబంధిత అధికారులు అత్యంత ప్రాధాన్యతతో పరిశీలించి, నిర్దేశిత గడువులోగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ సి. నారాయణరెడ్డి ఆదేశించారు. సోమవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణికి జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి ప్రజలు హాజరై తమ సమస్యలపై వినతిపత్రాలు సమర్పించారు. మొత్తం 56 ఫిర్యాదులు అందగా.. రెవెన్యూ శాఖకు 27, ఇతర శాఖలకు 29 వినతులు వచ్చాయి. అర్జీలను పెండింగ్‌లో ఉంచకుండా నిరంతరం సమీక్షిస్తూ సత్వర పరిష్కారం చూపాలని కలెక్టర్ సూచించారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించడంలో అధికారులు బాధ్యతాయుతంగా వ్యవహరించాలన్నారు. అనంతరం కాలుష్య నియంత్రణ మండలి ఆధ్వర్యంలో రూపొందించిన 'మట్టి గణపతిని పూజిద్దాం–పర్యావరణాన్ని పరిరక్షిద్దాం' పోస్టర్‌ను కలెక్టర్ ఆవిష్కరించారు. ఈ నెల 14న వినాయక చవితి సందర్భంగా ప్రజలు ప్లాస్టర్ ఆఫ్ పారిస్ విగ్రహాలకు బదులుగా మట్టి గణపతులను ప్రతిష్ఠించి, సహజ రంగులు, పర్యావరణహిత అలంకరణలతో వేడుకలు నిర్వహించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణపై ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృత ప్రచారం చేపట్టాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ చంద్రారెడ్డి, జిల్లా రెవెన్యూ అధికారి శారద, అధికారులు పాల్గొన్నారు.

## ఎంఎన్‌సీల్లో లెవల్-2 ఉద్యోగాలే లక్ష్యంగా ఎదగాలి

- నైపుణ్యాలను అభివృద్ధి చేసుకోవాలి
- యూనివర్సిటీ ప్లేస్‌మెంట్లలో పాల్గొనాలి
- పరిశ్రమకు అనుగుణంగా ప్రాక్టికల్ నాలెడ్జ్ అవసరం
- 'విద్యారంభం-2026'లో ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్




**ముషీరాబాద్, సెప్టెంబర్ 6 (జనం సాక్షి):** విద్యార్థులు ఉన్నతమైన జ్ఞానం, విద్యార్హతలతో పాటు బహుళజాతి సంస్థల్లో లెవల్--2 ఉద్యోగాలను లక్ష్యంగా పెట్టుకుని నైపుణ్యాలను పెంపొందించుకోవాలని ఉస్మానియా యూనివర్సిటీ యూనివర్సిటీ కాలేజ్ ఆఫ్ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ ఇంద్రకంటి శేఖర్ సూచించారు. యూనివర్సిటీ స్థాయి ప్లేస్‌మెంట్ కార్యక్రమాల్లో పాల్గొని పరిశ్రమకు సంబంధించిన అనుభవాన్ని పొందాలని అన్నారు. బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో అవంతి డిగ్రీ అండ్ పీజీ కళాశాల ఆధ్వర్యంలో నూతన ఎంబీఏ, ఎంసీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థుల కోసం నిర్వహించిన 'విద్యారంభం--2026' ఓరియంటేషన్ డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. విద్యార్థులు ఆత్మవిశ్వాసం, నైపుణ్యాలను పెంపొందించుకుని ఉన్నత కెరీర్‌ను నిర్మించుకోవాలని డా. బి.సుజాత సూచించారు. ప్రస్తుత పోటీ ప్రపంచంలో ఉద్యోగ అవకాశాలు పొందాలంటే ప్రాక్టికల్ నాలెడ్జ్‌తో పాటు పరిశ్రమ అవసరాలకు అనుగుణమైన నైపుణ్యాలు అవసరమని జేఎన్‌టీయూహెచ్ స్కూల్ ఆఫ్ మేనేజ్‌మెంట్ స్టడీస్ ప్రొఫెసర్ సంతోష్‌కుమారి అన్నారు. అవంతి గ్రూప్ ఆఫ్ ఇన్‌స్టిట్యూషన్స్ వ్యవస్థాపకులు, చైర్మన్, సీఈఓ ఎం.శ్రీనివాస్‌రావు విద్యార్థులు, తల్లిదండ్రులకు స్వాగతం పలికి కళాశాలలోని విద్యా వనరులు, సౌకర్యాలను సద్వినియోగం చేసుకుని మెరుగైన ప్లేస్‌మెంట్ అవకాశాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో బ్రహ్మకుమారీస్ అంజలి సిస్టర్, జనరల్ సెక్రటరీ డా.ఎం.ప్రజ్ఞకుమార్, డా.వై.జయప్రద, డైరెక్టర్–హెచ్ఆర్, ప్రొఫెసర్ ఎస్.అప్పారావు, డా.ఎస్.నాగరాజు, అధ్యాపకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు. ఓరియంటేషన్ ద్వారా కళాశాల విద్యా వాతావరణం, సౌకర్యాలు, అవకాశాలు, వ్యక్తిత్వ వికాసం, కెరీర్ పురోగతిపై నూతన విద్యార్థులకు అవగాహన కల్పించారు.

## ప్రజావాణి ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలి

- 48 ఫిర్యాదులు స్వీకరించిన సిఎంసి కమిషనర్
- పట్టణ ప్రణాళిక విభాగానివే 41
- వార్డు సమస్యలకు ప్రాధాన్యంతో పరిష్కారం
- శాఖల మధ్య సమన్వయంతో పనులు వేగవంతం చేయాలి



**శేరిలింగంపల్లి, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** ప్రజావాణి ద్వారా అందుతున్న ఫిర్యాదులను ప్రాధాన్యత క్రమంలో పరిశీలించి సకాలంలో పరిష్కరించాలని సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్ డాక్టర్ జి.సృజన అధికారులను ఆదేశించారు. సోమవారం మాదాపూర్ న్యాక్ భవనంలోని సిఎంసి ప్రధాన కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఆమె ఫిర్యాదుదారుల నుంచి అర్జీలు స్వీకరించారు. మొత్తం 48 ఫిర్యాదులు అందగా.. పట్టణ ప్రణాళిక విభాగానికి 41, ఇంజినీరింగ్‌కు 5, అడ్మినిస్ట్రేషన్, అర్బన్ బయోడైవర్సిటీ విభాగాలకు ఒక్కో ఫిర్యాదు వచ్చినట్లు అధికారులు తెలిపారు. ఫిర్యాదులను స్వీకరించడంతోనే అధికారులు పరిమితం కాకుండా క్షేత్రస్థాయిలో పరిశీలించి, పరిష్కారం జరిగే వరకు బాధ్యతగా వ్యవహరించాలని కమిషనర్ సూచించారు.
మియాపూర్ సర్కిల్ కార్యాలయంలో నిర్వహించిన ప్రజావాణిలో ఇద్దరు అర్జీదారులు పట్టణ ప్రణాళికకు సంబంధించి రెండు ఫిర్యాదులు అందజేశారు. వాటిని నమోదు చేసి ప్రాధాన్యతతో పరిష్కరిస్తామని అధికారులు తెలిపారు. ఇదిలా ఉండగా.. 'వన్ డే–వన్ వార్డు' కార్యక్రమంలో భాగంగా మాదాపూర్ సర్కిల్ పరిధిలోని ఇజ్జత్‌నగర్, మాతృశ్రీనగర్ వార్డుల్లో కమిషనర్ డాక్టర్ సృజన పర్యటించారు. ప్రజాప్రతినిధులు, రెసిడెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు, స్థానికులతో కలిసి జైహింద్ పార్క్, గోకుల్ ఫ్లాట్స్ ప్రాంతాలను పరిశీలించారు.
రహదారులు, సీసీ రోడ్లు, డ్రైనేజీ, మురుగునీటి సమస్యలు, వీధి దీపాలు, తాగునీరు, పార్కుల నిర్వహణ, పారిశుద్ధ్యం, చెత్త నిర్వహణ, ట్రాఫిక్ భద్రత, కమ్యూనిటీ సదుపాయాలపై స్థానికులు కమిషనర్ దృష్టికి తీసుకువచ్చారు. సమస్యలను ప్రాధాన్యతతో పరిష్కరించాలని, శాఖల మధ్య సమన్వయంతో పనులను వేగవంతం చేసి క్షేత్రస్థాయిలో పర్యవేక్షించాలని ఆమె ఆదేశించారు. చేపట్టిన చర్యలపై ఎప్పటికప్పుడు కంప్లయన్స్ నివేదికలు సమర్పించాలని సూచించారు. కార్యక్రమంలో సంబంధిత విభాగాల అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

# రూ.200 కోట్లతో ధర్మపురి ఆలయాభివృద్ధి

- శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి శంకుస్థాపన
- రూ.58.55 కోట్లతో మౌలిక వసతుల అభివృద్ధి
- పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ.22.16 కోట్లు
- అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రంగా తీర్చిదిద్దుతాం: భట్టి



జగిత్యాల బ్యూరో, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): దక్షిణ కాశీగా ప్రసిద్ధి చెందిన ధర్మపురి శ్రీ లక్ష్మీనరసింహస్వామి దేవస్థానం అభివృద్ధికి ప్రభుత్వం రూ.200 కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన పనులకు సోమవారం శ్రీకారం చుట్టింది. వేద పండితులు నిర్ణయించిన శుభ ముహూర్తంలో వేకువజామున 2.58 గంటలకు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, మంత్రి అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు భూమిపూజ చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు.

ధర్మపురి ఆలయాభివృద్ధికి గతంలో పలువురు హామీలు ఇచ్చినా నిధులు కేటాయించలేదని భట్టి విక్రమార్క అన్నారు. ప్రజా ప్రభుత్వం ఇప్పటికే రూ.117 కోట్లు మంజూరు చేసిందని, స్థానిక ఎమ్మెల్యే, మంత్రి విజ్ఞప్తి మేరకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సూచనలతో మరో రూ.80 కోట్లు మంజూరు చేసినట్లు తెలిపారు. మొత్తంగా రూ.200 కోట్ల అంచనా వ్యయంతో ధర్మపురి క్షేత్రాన్ని అంతర్జాతీయ స్థాయి పుణ్యక్షేత్రంగా అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించారు.

శ్రీ ఉగ్ర లక్ష్మీనరసింహస్వామి ఆలయ పునర్నిర్మాణానికి రూ.10 కోట్లు, తొమ్మిది రకాల మౌలిక వసతులు, ఆలయాభివృద్ధి పనులకు రూ.58.55 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. గోదావరి పుష్కరాల నేపథ్యంలో నూతన పుష్కర ఘాట్ల నిర్మాణానికి రూ.22.16 కోట్లు, ధర్మపురి మండలం తిమ్మాపూర్ వద్ద నూతన విద్యుత్ సబ్‌స్టేషన్ నిర్మాణానికి రూ.2.48 కోట్లతో పనులకు శంకుస్థాపన చేశారు.

బాసర నుంచి భద్రాచలం వరకు గోదావరి పుష్కరాల ఏర్పాట్లు ముమ్మరంగా సాగుతున్నాయని భట్టి తెలిపారు. గోదావరి ప్రవాహం వెంట ఉన్న ఆలయాలను కూడా అభివృద్ధి చేస్తున్నట్లు చెప్పారు. ఆలయ పునర్నిర్మాణం, మౌలిక వసతులు, పుష్కర ఘాట్ల అభివృద్ధితో ధర్మపురి మరింత ఆధ్యాత్మిక శోభను సంతరించుకోనుండటంపై భక్తులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎండోమెంట్ కమిషనర్ హనుమంతరావు, జిల్లా కలెక్టర్ సత్తి ప్రసాద్, మున్సిపల్ చైర్మన్ నాగలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

# వంద రోజుల హామీలు ఏమయ్యాయి?

- కాంగ్రెస్ 420 హామీలు, 6 గ్యారెంటీలు అమలేవీ?
- విద్యార్థులు, నిరుద్యోగులను ప్రభుత్వం విస్మరించింది
- బీఆర్ఎస్ హయాంలోనే విద్యారంగానికి స్వర్ణయుగం
- గురుకులాలను కాంగ్రెస్ ప్రభుత్వం నిర్వీర్యం చేస్తోంది: కోరుకంటి



గోదావరిఖని, సెప్టెంబర్ 07 (జనంసాక్షి): ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని రామగుండం మాజీ ఎమ్మెల్యే, పెద్దపల్లి జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు కోరుకంటి చందర్ విమర్శించారు. శనివారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ కార్యాలయం ఎదుట డాక్టర్ బీఆర్ అంబేద్కర్ విగ్రహం వద్ద ప్రారంభమైన భారీ నిరసన ర్యాలీ గోదావరిఖని ప్రధాన చౌరస్తా వరకు సాగింది. అనంతరం నిర్వహించిన నిరసన సభలో ఆయన మాట్లాడారు. కార్యక్రమానికి పెద్దపల్లి మాజీ ఎంపీ, చెన్నూరు మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ ముఖ్య అతిథిగా హాజరయ్యారు.

పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ప్రకటించిన 420 హామీలు, 13 డిక్లరేషన్లు, ఆరు గ్యారెంటీలను నమ్మి ప్రజలు కాంగ్రెస్‌కు అధికారం అప్పగించారని చందర్ అన్నారు. అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి.. ఇప్పటివరకు వాటిని నెరవేర్చలేదని ఆరోపించారు. నిరుద్యోగులకు హామీ ఇచ్చిన ఉద్యోగాలు, నిరుద్యోగ భృతి, విద్యార్థినులకు ప్రకటించిన స్కూటీలు, ఫీజు రీయింబర్స్‌మెంట్ నిధుల పరిస్థితి ఏమిటని ప్రశ్నించారు.

కాంగ్రెస్ పాలనలో విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని అన్నారు. పాఠశాలలు, కళాశాలలు, గురుకులాల్లో మౌలిక వసతులు, నాణ్యమైన భోజనం సరిగా అందడం లేదని ఆరోపించారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలో కేసీఆర్ నాయకత్వంలో కేజీ నుంచి పీజీ వరకు ఉచిత విద్యకు ప్రాధాన్యం ఇచ్చి, పెద్ద సంఖ్యలో గురుకులాలను ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. అప్పటి విద్యా వ్యవస్థను ప్రస్తుత ప్రభుత్వం దెబ్బతీస్తోందని విమర్శించారు.

విద్యార్థులు, నిరుద్యోగుల సమస్యలపై బీఆర్ఎస్ నిరంతరం పోరాడుతుందని చందర్ తెలిపారు. ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయకపోతే ప్రజలు, విద్యార్థులు, నిరుద్యోగులతో కలిసి మరిన్ని ఆందోళనలు చేపడతామని హెచ్చరించారు. కార్యక్రమంలో కౌశిక హరి, మూల విజయరెడ్డి, హరీష్‌రెడ్డి, మేకల సమ్మన్న యాదవ్, మహిళా నాయకురాళ్లు, పార్టీ నాయకులు, విద్యార్థి, యువజన విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# సింగరేణి మెడికల్ బోర్డులో తీవ్ర అన్యాయం

**- బాధితులకు మళ్లీ మెడికల్ బోర్డు నిర్వహించాలి**

**గోదావరిఖని, జనంసాక్షి :** తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూ సింగరేణి మెడికల్ బోర్డుకు హాజరైన 90% కార్మికులను ఉద్యోగం చేయడానికి అర్హుడవు అని నిర్ధారించడం తీవ్ర అన్యాయమని టీబీజీకేఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ మాదాసి రామమూర్తి ఆవేదన వ్యక్తపరిచారు. మెడికల్ బాధితులు సోమవారం గోదావరిఖని యూనియన్ కేంద్ర కార్యాలయంలో నాయకులను కలిసి తమ గోడు వెళ్ళబోసుకున్నారు. బైపాస్ సర్జరీ జరిగినా, క్యాన్సర్, ఊపిరితిత్తులు కాలేయం మోకాళ్ళ నొప్పులు నడవలేని స్థితిలో ఉన్న కార్మికులను కూడా మెడికల్ బోర్డులో అన్యాయం చేశారని వారు కన్నీళ్లు పెట్టుకుంటున్నారని తెలిపారు. కార్మికుల అనారోగ్యాన్ని నిర్ధారించడానికి కార్పొరేట్ ఆసుపత్రి వైద్యులతో పరీక్షలు చేయించాలని బాధితులు చెబుతున్నారని, దీనిని బట్టి కార్మికులు ఎంత ఆందోళనకు గురవుతున్నారో అర్థం చేసుకోవాలన్నారు. గత అసెంబ్లీ సింగరేణి గుర్తింపు యూనియన్ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ ప్రభుత్వం కూల్ బెల్ట్ ఎమ్మెల్యేలు ఇచ్చిన హామీలు గాలికి కొట్టుకుపోతున్నాయని ఆయన విమర్శించారు. కార్మికుల ఓట్లతో గెలిచిన నాయకులు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు ప్రతి నెల మూడు మెడికల్ బోర్డులు నిర్వహించాలని, నూరు శాతం ఇన్ వాలిడేషన్ చేయాలని డిమాండ్ చేశారు. గడిచిన మెడికల్ బోర్డులో విధులు యధావిధిగా నిర్వహించుకోవచ్చు అని ఉత్తర్వులు జారీ చేసిన కార్మికులందరికీ మరో మెడికల్ బోర్డు ఏర్పాటు చేసి, వారికి న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీబీజీకేఎస్ కేంద్ర నాయకులు పర్లపల్లి రవి వాసర్ల జోసెఫ్ రవీందర్ సింగరేణి మెడికల్ బోర్డు బాధితుల పక్షాన కార్మిక నాయకులు దారమళ్ళ ముత్తయ్య బిక్షపతి, ప్రభాకర్, శ్రీనివాస్, బెన్వర్ కుమార్, నంబయ్య తదితరులు పాల్గొన్నారు.

# క్రీడాకారుల భవిష్యత్తుకు అండగా ఉంటా..

**64వ జాతీయ పోటీలకు ట్రయల్స్ నిర్వహణకు చర్యలు: సుధీర్‌రెడ్డి**

**హయత్‌నగర్:** క్రీడాకారుల భవిష్యత్తుకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అండగా ఉంటానని ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి హామీ ఇచ్చారు. వనస్థలిపురం స్కేటింగ్ రింక్‌కు చెందిన రోలర్ హాకీ, ఇన్‌లైన్ హాకీ క్రీడాకారుల తల్లిదండ్రులు సోమవారం ఎమ్మెల్యేను కలిసి తెలంగాణ రోలర్ స్కేటింగ్ అసోసియేషన్ల అఫిలియేషన్ సమస్యను వివరించారు. రెండు అసోసియేషన్లకు ఎస్ఏటీ అఫిలియేషన్ నిలిచిపోవడంతో జాతీయ స్థాయి ఎంపికలు ఆలస్యమవుతున్నాయని, దీనివల్ల క్రీడాకారుల భవిష్యత్తుపై ప్రభావం పడే అవకాశం ఉందని తల్లిదండ్రులు తెలిపారు. దీనిపై సానుకూలంగా స్పందించిన సుధీర్‌రెడ్డి.. క్రీడల శాఖ మంత్రి శ్రీహరితో మాట్లాడి రెండు అసోసియేషన్లను ఒకే వేదికపైకి తీసుకొచ్చి సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని చెప్పారు. అసోసియేషన్లు ఏకతాటిపైకి రాకపోయినా 64వ జాతీయ స్థాయి పోటీల్లో క్రీడాకారులకు నష్టం జరగకుండా ఎస్ఏటీ ఆధ్వర్యంలో ట్రయల్స్ నిర్వహించేలా చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు.

# ఎన్‌హెచ్‌ఎం నియామకంలో అక్రమాలు

- నకిలీ పత్రాలతో ఉద్యోగం పొందిన అభ్యర్థిపై చర్యలు తీసుకోవాలి
- డీఎంహెచ్‌వో కార్యాలయంపై ఫార్వర్డ్ బ్లాక్ ఫిర్యాదు
- నియామకంపై సమగ్ర విచారణకు కలెక్టర్ ఆదేశం
- అర్హత కలిగిన మెరిట్ అభ్యర్థికి న్యాయం చేయాలి: బండారి శేఖర్



**కరీంనగర్ బ్యూరో, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** కరీంనగర్ జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి కార్యాలయంలో నేషనల్ హెల్త్ మిషన్ (ఎన్‌హెచ్‌ఎం) కింద 2024 ఫిబ్రవరి 27న జారీ చేసిన నోటిఫికేషన్‌లోని డిస్ట్రిక్ట్ ప్రోగ్రామ్ కో-ఆర్డినేటర్ పోస్టు నియామకంలో అక్రమాలు జరిగాయని ఆల్ ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా ప్రధాన కార్యదర్శి బండారి శేఖర్ ఆరోపించారు. ఈ మేరకు సోమవారం ప్రజావాణిలో జిల్లా కలెక్టర్‌కు ఆధారాలతో కూడిన వినతిపత్రాన్ని సమర్పించారు. ఫిర్యాదుపై స్పందించిన కలెక్టర్ సమగ్ర విచారణ జరిపి నివేదిక అందించాలని జిల్లా రెవెన్యూ అధికారిని ఆదేశించారు.

నోటిఫికేషన్ నిబంధనలకు విరుద్ధంగా జాప లత అనే అభ్యర్థి నకిలీ విద్యార్హత పత్రాలతో దరఖాస్తు చేసుకున్నప్పటికీ అధికారులు ఆమెకు పోస్టు కేటాయించారని ఫార్వర్డ్ బ్లాక్ నాయకులు ఆరోపించారు. సంబంధిత అభ్యర్థిని విధుల నుంచి తొలగించి, ఇప్పటివరకు పొందిన జీతభత్యాలను రికవరీ చేయాలని డిమాండ్ చేశారు. నియామక ప్రక్రియలో అక్రమాలకు సహకరించిన అప్పటి డీఎంహెచ్‌వో, సీనియర్ అసిస్టెంట్ పందుపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని కోరారు. అక్రమ నియామకాన్ని రద్దు చేసి నోటిఫికేషన్ నిబంధనల ప్రకారం అర్హత కలిగిన మెరిట్ అభ్యర్థికి అవకాశం కల్పించాలని శేఖర్ డిమాండ్ చేశారు. గుర్తింపు లేని విద్యాసంస్థలు, నిబంధనలకు విరుద్ధంగా పొందిన డిగ్రీల చెల్లుబాటుపై న్యాయస్థానాల తీర్పులను పరిగణనలోకి తీసుకుని నియామకంపై చట్టపరంగా విచారణ జరపాలని కోరారు. కార్యక్రమంలో ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కమిటీ సభ్యుడు బద్రి నేత, బాధితుడు బాలసంకుల నగేష్ తదితరులు పాల్గొన్నారు.

# ఎమ్మెల్యేల అరెస్ట్‌పై భగ్గుమన్న బీఆర్ఎస్

- కరీంనగర్‌లో భారీ రాస్తారోకో



**కరీంనగర్ టౌన్, సెప్టెంబర్ 7, ( జనం సాక్షి) :** బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అరెస్ట్ చేయడాన్ని నిరసిస్తూ కరీంనగర్‌లో బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు. నగర బీఆర్ఎస్ అధ్యక్షుడు చల్ల హరిశంకర్ ఆధ్వర్యంలో పార్టీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో కరీంనగర్ బస్టాండ్ ఎదుటకు చేరుకుని రోడ్డుపై బైఠాయించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ నిరసన వ్యక్తం చేశారు. ఆందోళనతో ప్రధాన రహదారిపై భారీగా ట్రాఫిక్ జామ్ ఏర్పడింది.

ఈ సందర్భంగా చల్ల హరిశంకర్ మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చి వెయ్యి రోజులు పూర్తయినా అన్ని వర్గాల ప్రజలను మోసం చేసిందని ఆరోపించారు. విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్ అందడం లేదని, నిరుద్యోగులకు జాబ్ క్యాలెండర్ అమలు కాలేదని విమర్శించారు. పేదలకు ఆసరా పెన్షన్లు, రైతులకు రైతుబంధు, రైతుబీమా సక్రమంగా అందడం లేదని అన్నారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగులు కూడా తమ ప్రయోజనాల కోసం ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ప్రజా సమస్యలను అసెంబ్లీలో ప్రస్తావించేందుకు నల్లచొక్కాలు ధరించి వెళు న్న బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకుని అరెస్ట్ చేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అణచివేత ధోరణికి నిదర్శనమని హరిశంకర్ మండిపడ్డారు. ప్రజా సమస్యలపై ప్రశ్నించే గొంతును అణచివేయడం సరికాదన్నారు. అరెస్ట్ చేసిన బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను వెంటనే బేషరతుగా విడుదల చేసి, అసెంబ్లీ సమావేశాలకు హాజరయ్యేందుకు అనుమతించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ నారదాసు లక్ష్మణరావు, బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు జి.వి. రామకృష్ణరావు, మాజీ మేయర్ సర్దార్ రవీందర్‌సింగ్, మాజీ గ్రంథాలయ చైర్మన్ పొన్నం అనిల్‌కుమార్ గౌడ్, కార్పొరేటర్లు, మాజీ కార్పొరేటర్లు, డివిజన్ ఇన్‌చార్జిలు, అధ్యక్షులు, నాయకులు పాల్గొన్నారు.



## పర్యావరణహిత వేడుకలకు ప్రోత్సాహం

**పదివేల సీడ్ గణేశ విగ్రహాల పంపిణీ చేసిన ఫ్రీడమ్**

**ఖైరతాబాద్, సెప్టెంబర్ 07 (జనం సాక్షి) :** పర్యావరణ పరిరక్షణలో భాగంగా జెమినీ ఎడిబుల్స్ అండ్ ఫ్యాట్స్ ఇండియా లిమిటెడ్ (జీఈఎఫ్ ఇండియా)కు చెందిన ఫ్రీడమ్ హెల్తీ కుకింగ్ ఆయి ల్స్ 10 వేల పర్యావరణహిత సీడ్ గణేశ విగ్రహాల ను పంపిణీ చేయనున్నట్లు సీనియర్ వైస్ ప్రెసిడెం ట్(సేల్స్ అండ్ మార్కెటింగ్) పి.చంద్రశేఖర రెడ్డి తెలిపారు. సోమవారం విడుదల చేసిన ప్రకటనలో ఆయన ఈ వివరాలు వెల్లడించారు. హైదరాబాద్ లో 5 వేల, బెంగళూరులో మరో 5 వేల విగ్రహాలను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు. మార్కెటింగ్ హెడ్ చేతన్ పింపల్‌ఖుటే ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని రిడ్జ్ టవర్స్, మైహోమ్ జ్యువెల్, వన్ సిటీ, సాయి మిత్ర టవర్స్, కృష్ణకుంజ్ గార్డెనియా, రైన్‌ట్రీ పార్క్, స్వాన్‌లేక్, రెయిన్‌బో విస్టా, జనప్రియ మెట్రో పాలిస్, శాటిలైట్ అపార్ట్‌మెంట్, వెర్టెక్స్ ప్రైమ్, రెయిన్‌బో విస్టాస్ రాక్ గార్డెన్ తదితర ప్రాంతాల్లో పంపిణీ ప్రారంభమైందన్నారు. ఈ కార్యక్రమం ద్వా రా పర్యావరణ పరిరక్షణను ప్రోత్సహిస్తూ ప్రజలు సంప్రదాయబద్ధంగా వినాయక చవితి వేడుకలను జరుపుకునే అవకాశం కలుగుతుందని తెలిపారు.

# హామీలపై సమాధానం చెప్పలేక దౌర్జన్యాలు

- బీఆర్ఎస్ ఎమ్మెల్యేలపై దాడికి నిరసనగా ఆందోళన
- సీఎం రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మ దహనం
- అణచివేతలు మాని హామీలు అమలు చేయాలి: మంచిరెడ్డి



రంగారెడ్డి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి): ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన 420 హామీలపై బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు అసెంబ్లీలో నిలదీస్తారనే భయంతోనే వారిని అడ్డుకున్నారని జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే మంచిరెడ్డి కిషన్‌రెడ్డి ఆరోపించారు. అసెంబ్లీ సమావేశాల తొలిరోజు బీఆర్ఎస్ ఎమ్మెల్యేలను పోలీసులు అడ్డుకోవడం, వారిపై దౌర్జన్యానికి పాల్పడటాన్ని నిరసిస్తూ సోమవారం మంగళ్‌పల్లి గేట్ వద్ద బీఆర్ఎస్ శ్రేణులు ఆందోళన చేపట్టాయి. యువ నాయకుడు మంచిరెడ్డి ప్రశాంత్‌కుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో కార్యకర్తలు నాగార్జునసాగర్ రహదారిని సుమారు గంటపాటు దిగ్బంధించడంతో కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయాయి. పోలీసులు ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు ప్రయత్నించినా కార్యకర్తలు అడ్డుకున్నారు. ఈ క్రమంలో ఆగ్రహించిన బీఆర్ఎస్ శ్రేణులు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దిష్టిబొమ్మను దహనం చేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. అనంతరం అక్కడికి చేరుకున్న మంచిరెడ్డి కిషన్‌రెడ్డి కార్యకర్తలను సముదాయించి ట్రాఫిక్‌ను పునరుద్ధరించారు.

కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిన వంద రోజుల్లో హామీలను అమలు చేస్తామని చెప్పి.. వెయ్యి రోజులు గడిచినా వాటిని నెరవేర్చలేదని కిషన్‌రెడ్డి విమర్శించారు. 22-ఏ భూముల అంశం, 420 హామీలు, రెండు లక్షల ఉద్యోగాల భర్తీ, ఉద్యోగులు, ఉపాధ్యాయులు, విశ్రాంత ఉద్యోగుల సమస్యలు, పాలిటెక్నిక్ విద్యార్థుల ఆందోళన, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలు తదితర అంశాలపై సమాధానం చెప్పలేకనే ప్రభుత్వం అణచివేతకు పాల్పడుతోందని ఆరోపించారు. మహిళా ఎమ్మెల్యేల పట్ల పోలీసులు వ్యవహరించిన తీరు బాధాకరమన్నారు. బీఆర్ఎస్ చేపడుతున్న ఆందోళనలకు ప్రజల నుంచి స్పందన పెరుగుతుండటంతో కాంగ్రెస్ ప్రభుత్వం దిక్కుతోచని స్థితిలో ఉందని కిషన్‌రెడ్డి అన్నారు. అణచివేత చర్యలను విడనాడి ఎన్నికల హామీల అమలు, ప్రజా సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని సూచించారు. కార్యక్రమంలో సత్తు వెంకటరమణారెడ్డి, వంగేటి లక్ష్మారెడ్డి, కర్నాటి రమేష్‌గౌడ్, చిలుకల బుగ్గరాములు, చీరాల రమేష్, ఏర్పుల చంద్రయ్య, నీలం శ్వేత, మాధవి, కొప్పు జంగయ్య, గౌతంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇళ్లతో పేదల సొంతింటి కల సాకారం


**ఇందిరమ్మ ఇంటిని ప్రారంభించిన ఎమ్మెల్యే కాలే యాదయ్య**



**చేవెళ్ల, (జనంసాక్షి):** పేద, మధ్యతరగతి కుటుంబాల సొంతింటి కలను సాకారం చేయడమే ఇందిరమ్మ ఇళ్ల పథకం ప్రధాన లక్ష్యమని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. చేవెళ్ల మున్సిపాలిటీ పరిధిలోని దేవుని ఎర్రవల్లిలో బోడపోతుల శ్రీనివాస్‌గౌడ్ నిర్మించుకున్న ఇందిరమ్మ ఇంటిని ఎమ్మెల్యే కాలే యాదయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. పేద, మధ్యతరగతి కుటుంబాలకు సొంత ఇల్లు ఒక కల అని, ఆ కలను నెరవేర్చేందుకు ప్రజా ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో అర్హులైన ప్రతి కుటుంబానికి సొంతింటిని అందించేందుకు ప్రభుత్వం చర్యలు చేపడుతోందని తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా పేద కుటుంబాలకు ఆర్థిక భరోసాతో పాటు ఆత్మగౌరవంతో జీవించే అవకాశం కలుగుతుందని అన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కాలుష్య నియంత్రణ మండలి సభ్యుడు చింపుల సత్యనారాయణ రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ దేవర సమతా వెంకట్ రెడ్డి, కౌన్సిలర్లు బండారి శైలజ ఆగిరెడ్డి, కరికే మీనాక్షి సత్యనారాయణ, మాజీ ఎంపీటీసీ ఏదిరే చంద్రయ్య, కరికే మల్లేశం, పడాల ప్రభాకర్, టేకులపల్లి శ్రీనివాస్, ఎర్ర మల్లేష్, కాంగ్రెస్ పార్టీ వార్డు ఉపాధ్యక్షుడు హరిజన్ శివయ్య, బస్తేపురం వెంకటయ్య, ఏదిరే యాదయ్య, చింపుల మల్లారెడ్డి, ఏదిరే బక్కయ్య, కవలి మల్లేష్, ఎండీ జావీద్, పట్లోళ్ల రాఘవేంద్ర రెడ్డి తదితర ప్రజాప్రతినిధులు, నాయకులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటి వివాదం.. సెల్‌టవర్ ఎక్కి ఆత్మహత్య బెదిరింపు

- అధికారుల నిర్లక్ష్యంతో వివాదం ముదిరిన వైనం
- సెల్ టవర్ ఎక్కిన యువకుడు.. పురుగుల మందుతో ఆత్మహత్య బెదిరింపు
- మరోవైపు పోలీస్‌స్టేషన్‌లో మల్లయ్య హెచ్చరిక
- ఇద్దరినీ బైండోవర్ చేసిన పోలీసులు



**గన్నేరువరం, సెప్టెంబర్ 07 (జనంసాక్షి):** గన్నేరువరం మండలం చాకలివానిపల్లి గ్రామ పరిధిలోని కూనవానిపల్లిలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణంపై తలెత్తిన సివిల్ వివాదం తీవ్ర ఉద్రిక్తతకు దారితీసింది. సమస్య పరిష్కారం కోసం అధికారులను ఆశ్రయించినా స్పందన లేకపోవడంతో కూన సతీష్ సోమవారం సెల్ టవర్ ఎక్కి ఆందోళనకు దిగాడు. తన సమస్య పరిష్కరించకపోతే పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానని హెచ్చరించడంతో గ్రామంలో కలకలం రేగింది. కూన సతీష్ కుటుంబానికి చెందిన నాలుగు గుంటల పట్టా భూమిలో ప్రభుత్వం ఇందిరమ్మ ఇల్లు మంజూరు చేసింది. పాత ఇంటిని కూల్చి అదే స్థలంలో కొత్త ఇంటి నిర్మాణం చేపట్టగా.. అదే గ్రామానికి చెందిన కూన మల్లయ్య అభ్యంతరం వ్యక్తం చేస్తూ అడ్డుకుంటున్నట్లు సతీష్ తెలిపాడు. ఈ వివాదంపై గ్రామ పెద్దల సమక్షంలో పలుమార్లు పంచాయతీలు నిర్వహించడంతోపాటు హద్దులు కూడా కొలిపించినా సమస్య పరిష్కారం కాలేదని పేర్కొన్నాడు. ఎంపీడీవో, తహశీల్దార్, స్థానిక ఎస్సైలకు పలుమార్లు ఫిర్యాదు చేసినా క్షేత్రస్థాయిలో పరిశీలించి చర్యలు తీసుకోలేదని సతీష్ ఆరోపించాడు. దీంతో మనస్తాపానికి గురై టవర్ ఎక్కినట్లు తెలిపాడు. ఇదిలా ఉండగా.. సతీష్ ఆ స్థలంలో ఇల్లు నిర్మిస్తే తాను పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకుంటానంటూ మల్లయ్య పోలీస్‌స్టేషన్‌లో హెచ్చరించడం పరిస్థితిని మరింత ఉద్రిక్తంగా మార్చింది. సమాచారం అందుకున్న గన్నేరువరం పోలీసులు వెంటనే ఘటనాస్థలానికి చేరుకుని సతీష్‌ను కిందకు దించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించేలా వ్యవహరించిన ఇద్దరిపై చర్యలు తీసుకుని, కూన సతీష్, కూన మల్లయ్యలను గన్నేరువరం తహశీల్దార్ ఎదుట బైండోవర్ చేసినట్లు అధికారులు తెలిపారు. సివిల్ వివాదం ప్రారంభ దశలోనే రెవెన్యూ, పోలీసు అధికారులు స్పందించి ఉంటే పరిస్థితి ఇంతవరకు వచ్చేది కాదని స్థానికులు అభిప్రాయపడుతున్నారు.

# సమ్మె నోటీసు వల్లే కార్మికుల సమస్యలపై ఒప్పందం

- ఒప్పందంపై అవగాహన లేని విమర్శలు చేయడం విడ్డూరం
- గేట్ మీటింగ్‌లలో ఏఐటియుసి నేతలు



**గోదావరిఖని, జనంసాక్షి :** సింగరేణి కార్మికుల సమస్యల పరిష్కారం కోసం గుర్తింపు సంఘం ఏఐటీయుసి యాజమాన్యానికి సమ్మె నోటీసు ఇవ్వడం వల్లే 24 డిమాండ్లపై ఒప్పందం కుదిరిందని, ఇలాంటి చారిత్రాత్మక ఒప్పందంపై పలు కార్మిక సంఘాలు అవగాహన లేకుండా విమర్శలు చేయడం విడ్డూరంగా ఉందని సింగరేణి కాలరీస్ వర్కర్స్ యూనియన్ (ఏఐటీయూసీ) ప్రధాన కార్యదర్శి కొరిమి రాజ్ కుమార్, ఉప ప్రధాన కార్యదర్శులు మడ్డి ఎల్లా గౌడ్, కందికట్ల వీరభద్రం లు పేర్కొన్నారు. సోమవారం సింగరేణి ఆర్జీ-1 ఏరియాలోని జీడీకే-1 ఇంక్లైన్ మరియు ఓసీపీ-5 గనుల వద్ద జరిగిన ఏఐటియుసి గేట్ మీటింగ్ లలో వారు పాల్గొని మాట్లాడారు. జూన్ 8న 31 డిమాండ్లతో గుర్తింపు సంఘం ఏఐటీయుసి హోదా లో సమ్మె నోటీసు ఇచ్చిన అనంతరం ఆర్ఎల్సీ సమక్షంలో పలుమార్లు చర్చలు జరిగాయని, ఈ చర్చల ద్వారా అనేక డిమాండ్లపై సానుకూల నిర్ణయాలు సాధించామని తెలిపారు. ఇదంతా సమ్మె నోటీసు వల్లే సాధ్యమైందని, సమ్మె లేకుండానే డిమాండ్లను ఒప్పందం చేసుకోవడం జరిగిందని తెలిపారు. అదేవిధంగా సింగరేణికి పెండింగ్ లో ఉన్న తాడిచెర్ల-2 బ్లాక్, మణుగూరు ఓసీపీ-2 డీప్ సైడ్ బ్లాక్ ను ఏఐటీయుసి పోరుబాట వల్లే సాధించుకోవడం జరిగిందని పేర్కొన్నారు. సింగరేణిలో గుర్తింపు సంఘంగా ఉన్న టీబీజీకేఎస్ 11 సంవత్సరాలు అధికారంలో ఉండి ఒక్క అగ్రిమెంట్ చేయలేదని, నేడు ఏఐటీయూసీ రెండు సంవత్సరాలలోపు అగ్రిమెంట్ చేసుకుని హక్కులు సాధిస్తే ఓర్వలేకపోతున్నారని వారు విమర్శించారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ ఆర్జీ-1 బ్రాంచి కార్యదర్శి రంగు శ్రీను, నాయకులు మాదన మహేష్, సంకె అశోక్, బోగ సతీష్ బాబు, పెర్క మహేందర్, కలవేణి రాజేశ్, గుర్రం ప్రభుదాస్, చంద తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

## జన్వాడలో అక్రమ లేఅవుట్ నిర్మాణాలపై కూల్చివేతలు

**రాజేంద్రనగర్, సెప్టెంబర్7(జనంసాక్షి) :** నార్సింగి సర్కిల్ పరిధిలోని జన్వాడ గ్రామంలో అక్రమ లేఅవుట్, అనధికార నిర్మాణాలపై నార్సింగి టౌన్ ప్లానింగ్, హెచ్ఎండిఏ, ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు సోమవారం సంయుక్తంగా ఎన్‌ఫోర్స్‌మెంట్ చర్యలు చేపట్టారు. ఈ కూల్చివేతలో నార్సింగి ఏసిపి ప్రసీద, టిపిఓ రమేష్, టౌన్ ప్లానింగ్ సిబ్బంది పాల్గొని ,అక్రమంగా ఏర్పాటు చేసిన లేఅవుట్‌ను ధ్వంసం చేయడంతో పాటు, అక్కడి అక్రమ నిర్మాణాలు, నిర్మాణ భాగాలను కూల్చివేశారు. అనుమతులు లేకుండా లేఅవుట్లు, నిర్మాణాలు చేపడితే కఠిన చర్యలు తప్పవని అధికారులు హెచ్చరించారు. ప్రజలు, భూ యజమానులు, డెవలపర్లు ముందుగా సంబంధిత అనుమతులు పొందిన తర్వాతే నిర్మాణాలు చేపట్టాలని సూచించారు. అక్రమ లేఅవుట్లు, నిర్మాణాలపై తనిఖీలు, చర్యలు కొనసాగు తాయని తెలిపారు.

## పాస్‌పోర్ట్ పోయినది

నా పాస్‌పోర్ట్ నంబర్ A9682258 **(జగడం శ్రీనివాస్, తండ్రి: నారాయణ, ఇ.నం: 4-75/1, ఎల్లారెడ్డి పల్లె, ఇందల్వాయి)** గ్రామం నుండి నిజామాబాద్ వెళ్తుండగా పోయినది. దొరికినవారు ఈ ఫోన్ నంబర్‌కు: 7842521870 సమాచారం ఇవ్వగలరు.

జనంసాక్షి
www.janamsakshi.org
మంగళవారం
08 సెప్టెంబర్ 2026

# పోలీస్ స్టేషన్‌లో యువకుడి హైడ్రామా

- పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని పరుగులు!
- మెదక్ జిల్లా రామాయంపేటలో ఘటన



హైదరాబాద్, సెప్టెంబర్ 1 (జనంసాక్షి) : మెదక్ జిల్లా రామాయంపేటలో తీవ్ర కలకలం రేపే ఘటన చోటుచేసుకుంది. ఓ యువకుడు పోలీస్ స్టేషన్‌లోనే పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకుని ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డాడు. ఈ ఘటనతో రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో ఒక్కసారిగా ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. దీంతో కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. దుర్గాప్రసాద్ అనే యువకుడు గత కొద్దిరోజులుగా ఓ యువతిని వేధిస్తున్నాడనే ఆరోపణలపై రామాయంపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. ఈ నేపథ్యంలో పోలీసుల చర్యలపై భయాందోళనకు గురైన యువకుడు తీవ్ర నిర్ణయం తీసుకున్నాడు. పెట్రోల్‌తో పోలీస్ స్టేషన్‌కు వచ్చిన దుర్గాప్రసాద్.. అక్కడే తనపై పెట్రోల్ పోసుకుని నిప్పంటించుకున్నాడు. మంటలను గమనించిన పోలీసులు వెంటనే అప్రమత్తమై యువకుడిని రక్షించే ప్రయత్నం చేశారు. అనంతరం తీవ్ర గాయాలతో అతడిని రామాయంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ప్రస్తుతం దుర్గాప్రసాద్ పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం. ఆస్పత్రిలో వైద్యులు చికిత్స అందిస్తున్నారు. యువకుడు పోలీస్ స్టేషన్‌లోకి పెట్రోల్‌తో ఎలా వచ్చాడు? ఘటనకు ముందు ఏం జరిగింది? కేసు నమోదు చేసిన తర్వాత అతడికి పోలీసుల నుంచి ఎలాంటి చర్యలు ఎదురయ్యాయి? అనే అంశాలపై పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలు పోలీసుల విచారణ అనంతరం వెల్లడయ్యే అవకాశం ఉంది. రామాయంపేట పోలీస్ స్టేషన్ పరిధిలో జరిగిన ఈ ఘటన స్థానికంగా తీవ్ర చర్చనీయాంశంగా మారింది.

# ఏసీబీ వలలో మరో అవినీతి చేప

- రూ.10 వేల లంచం తీసుకుంటూ పట్టుబడ్డ సబ్ జైలర్



హుజురాబాద్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) : ఏసీబీ అధికారుల వలలో మరో అవినీతి చేప చిక్కింది. విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తూ, అధికార దాహంతో లంచం డిమాండ్ చేసిన హుజరాబాద్ సబ్ జైలర్ ఏసీబీ అధికారులకు పట్టుబడ్డాడు. ఒక బాధితుడి నుంచి రూ.10 వేల లంచం తీసుకుంటుండగా అధికారులు వలపన్ని పట్టుకున్నారు. వివరాలు ఈ విధంగా ఉన్నాయి...హుజరాబాద్ సబ్ జైలు పరిధిలోని ఒక పనికి సంబంధించి జైలర్ నాంపల్లి దేవేందర్ బాధితుడిని రూ.10 వేల లంచం ఇవ్వాలని డిమాండ్ చేశారు. లంచం ఇవ్వడం ఇష్టం లేని బాధితుడు ఏసీబీ అధికారులను సంప్రదించి లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేశారు. బాధితుడి ఫిర్యాదు మేరకు ఏసీబీ డీఎస్పీ గట్ల మహేందర్ రెడ్డి ఆధ్వర్యంలోని బృందం పక్కా ప్రణాళికతో వల పన్నింది. పథకం ప్రకారం బాధితుడు హుజరాబాద్ సబ్ జైలు ప్రాంగణంలోనే జైలర్ నాంపల్లి దేవేందర్ కు రూ. 10వేల నగదు అందజేస్తుండగా, అక్కడే కాపుకాసిన ఏసీబీ అధికారులు జైలర్ ను రెడ్ హ్యాండెడ్ గా పట్టుకున్నారు. నిందితుడి చేతుల నుంచి స్వాధీనం చేసుకున్న నగదుకు కెమికల్ పరీక్షలు నిర్వహించగా పాజిటివ్ అని తేలింది. అనంతరం సబ్ స్టేషన్ కార్యాలయంలో ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించి కీలక రికార్డులను పరిశీలించారు. లంచం తీసుకున్న సబ్ జైలర్ దేవేందర్ ను అదుపులోకి తీసుకున్నామని, ఆయనపై అవినీతి నిరోధక చట్టం కింద కేసు నమోదు చేసి ఏసీబీ ప్రత్యేక న్యాయస్థానంలో హాజరుపరచనున్నట్లు డీఎస్పీ గట్ల మహేందర్ రెడ్డి తెలిపారు. ప్రభుత్వ ఉద్యోగులు ఎవరైనా లంచం అడిగితే ప్రజలు నేరుగా ఏసీబీ అధికారులను సంప్రదించాలని ఆయన సూచించారు.

# ఉద్యోగాల పేరుతో యూట్యూబర్ మోసం

- శంషాబాద్ విమానాశ్రయంలో అరెస్ట్



హైదరాబాద్, సెప్టెంబర్1 (జనంసాక్షి) : ప్రముఖ యూట్యూబర్ నందనను శంషాబాద్‌లోని రాజీవ్ గాంధీ అంతర్జాతీయ విమానాశ్రయం పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆమెపై ఇప్పటికే లుకౌట్ నోటీసులు పెండింగ్‌లో ఉండటంతో విమానాశ్రయంలో ఆమెను గుర్తించి అరెస్ట్ చేశారు. అనంతరం ఆమెను ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. వివరాల్లోకి వెళితే.. నందన, ఆమె భర్త కలిసి లండన్‌లో ఉద్యోగాలు ఇప్పిస్తామని పలువురి నుంచి పెద్ద మొత్తంలో డబ్బులు వసూలు చేశారని ఆరోపణలు ఉన్నాయి. ఈ మోసంపై బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసులో భాగంగానే ఆమెపై లుకౌట్ నోటీసులు జారీ అయ్యాయి. ఈ క్రమంలో సోమవారం శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన నందనను ఇమ్మిగ్రేషన్ అధికారులు గుర్తించి, ఎయిర్‌పోర్ట్ పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే ఆమెను అదుపులోకి తీసుకుని, కేసు విచారణ చేస్తున్న ఇబ్రహీంపట్నం పోలీసులకు అప్పగించారు. ఈ ఘటనకు సంబంధించి మరిన్ని వివరాలు తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు దర్యాప్తును కొనసాగిస్తున్నారు.

# వృద్ధురాలిపై సీఐ దురుసు ప్రవర్తన

- మానవ హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు

అమరావతి, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) : బాపట్ల జిల్లా చీరాల టూటౌన్ సీఐ శశికుమార్ కార్డన్ సెర్చ్ నిర్వహిస్తూ ఓ ఇంటి బయట వృద్ధురాలితో అసభ్యంగా ప్రవర్తించడం, దూషించడంపై సర్వత్రా విమర్శలు చెలరేగుతున్నాయి. సీసీ కెమెరాలో నమోదైన ఈ దశ్యాలు సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతూ హల్‌చల్ చేస్తున్నాయి. చట్టప్రకారం, నైతికంగా ఇది ఎంత మాత్రం ఆమోదయోగ్యం కాదంటూ ప్రజా సంఘాల నేతలు మండిపడుతున్నారు. బాపట్ల జిల్లా చీరాల రెండో పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని రామ్‌నగర్‌లో తాజాగా చోటుచేసుకున్న ఘటన పోలీసు శాఖ ప్రతిష్టపై మరోసారి చర్చకు దారితీసింది. ఎస్‌టీ ఎరుకల సామాజిక వర్గానికి చెందిన ఓ వృద్ధ మహిళతో రెండో పట్టణ సీఐ శశికుమార్ వ్యవహరించిన తీరుకు సంబంధించిన వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. సెప్టెంబర్ 6వ తేదిన ఆదివారం కార్డన్ సెర్చ్ సందర్భంగా ఈ ఘటన చోటుచేసుకున్నట్లు తెలుస్తోంది. వైరల్‌గా మారిన వీడియోలో సీఐ శశికుమార్ వృద్ధ మహిళతో దురుసుగా మాట్లాడుతున్న దృశ్యాలు, అభ్యంతరకరమైన పదజాలంతో సంభాషిస్తున్నట్లు కనిపించే, వినిపించే దృశ్యాలు పోలీస్ వ్యవస్థ పట్ల ప్రజలలో మరింత అపనమ్మకాన్ని కలిగించేలా ఉన్నాయి. అసాంఘిక శక్తులపై ఉక్కుపాదం పేరుతో కొంతమంది పోలీసులు వ్యవహరిస్తున్న తీరు ఆక్షేపణీయంగా ఉంటోంది. ప్రజలకు రక్షణ కల్పించాల్సిన పోలీసు అధికారి ఒక వృద్ధ మహిళతో దురుసుగా వ్యవహరించినట్లు ఆరోపణలు రావడం తీవ్ర విమర్శలకు కారణమవుతోంది. పోలీస్‌శాఖ శాంతిభద్రతల పరిరక్షణ కోసం కార్డన్ సెర్చ్ లు నిర్వహించే హక్కు ఉన్నప్పటికీ, ఆ సమయంలో పౌరుల, ముఖ్యంగా వృద్ధులు, మహిళలు, చిన్నారుల ఆత్మగౌరవానికి భంగం కలిగించేలా ప్రవర్తించే అధికారం ఏ చట్టం ఇవ్వలేదు. పోలీసు నియమావళి ప్రకారం ప్రజలతో, ముఖ్యంగా బలహీన వర్గాలు, వృద్ధులతో సంయమనంతో, గౌరవప్రదంగా వ్యవహరించాలి. డ్యూటీలో ఉండి కూడా దురుసుగా, అసభ్యంగా ప్రవర్తించిన అధికారులపై శాఖాపరమైన క్రమశిక్షణా చర్యలు తీసుకునే అవకాశం ఉంది. ఇలాంటి ఘటనలపై బాపట్ల జిల్లా పోలీస్ సూపరింటెండెంట్ లేదా ఇతర ఉన్నతాధికారులకు సాక్ష్యాలతో కూడిన వీడియో, లేదా లిఖితపూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చు.

# గణేశ్ ఉత్సవాలకు సమగ్ర భద్రతా ప్రణాళిక

- మండపాల ఏర్పాటు నుంచి నిమజ్జనం వరకు అప్రమత్తంగా ఉండాలి
- సెప్టెంబరు 14 నుంచి ఉత్సవాలు.. 25న నిమజ్జనం
- విద్యుత్తు , ట్రాఫిక్ నియంత్రణ, జనసమూహాల నిర్వహణపై ప్రత్యేక దృష్టి
- డీజీపీ సీవీ ఆనంద్




హైదరాబాద్, సెప్టెంబరు 7 (జనంసాక్షి) : గణేశ్ ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించేందుకు రాష్ట్రవ్యాప్తంగా సమగ్ర భద్రతా చర్యలు చేపట్టాలని డీజీపీ సీవీ ఆనంద్ పోలీసు అధికారులను ఆదేశించారు. ఉత్సవాల ఏర్పాట్లపై సోమవారం డీజీపీ కార్యాలయం నుంచి రాష్ట్రంలోని ఎస్‌ఐలు, ఉన్నతాధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. సెప్టెంబరు 14న ప్రారంభమయ్యే ఉత్సవాలు.. 25న గణేశ్ విగ్రహాల నిమజ్జనంతో ముగియనున్న నేపథ్యంలో ముందస్తు ఏర్పాట్లపై దిశానిర్దేశం చేశారు. గణేశ్ మండపాల వివరాలను సేకరించి పర్యవేక్షించేందుకు ప్రత్యేక ఆన్‌లైన్ పోర్టల్ అందుబాటులోకి తెచ్చినట్లు డీజీపీ తెలిపారు. మండపం ఉన్న ప్రదేశం, నిర్వాహకులు, కమిటీ సభ్యులు, నిమజ్జనానికి వినియోగించే వాహనాల వివరాలను అందులో నమోదు చేయాలి. ఎస్‌హెచ్‌వోలకు ప్రత్యేక లాగిన్‌లు ఇచ్చినందున మండపాల వద్ద పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలి. సీపీలు, డీసీపీలు, ఎస్పీలు మండపాలను సందర్శించి పాయింట్ బుక్స్‌లో పరిశీలన వివరాలు నమోదు చేయాలని సూచించారు.

మండపాల వద్ద విద్యుత్తు, ట్రాఫిక్ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని డీజీపీ ఆదేశించారు. విద్యుత్తు, అగ్నిమాపక తదితర శాఖలతో సమన్వయం చేసుకోవాలి. మండపాల వద్ద నిర్వాహకులు స్వచ్ఛంద కార్యకర్తలను ఏర్పాటు చేసుకునేలా చూడడంతోపాటు సీసీ కెమెరాలు, క్యూల నిర్వహణకు తగిన భద్రతా ఏర్పాట్లు చేయాలని సూచించారు. గణేష్ నిమజ్జనానికి సంబంధించి మార్గాలు, రహదారులు, వంతెనలను ముందుగానే గుర్తించి వాటి సామర్థ్యాన్ని పరిశీలించాలని డీజీపీ సూచించారు. నిమజ్జన మార్గాల్లో ట్రాఫిక్, బందోబస్తు ఏర్పాట్లను ముందుగానే సిద్ధం చేయాలి. భద్రతా చర్యల్లో భాగంగా బాంబు డిస్పోజల్ బృందాలు, డాగ్ స్క్వాడ్‌లను అవసరమైన చోట వినియోగించాలని ఆదేశించారు. మండపాల ప్రాంతాలను జియో ట్యాగింగ్ చేసి భద్రతా ఏర్పాట్ల వివరాలను నమోదు చేయాలని డీజీపీ సూచించారు. జియో ట్యాగింగ్, తనిఖీల వివరాలను టీజీ-కాప్ ప్లాట్‌ఫాంలోనూ అప్‌లోడ్ చేయాలన్నారు. గణేశ్ ఉత్సవ కమిటీలు, శాంతి కమిటీలతో సమావేశాలు నిర్వహించి సమస్యలను ముందుగానే పరిష్కరించాలని డీజీపీ తెలిపారు. బందోబస్తు విధుల్లో పాల్గొనే పోలీసు సిబ్బందికి ప్రత్యేకంగా బ్రీఫింగ్ నిర్వహించాలి. సామాజిక మాధ్యమాలపై నిఘా ఉంచి శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అంశాలపై తక్షణమే స్పందించాలని సూచించారు. అన్ని శాఖలు, ఉత్సవ కమిటీలు, ప్రజల సమన్వయంతో ఉత్సవాలను ప్రశాంతంగా నిర్వహించాలని డీజీపీ సీవీ ఆనంద్ పేర్కొన్నారు. సమావేశంలో డీజీ టెక్నికల్ సర్వీసెస్ వి.వి. శ్రీనివాసరావు, ఐజీ ఇంటెలిజెన్స్ కార్తికేయ, ఐజీ మల్టిజోన్-1 చంద్రశేఖర్‌రెడ్డి, టీస్పార్క్ ఎస్పీ రూపేష్, ఏఐజీ రమణకుమార్, హైదరాబాద్ డీసీపీ అవినాష్‌కుమార్, డీసీపీ విక్రాంత్‌కుమార్ సింగ్‌తో పాటు ఇతర పోలీసు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# 19న కోదాడలో మెగా జాబ్‌మేళా

- నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పించేందుకు నిరంతర కృషి అవసరం
- మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి



హైదరాబాద్ (జనంసాక్షి) : నిరుద్యోగం నేడు మన సమాజం ఎదుర్కొంటున్న అత్యంత తీవ్రమైన సమస్యల్లో ఒకటని రాష్ట్ర నీటిపారుదల, ఆహార, పౌర సరఫరాల శాఖ మంత్రి కెప్టెన్ ఎన్. ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. విద్యావంతులైన యువతకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించడం ప్రభుత్వం, పరిశ్రమలు, ప్రైవేట్ సంస్థలు, నైపుణ్యాభివృద్ధి సంస్థల సమష్టి బాధ్యత అని పేర్కొన్నారు. నిరుద్యోగ సమస్య ఒక్కరోజులో లేదా ఒక్క జాబ్ మేళాతో పూర్తిగా పరిష్కారం కాదని మంత్రి స్పష్టం చేశారు. యువత విద్యార్హతలు, నైపుణ్యాలకు అనుగుణంగా ఉద్యోగ అవకాశాలు కల్పించేందుకు నిరంతర, ప్రణాళికాబద్ధమైన కార్యక్రమాలు నిర్వహించాల్సిన అవసరం ఉందన్నారు. ఉద్యోగాల కోసం ఎదురుచూస్తున్న యువతను నియామక సంస్థలతో నేరుగా అనుసంధానం చేయడం ఎంతో ముఖ్యమని తెలిపారు.తన 32 ఏళ్ల ప్రజాజీవితంలో ఎమ్మెల్యేగా, ఎంపీగా, మంత్రిగా, టీపీసీసీ అధ్యక్షుడిగా సాధ్యమైనంత మంది నిరుద్యోగ యువతకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు నిరంతరం కృషి చేశానని ఉత్తమ్ కుమార్ రెడ్డి తెలిపారు. ఈ ప్రయత్నాలను భవిష్యత్తులో మరింత విస్తృతంగా కొనసాగిస్తామని చెప్పారు.సెప్టెంబర్ 19వ తేదీ శనివారం ఉదయం 8 గంటల నుంచి రాత్రి 8 గంటల వరకు కోదాడ పట్టణంలోని సి.సి. రెడ్డి కాన్వెంట్ స్కూల్‌లో మెగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మంత్రి ప్రకటించారు. తెలంగాణ ప్రభుత్వ పరిశ్రమల శాఖ, సింగరేణి కాలరీస్ కంపెనీ లిమిటెడ్ సహకారంతో ఈ కార్యక్రమం జరుగుతుందని, అవసరమైన ఆర్థిక సహాయాన్ని సింగరేణి సంస్థ సీఎస్ఆర్ నిధుల ద్వారా అందిస్తుందని తెలిపారు. 2025 అక్టోబర్‌లో నిర్వహించిన హుజూర్‌నగర్ మెగా జాబ్ మేళాకు దాదాపు 40 వేల మంది నమోదు చేసుకోగా, 20,463 మంది ఇంటర్వ్యూలకు హాజరయ్యారని గుర్తుచేశారు. వారిలో 2,041 మంది ఉద్యోగాలకు ఎంపిక కాగా, మరో 1,533 మంది తదుపరి నియామకాల కోసం షార్ట్‌లిస్ట్ అయ్యారని తెలిపారు. మొత్తం 3,574 మంది యువతకు ప్రత్యక్షంగా లేదా భవిష్యత్తులో ఉపాధి పొందే అవకాశం లభించిందన్నారు.

కోదాడ ఎమ్మెల్యే ఎన్. పద్మావతి రెడ్డి కన్వీనర్‌గా జాబ్ మేళా నిర్వహణ కమిటీని ఏర్పాటు చేసినట్లు మంత్రి వెల్లడించారు. నల్గొండ ఎంపీ కె. రఘువీర్ రెడ్డి, తుంగతుర్తి ఎమ్మెల్యే మందుల సామేల్, సూర్యాపేట జిల్లా కలెక్టర్ తేజస్ నందలాల్ పవార్, జిల్లా ఎస్పీ నరసింహ, కోదాడ ఆర్డీఓ సూర్యనారాయణ, కోదాడ మున్సిపల్ ఛైర్‌పర్సన్ ఎర్నేని కుసుమ, వైస్ ఛైర్‌పర్సన్ మల్లేశ్వరి, మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోటేశ్వరరావుతోపాటు పరిశ్రమల శాఖ, సింగరేణి సంస్థ ప్రతినిధులు కమిటీలో సభ్యులుగా ఉంటారని తెలిపారు.

అభ్యర్థుల నమోదు, కంపెనీల భాగస్వామ్యం, ప్రచారం, ఇంటర్వ్యూ సదుపాయాలు, రవాణా, భద్రత, ఆహారం, తాగునీరు, పారిశుద్ధ్యం తదితర ఏర్పాట్లను కమిటీ సమన్వయం చేస్తుందని మంత్రి పేర్కొన్నారు. కార్యక్రమ తేదీ సమీపించే నాటికి మరికొందరు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతర ప్రముఖులను నిర్వహణ కమిటీలో చేర్చనున్నట్లు తెలిపారు. నిర్వహణ కమిటీ తొలి సమావేశం సెప్టెంబర్ 10న సాయంత్రం 5 గంటలకు సచివాలయంలో జరుగుతుందని వెల్లడించారు.

# మ్యాట్రీమోనీ పేరుతో భారీ మోసాలు

- ఫాక్ మ్యాట్రిమోనీతో డబ్బులు వసూలు

హైదరాబాద్, సెప్టెంబర్ 7 (జనంసాక్షి) : పెళ్లి కుదరాలి.. పిల్లల జీవితం బాగుండాలి.. అనే తల్లిదండ్రుల ఆశ పడుతుంటారు. తమ స్థాయికి మించి కూడా మంచి సంబంధాల కోసం వెతుకుతుంటారు. బంధువులు తెలిసిన వారితో పాటు ఇటీవల కాలంలో మ్యాట్రీమోనీలను కూడా ఆశ్రయిస్తున్నారు. అయితే తల్లిదండ్రుల ఆశను ఆసరాగా చేసుకుని కొందరు సైబర్ కేటుగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారు. తాజాగా ఇలాంటి ఘటనే నల్గొండ జిల్లాలో వెలుగు చూసింది. మీ అమ్మాయికి పెళ్లి సంబంధం చూస్తున్నారా? పెళ్లి కుదిరిందానండీ.. మాది పలానా మ్యాట్రీమోనీ.. మీ అమ్మాయికి తగిన సంబంధాలు మావద్ద ఉన్నాయి. అబ్బాయి ప్రొఫైల్ పెట్టామంటారా.. అంటూ కేటుగాళ్లు ఫోన్ లో అడుగుతారు. తల్లిదండ్రులు ఆసక్తి చూపగానే వెంటనే వాట్సాప్‌లో ఓ అందమైన అబ్బాయి ఫొటో.. దాంతోపాటు ఆకట్టుకునే ప్రొఫైల్ పంపిస్తారు. ఎన్‌ఆర్‌ఐ.. డాక్టర్.. సాఫ్ట్‌వేర్ ఇంజినీర్.. భారీ జీతం.. కోట్ల విలువైన ఆస్తులు అంటూ ప్రొఫైల్‌ను నమ్మేలా చేస్తారు. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. అబ్బాయి నచ్చాడని చెప్పగానే అసలు కథ మొదలవుతుంది. మీ పేరు రిజిస్టర్ చేయాలంటే రూ.5 వేలు పంపండి. అబ్బాయి తల్లిదండ్రుల ఫోన్ నంబర్ ఇస్తాం. మరికొన్ని మంచి ప్రొఫైల్స్ కూడా పంపిస్తాం అంటూ నమ్మిస్తారు. పెళ్లి సంబంధం కుదిరే ఆశతో తల్లిదండ్రులు డబ్బులు పంపిస్తారు. డబ్బులు అందిన కొద్దిసేపటికే అబ్బాయి తల్లిదండ్రుల పేరుతో ఓ ఫోన్ నంబర్ ఇస్తారు. కానీ ఆ నంబర్‌కు కాల్ చేస్తే.. "ఈ నంబర్ ప్రస్తుతం పనిచేయడం లేదు" అనే సమాధానం వస్తోంది. మ్యాట్రిమోనీకి ఫోన్ చేస్తే.. స్విచ్ఛాఫ్ వస్తుంది. వాట్సాప్‌లో పంపిన ప్రొఫైల్ లేదు.. ఫోన్ కాల్ చేసిన వ్యక్తి లేడు.. డబ్బులు మాత్రం తిరిగి రాక తల్లిదండ్రులు సైబర్ కేటుగాళ్ల చేతిలో మోసపోతున్నారు. వీటితోపాటు మరో తరహాలోనూ ఈ మోసాలు జరుగుతున్నాయి. ముందుగా పేరున్న మ్యాట్రిమోనీ సంస్థల్లో కొంత మొత్తాన్ని చెల్లించి.. అక్కడి ప్రొఫైల్స్‌ను పరిశీలిస్తారు. పక్కా వ్యూహంతో వారికి నచ్చిన ప్రొఫైల్స్ పట్టుకుని వేటకు బయలు దేరుతారు. ఎక్కువ కాలంగా సంబంధం కోసం ఎదురుచూస్తున్న కుటుంబాలు.. వయసు దాటిపోతున్న యువతీ యువకులు.. రెండో పెళ్లి కోసం చూస్తున్నవారు.. ఇలా ప్రత్యేకంగా టార్గెట్ చేసుకుంటారు. ఆ తర్వాత తామే మ్యాట్రిమోనీ నిర్వాహకులమని పరిచయం చేసుకుని.. మీకు మంచి సంబంధం కుదురుస్తాం అంటూ రూ.5 వేల నుంచి రూ.10 వేల వరకు అడ్వాన్స్ తీసుకుంటారు. డబ్బులు చేతికి వచ్చాక ఫోన్ ఎత్తరు. ఒకవేళ ఎత్తినా.. సంబంధం మాట్లాడుతున్నాం.. కొంత సమయం పడుతుంది అంటూ కాలయాపన చేస్తారు. చివరకు పూర్తిగా అందుబాటులో లేకుండా పోతారు. మ్యాట్రిమోనీ సంస్థల పేరుతో మోసగాళ్లు పక్కా వ్యూహంతో బాధితులను మోసం చేస్తున్నారు. ఒక్కొక్కరి నుంచి రూ.5 వేలు.. రూ.10 వేలు మాత్రమే తీసుకుంటారు. బాధితులు కూడా "ఇంత చిన్న మొత్తానికి పోలీసులకు ఫిర్యాదు చేసేందుకు తల్లిదండ్రులు ఆసక్తి చూపడం లేదు. కానీ ఇలాంటి వాళ్లు పదుల సంఖ్యలో.. వందల సంఖ్యలో కుటుంబాలను టార్గెట్ చేస్తే.. అదే పెద్ద మొత్తంగా మారుతుంది. ఈ తరహా మ్యాట్రిమోనీ కాల్స్ ఉమ్మడి నల్లగొండ, కరీంనగర్, నిజామాబాద్, హైదరాబాద్ ప్రాంతాల నుంచి వస్తున్నట్లు తల్లిదండ్రులు చెబుతున్నారు. చిన్న మొత్తాల్లోనే మోసం చేస్తుండటంతో చాలామంది బాధితులు పోలీసులకు ఫిర్యాదు చేయడం లేదు. అందుకే బయటకు కనిపించే కేసుల కంటే.. వాస్తవంగా మోసపోయిన వారి సంఖ్య ఎక్కువగా ఉండే అవకాశం ఉందనే అనుమానాలను పోలీసులు వ్యక్తం చేస్తున్నారు. ఇలాంటి మోసాలపై ఫిర్యాదు చేస్తే చర్యలు తీసుకుంటామని పోలీసులు చెబుతున్నారు.మ్యాట్రిమోనీ పేరుతో ఫోన్ వస్తే వెంటనే నమ్మొద్దని పోలీసులు, సైబర్ నిపుణులు సూచిస్తున్నారు. సంస్థ పూర్తి వివరాలు తెలుసుకోవాలనీ, కార్యాలయ చిరునామా, సంప్రదింపు వివరాలు పరిశీలించాలనీ సూచిస్తున్నారు గుర్తింపు లేని వ్యక్తిగత నంబర్లకు డబ్బులు పంపకూడదనీ, అబ్బాయి, కుటుంబ సభ్యుల వివరాలను స్వతంత్రంగా తెలుసుకోవాలని, ఫొటోలు, ఉద్యోగం, ఆస్తుల వివరాలను మాత్రమే నమ్మకూడదనీ సైబర్ నిపుణులు చెబుతున్నారు తొందరపెట్టి డబ్బులు అడిగితే అప్రమత్తం కావాలనీ, మోసం జరిగితే చెల్లింపు వివరాలు, ఫోన్ నంబర్లు, వాట్సాప్ చాట్స్, ప్రొఫైల్ ఫొటోలు భద్రపరచాలనీ సూచిస్తున్నారు.

## నేడు డిగ్రీ, పీజీ కళాశాలల బంద్

హైదరాబాద్ (జనంసాక్షి) : తెలంగాణలో ప్రైవేటు డిగ్రీ, పీజీ కళాశాలల యాజమాన్యాలు కందంతొక్కాయి. ప్రభుత్వం నుంచి పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ ప్రైవేటు పీజీ, డిగ్రీ కాలేజెస్ మేనేజ్‌మెంట్ అసోసియేషన్ (టీపీడీఎంఏ) రాష్ట్రవ్యాప్తంగా బంద్‌కు పిలుపునిచ్చింది. దీంతో ప్రైవేటు డిగ్రీ, పీజీ కాలేజీలు మూతపడనున్నాయి. ప్రభుత్వ తీరుపై మండిపడుతున్న యాజమాన్యాలు కేవలం బంద్‌తోనే సరిపెట్టకుండా వరుస నిరసనలకు సిద్ధమయ్యాయి. బంద్ తర్వాతి రోజు రాష్ట్రవ్యాప్తంగా అన్ని పట్టణాల్లోనూ మానవహారాలు నిర్వహించనున్నట్లు టీపీడీఎంఏ ప్రతినిధులు పేర్కొన్నారు. ప్రభుత్వ ప్రతినిధులు, అధికారుల నుంచి స్పష్టమైన హామీ వచ్చే వరకు తమ ఆందోళనలను విరమించే ప్రసక్తే లేదని తేల్చిచెప్పారు. కొంతకాలంగా ఫీజు బకాయిలు విడుదల కాకపోవడంతో ప్రైవేటు కళాశాలల నిర్వహణ భారంగా మారిందని యాజమాన్యాలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. అధ్యాపకులు, సిబ్బందికి జీతాలు చెల్లించలేని దుస్థితి నెలకొందని వాపోతున్నారు. కనీసం ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి బకాయిలను విడుదల చేయాలని, లేనిపక్షంలో భవిష్యత్తులో నిరవధిక సమ్మెకు దిగుతామని ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు తీవ్ర స్థాయిలో హెచ్చరించాయి.

## అనుమతులు లేని వెంచర్ ధ్వంసం..



హైదరాబాద్ (జనంసాక్షి) : 111 జీవో పరిధిలో అనుమతులు లేకుండా ఏర్పాటు చేసిన భారీ వెంచర్‌ను నార్సింగి టౌన్ ప్లానింగ్ అధికారులు సోమవారం కూల్చివేశారు. సర్కిల్ పరిధిలోని జన్వాడ గ్రామంలో ఎలాంటి అనుమతులు లేకుండా, నాలా కన్వర్షన్ చేయకుండా కొందరు సుమారు 60 ఎకరాలకు పైగా స్థలంలో వెంచర్ ఏర్పాటు చేసి అందులో నిబంధనలకు విరుద్ధంగా విద్యుత్ కనెక్షన్లు తీసుకొని వీధి దీపాలు ఏర్పాటు చేశారు. అదేవిధంగా భారీగా రోడ్లు, డ్రైనేజీ వ్యవస్థను పొందుపరిచారు. చాలా నెలలుగా ఈ తతంగం నడుస్తున్నా టౌన్ ప్లానింగ్ అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఈ విషయమై ఇటీవల మీడియాలో కథనాలు వెలుపడ్డాయి. ఈ నేపథ్యంలో ఆయా విభాగాల అధికారులు చర్యలకు ఉపక్రమించారు. శనివారం టౌన్ ప్లానింగ్ ఏసీపీ ప్రసీదా, టీపీఎస్ రమేష్ మున్సిపల్ సిబ్బంది వెంచర్ సందర్శించి వివరాలు సేకరించారు. నోటీసు ఇచ్చి వెంటనే కూల్చి వేస్తామని అధికారులు వెల్లడించారు. తాజాగా సోమవారం నార్సింగి టౌన్ ప్లానింగ్ అధికారులు జేసీబీలతో వెంచర్‌ను ధ్వంసం చేశారు. నిబంధనలకు విరుద్ధంగా తిరిగి పనులు చేస్తే కఠిన చర్యలు తప్పవని ఏసీపీ ప్రసీద, టౌన్ ప్లానింగ్ టీపీఎస్ రమేష్ హెచ్చరించారు.

Printed, Published and Owned by M.M.RAHMAN Printed at M/s. Manair Enterprises, Plot No. 16E/4, IDA, Kattedan, Ranga Reddy Dist, Telangana - 500077, Published at Flat No. 301, 8-2-273, 276 & 277, 3rd Floor,Pavani Estate, Indradhanush Complex,Road No. 2, Banjara Hills,Hyderabad – 500034, Telangana, Editor : M.M.RAHMAN RNI No. APTEL/2013/50370